www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శుక్రవారం | 5-9-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 | సంచిక (Issue) : 141 | విజయవాడ సిటీ**

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి తె.3.13 తదుపరి చతుర్దశి, నక్షత్రం: శ్రవణం రా.11.38 తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.3.31-5.04, దుర్ముహూర్తం: ఉ.8.32-9.21, మ.12.38-1.27, అమృతఘడియలు: మ.1.16-2.52, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఈ ఏడాది అమ్మకాల్లో 7% వృద్ధి

చిన్న కార్ల అమ్మకాలు పుంజుకునే అవకాశం

ఆటోమొబైల్ పరిశ్రమ అంచనా

న్యూఢిల్లీ: జీఎస్‌టీ రేట్ల హేతు బద్ధీకరణతో దేశంలో కార్ల మార్కెట్ వృద్ధి రేటు మళ్లీ గాడిలో పడుతుందని ఆటోమొబైల్ పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అమ్మకాల వృద్ధి రేటు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 1 నుంచి 2 శాతానికి మించి ఉండకపోవచ్చని నిన్న మొన్నటి వరకు పరిశ్రమ వర్గాలు అంచనా వేశాయి. జీఎస్‌టీ మండలి తాజా నిర్ణయంతో ఎంట్రీ లెవల్ కార్లపై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గనుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ అమ్మకాల వృద్ధి రేటు 7 శాతం వరకు ఉండే అవకాశం ఉందని మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) చైర్మన్ ఆర్‌సీ భార్గవ చెప్పారు. పండగల సీజన్ నుంచే ఈ తగ్గింపు అమల్లోకి రావడం మరింత శుభ పరిణామమన్నారు. ఈ నిర్ణయంతో దేశంలో ఎంట్రీ లెవల్ కార్ల ధరలూ 8.5 నుంచి 9 శాతం (రూ.45,000 నుంచి రూ.50,000) తగ్గి వాటి అమ్మకాలూ మరింత పుంజుకునే అవకాశం ఉందన్నారు. కొన్ని ఎంట్రీలెవల్ మోడల్ కార్ల ధర అయితే రూ.లక్ష వరకు కూడా తగ్గే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ షురూ

సీబీఐసీ చీఫ్ సంజయ్

మారిన జీఎస్‌టీ రేట్లకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్ ప్రక్రియ ఊపందుకుంది. కొత్త జీఎస్‌టీ రేట్లు అమల్లోకి వచ్చే ఈ నెల 22వ తేదీ లోపే ఈ ప్రక్రియ పూర్తవుతుందనే నమ్మకం ఉందని కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ చెప్పారు. ఇందుకోసం కంపెనీలతోనూ చర్చిస్తున్నట్టు తెలిపారు. సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేస్తేనే కొత్త జీఎస్‌టీ రేట్ల అమలు సాఫీగా జరుగుతుందన్నారు. అప్పుడు కంపెనీలు కూడా తమ రిటర్న్‌లను సాఫీగా అప్‌లోడ్ చేయగలుగుతాయని అగర్వాల్ చెప్పారు.

సిమెంట్ ధర రూ.30 వరకు తగ్గే చాన్స్

సిమెంట్‌పై ఉన్న 28 శాతం జీఎస్‌టీని 18 శాతానికి తగ్గించడంపై సిమెంట్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. దీనివల్ల ధరలు తగ్గి మౌలిక సదుపాయాల రంగం ఊపందుకుంటుందని సిమెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (సీఎంఏ) తెలిపింది. దీంతో 50 కిలోల బస్తా సిమెంట్ ధర రూ.25 నుంచి రూ.30 వరకు తగ్గవచ్చని జేఎం ఫైనాన్సియల్ ఇనిస్టిట్యూషనల్ సెక్యూరిటీస్ సంస్థ అంచనా. కాగా ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో హోల్‌సేల్ మార్కెట్లో బస్తా సిమెంట్ ధర రూ.370 నుంచి రూ.385 వరకు ఉంది. జీఎస్‌టీ తగ్గింపుతో ఇది రూ.15 నుంచి రూ.20 వరకు తగ్గే అవకాశం ఉందని హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఒక సిమెంట్ కంపెనీ ఉన్నతాధికారి 'ఆంధ్రజ్యోతి బిజినెస్'తో చెప్పారు.

జీఎస్‌టీ తగ్గింపు సరైన చర్య



డెయిరీ ఉత్పత్తులపై జీఎస్‌టీ తగ్గింపు సకాలంలో తీసుకున్న సరైన చర్య. సగటు గృహస్థులు అధికంగా వినియోగించే పన్నీర్‌ను జీఎస్‌టీ శ్లాబ్‌లోకి తేవడం, నెయ్యి, వెన్న, చీజ్‌పై రేటును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించడం వల్ల వారికి ఎంతో ఊరట కల్పిస్తుంది. అత్యధిక నాణ్యత గల, బ్రాండెడ్ ఉత్పత్తులు.. అవ్యవస్థీకృత రంగ ఉత్పత్తులతో దీటుగా పోటీ పడే అవకాశం ఏర్పడుతుంది. ఈ తగ్గింపు ప్రయోజనాన్ని మేం పూర్తిగా వినియోగదారులకే పంచాలని భావిస్తున్నాం. రేట్ల పరివర్తన ప్రక్రియ సరళంగా సాగేందుకు భాగస్వాములు, పంపిణీదారులతో కలిసి మేం పని చేస్తున్నాం. పెరగనున్న డిమాండ్‌కు దీటుగా ఉత్పత్తి సామర్థ్యాలు పెంచేందుకు మేం ఎదురుచూస్తున్నాం.

- నారా భువనేశ్వరి, వైస్ చైర్‌పర్సన్, ఎండీ, హెరిటేజ్ ఫుడ్స్

ఆరంభ ఉత్సాహం ఆవిరి

- జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో ప్రారంభంలో సెన్సెక్స్ 889 పాయింట్లు అప్
- చివరికి స్వల్ప లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబై: జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు గురువారం ట్రేడింగ్ ఆరంభంలో భారీగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ 888.96 పాయింట్ల లాభంతో 81,456.67 ట్రేడింగ్ ప్రారంభించింది. సూచీకిదే ఇంట్రాడే గరిష్ఠ స్థాయి కూడా. జీఎస్‌టీ తగ్గింపుతో అధికంగా లబ్ధి పొందనున్న ఆటోమొబైల్, ఎఫ్ఎంసీజీ, సిమెంట్, ఇన్సూరెన్స్ రంగాల షేర్లలో ఇన్వెస్టర్లు భారీగా కొనుగోళ్లు జరపడం ఇందుకు దోహదపడింది. అయితే, ఆరంభంలోని ఉత్సాహం క్రమంగా నీరుగారుతూ వచ్చింది. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ సహా ఇతర రంగాల షేర్లలోనూ లాభాల స్వీకరణ కారణంగా క్రమంగా తగ్గుతూ వచ్చిన సూచీలు చివరికి స్వల్ప లాభాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. సెన్సెక్స్ కేవలం 150.30 పాయింట్ల వృద్ధితో 80,718.01 వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సూచీ 738 పాయింట్లు తగ్గింది. మరోవైపు ఆరంభంలో 25,000 స్థాయికి చేరువైన నిఫ్టీ.. చివరికి 19.25 పాయింట్ల లాభంతో 24,734.30 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 11 మాత్రమే రాణించాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	545
వరంగల్	537	గోదావరి	545
చిత్తూరు	578	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	



ఫెడ్‌పై ట్రంప్ పెత్తనం పెరిగితే 5,000 డాలర్లకు ఔన్స్ బంగారం?

గోల్డ్‌మన్ శాక్స్ అంచనా

దేశీయ మార్కెట్లో 10 గ్రాముల పసిడి రూ.1.50 లక్షలకు చేరువయ్యే చాన్స్!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు వేగంగా పరుగు తీస్తున్నాయి. న్యూయార్క్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి తొలిసారిగా 3,600 డాలర్లు అధిగమించింది. బుధవారం ట్రేడింగ్‌లో 3,638 డాలర్ల స్థాయి వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది. సిల్వర్ సైతం 41 డాలర్ల ఎగువకు చేరింది. అమెరికా ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలహీనపడుతుండటం, ఆ దేశ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో నిర్వహించనున్న పరపతి సమీక్షలో ప్రామాణిక వడ్డీ రేట్లను మరో 0.25 శాతం తగ్గించవచ్చన్న అంచనాలు విలువైన లోహాలకు డిమాండ్ పెంచుతున్నాయి. అలాగే, ఫెడ్ రిజర్వ్ స్వయంప్రతిపత్తికి విఘాతం కలిగించేలా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న విధానాలు బులియన్ ర్యాలీకి మరో ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, ట్రంప్ టారిఫ్‌లు, ఫెడ్ రేట్ల కోతలతో ఈ ఏడాదిలో ఇప్పటివరకు ఔన్స్ బంగారం రేటు 35 శాతం పెరిగింది. ఫెడ్‌పై ట్రంప్ పెత్తనం బంగారం ధరలను మున్ముందు మరింత ఎగదోయవచ్చని బులియన్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఫెడ్ స్వయంప్రతిపత్తికి ప్రమాదం ఏర్పడితే, వచ్చే ఏడాది ప్రథమార్థం చివరినాటికి ఔన్స్ గోల్డ్ 4,000 డాలర్ల నుంచి 5,000 డాలర్ల వరకు ఎగబాకే అవకాశాలున్నాయని అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్ దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ తాజా నివేదికలో అంచనా వేసింది. ఎందుకంటే, ఆర్థిక వృద్ధికి దోహదపడేలా వడ్డీ రేట్లను తగ్గించాలని ఫెడ్ రిజర్వ్‌పై ట్రంప్ ఒత్తిడి తెస్తున్నారు. తన డిమాండ్‌ను ఖాతరు చేయకపోవడంతో ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్‌పైను పదవి నుంచి తొలగించేస్తానని బెదిరించాడు కూడా. ఈ మధ్యనే ఫెడ్ గవర్నర్ లీసా కుక్‌ను తొలగించేందుకు ట్రంప్ చేసిన ప్రయత్నం అమెరికా సెంట్రల్ బ్యాంక్ స్వయం ప్రతిపత్తిని మరింత ప్రమాదంలోకి నెట్టింది.

ఫెడ్‌పై ప్రభుత్వ పెత్తనం పెరిగితే, ఒత్తిడి చేసినప్పుడల్లా వడ్డీ రేట్లు తగ్గించాల్సిన పరిస్థితి వస్తుందని.. తత్ఫలితంగా దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణ (ధరల) నియంత్రణ లక్ష్యాలకు విఘాతం కలగవచ్చని, అమెరికా కరెన్సీ విలువ కూడా తగ్గి ట్రెజరీ బిల్లులు, బాండ్లు వంటి డాలర్ ఆధారిత ఆర్థిక సాధనాల నుంచి పెట్టుబడులు గోల్డ్, సిల్వర్‌లోకి మళ్లే ప్రమాదం ఉందని గోల్డ్‌మన్ శాక్స్ పేర్కొంది. ఉదాహరణకు యూఎస్ ట్రెజరీ మార్కెట్లోని ప్రైవేట్ వర్గాల పెట్టుబడుల్లో ఒక శాతం బులియన్‌లోకి మళ్లినా గోల్డ్ దాదాపు 5,000 డాలర్ల వరకు ఎగబాకవచ్చని హెచ్చరించింది. అదేగనుక జరిగితే, భారత్‌లో 10 గ్రాముల బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరువ కావచ్చని బులియన్ ట్రేడర్లు భావిస్తున్నారు.

- ఎనిమిది రోజుల గోల్డ్ ర్యాలీకి తెరపడింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,000 తగ్గి రూ.1,06,070కి దిగివచ్చింది. బులియన్ ట్రేడర్లు లాభాల స్వీకరించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో బలహీన ట్రెండ్ ఇందుకు కారణం. కిలో వెండి సైతం రూ.500 తగ్గి రూ.1,25,600కి పరిమితమైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		



వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్

ఈ నెల 1 నుంచే అమల్లోకి..

ప్రస్తుతానికి ఐచ్ఛికమే..

వెండి ఆభరణాలు, వస్తువులకు హాల్‌మార్కింగ్‌ను ప్రవేశపెట్టినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఈ నెల 1 నుంచే ఇది అమలులోకి వస్తుందని, ప్రస్తుతానికిది స్వచ్ఛందమని స్పష్టం చేసింది. వెండి నగలు లేదా వస్తువుల్లో లోహ స్వచ్ఛత నిర్ధారణకు ఈ డిజిటల్ గుర్తింపు విధానం దోహదపడనుంది. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) తన హాల్‌మార్కింగ్ ప్రమాణాలను సవరించింది. గత వెర్షన్ ఐఎస్ 2112:2014ను ఐఎస్ 2112:2025తో భర్తీ చేసింది. ఈ సవరణ ద్వారా ప్రస్తుత బంగారం హాల్‌మార్కింగ్ వ్యవస్థకు అనుసంధానిస్తూ వెండి ఆభరణాలు, వస్తువులకు సైతం హాల్‌మార్కింగ్ విశిష్ట గుర్తింపు (హెచ్‌యూఐడీ) ఆధారిత హాల్‌మార్కింగ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త వ్యవస్థ ద్వారా 2025 సెప్టెంబరు 1 నుంచి వినియోగదారులు హాల్‌మార్కింగ్ చేసిన వెండి ఆభరణం లేదా వస్తువు టైపు, లోహం స్వచ్ఛత, హాల్‌మార్కింగ్ తేదీ, టెస్టింగ్ సెంటర్ వివరాలతో పాటు దాన్ని హాల్‌మార్కింగ్ చేయించిన జువెలర్ రిజిస్ట్రేషన్ నంబరును తెలుసుకోగలుగుతారు. బీఐఎస్ కేర్ మొబైల్ యాప్ ద్వారా ఈ సమాచారాన్ని పొందవచ్చు. మరిన్ని వివరాలు..

- సవరించిన ప్రమాణాల ద్వారా బీఐఎస్ ఏడు లోహ స్వచ్ఛత గ్రేడ్‌లను (800, 835, 925, 958, 970, 990, 999) ప్రవేశపెట్టింది. అందులో 958, 999 గ్రేడ్‌లు కొత్తగా ప్రవేశపెట్టినవి.
- వెండి హాల్‌మార్కింగ్‌లో మొత్తం మూడు భాగాలుంటాయి. ఒకటి సిల్వర్ అనే పదంతో కూడిన బీఐఎస్ స్టాండర్డ్ మార్క్. రెండోది లోహ స్వచ్ఛత గ్రేడ్, మూడోది హెచ్‌యూఐడీ కోడ్.
- వెండి ఆభరణాల టెస్టింగ్ కోసం దేశంలోని 87 జిల్లాల్లో బీఐఎస్ గుర్తింపు పొందిన 230 పరీక్ష, హాల్‌మార్కింగ్ కేంద్రాలు ఉన్నాయి.
- గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో 32 లక్షలకు పైగా వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్ చేసారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,860 ▼	97,950 ▼	1,37,000 ▲
విజయవాడ	1,09,300 ▲	1,03,500 ▲	1,27,500 ▲
విశాఖపట్నం	1,09,470 ▲	98,050 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,850 ▼	97,950 ▼	1,26,600 ▲
ప్రొద్దుటూరు	1,08,100 ▲	99,450 ▲	1,26,500 ▲
ముంబై	1,05,945 ▼	97,046 ▼	1,23,207 ▼



స్వియటెక్‌కు షాక్

యూఎస్ ఓపెన్

బదులు తీర్చుకొన్న అమండా ● సెమీస్‌కు ఒసాక, సినర్, ఫెలిక్స్

స్వియటెక్



అనిసిమోవా

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పోలెండ్ భామ ఇగా స్వియటెక్‌కు అనూహ్య పరాజయం ఎదురైంది. వరుస విజయాలతో జోరుమీదున్న రెండో సీడ్ స్వియటెక్‌కు క్వార్టర్స్‌లో లోకల్ స్టార్ అమండా అనిసిమోవా ఝలక్ ఇచ్చింది. కాగా, పనైపోయిందనుకొన్న మాజీ చాంపియన్ నవోమి ఒసాక మరో సంచలన విజయంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. పురుషుల డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ కూడా ఫైనల్-4లోకి అడుగుపెట్టాడు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఎనిమిదో సీడ్ అనిసిమోవా 6-4, 6-3తో స్వియటెక్‌ను వరుస సెట్లలో ఓడించింది. ఈ క్రమంలో వింబుల్డన్ ఫైనల్లో తనను చిత్తుగా ఓడించిన పోలెండ్ బ్యూటీపై అనిసిమోవా గట్టిగా బదులు తీర్చుకొంది. మూడో సీడ్ కోకో గాఫ్‌ను ఓడించిన జపాన్ ప్లేయర్ ఒసాక అదే జోరును కొనసాగించింది. 23వ సీడ్ ఒసాక 6-4, 7-6(3)తో 11వ సీడ్ కరోలినా ముచోవా (చెక్)పై గెలిచింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో టాప్ సీడ్ సబలెంకాతో జెస్సికా పెగుల, అనిసిమోవాతో ఒసాక తలపడనున్నారు.

సినర్ అలవోకగా..: డిఫెండింగ్ చాంప్ సినర్ అలవోక విజయంతో ముందంజ వేశాడు. ఇద్దరు ఇటలీ ఆటగాళ్ల మధ్య జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో సినర్ 6-1, 6-4, 6-2తో 10వ సీడ్ లొరెంజో ముసెట్టిపై వరుస సెట్లలో నెగ్గాడు. మరో మ్యాచ్‌లో 25వ సీడ్ ఫెలిక్స్ అగర్ అలియస్సిమి (స్పెయిన్) 4-6, 7-6(7), 7-5, 7-6(4)తో 8వ సీడ్ అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై పోరాడి గెలిచి కెరీర్‌లో రెండోసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరుకొన్నాడు. శనివారం జరిగే సెమీఫైనల్స్‌లో అల్కారజ్‌తో జొకోవిచ్, సినర్‌తో ఫెలిక్స్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

పురుషుల సింగిల్స్ సెమీస్
నేటి రాత్రి 12.30 నుంచి
జొకోవిచ్ x అల్కారజ్
సినర్ x ఫెలిక్స్
(శనివారం తెల్లవారుజామున 4.30 నుంచి)

సెమీస్‌లో భాంబ్రి జోడీ



భారత ఆటగాడు యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరుకొన్నాడు. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో ఇండో-కివీస్ జంట భాంబ్రి-మైకేల్ వీనస్ 6-3, 6-7(6), 6-3తో క్రొయేషియా-అమెరికా ద్వయం నికోలా మెక్టిక్-రాజీవ్ రామ్‌పై గెలిచింది.

టీటీ జట్టులో శ్రీజ, స్నేహిత్

ఆసియా టీమ్ చాంపియన్‌షిప్స్



న్యూఢిల్లీ: ఆసియా టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే భారత పురుషులు, మహిళల జట్లను గురువారం ప్రకటించారు. తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ, ఆర్. స్నేహిత్‌లకు జట్లలో చోటు లభించింది. ఈ చాంపియన్‌షిప్స్ వచ్చేనెల 11 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లో జరగనుంది.

గుకేష్‌కు గెలుపు

గ్రాండ్ స్విస్

సమర్‌ఖండ్ (ఉజ్బెకిస్థాన్): ఫిడే గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీని వరల్డ్ చాంపియన్ గుకేష్ విజయంతో ఆరంభించగా.. అర్జున్ ఇరిగేసి, ప్రజ్ఞానంద తమ గేమ్‌లను డ్రా చేసుకొన్నారు. గురువారం జరిగిన తొలి రౌండ్‌లో ఫ్రెంచ్ జీఎం ఎటెన్నీ బాక్రోట్‌పై గుకేష్ 45 ఎత్తుల్లో గెలిచాడు. స్పెయిన్ జీఎం మాక్సిమ్ చికాగ్‌తో గేమ్‌ను అర్జున్, జెఫ్రీ జియాంగ్ (అమెరికా)తో గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రా చేసుకొన్నారు. కాగా మహిళల విభాగంలో మార్సెల్‌తో గేమ్‌ను ద్రోణవల్లి హారిక డ్రా చేసుకుంది.

పవన్, సాక్షి శుభారంభం

లివర్‌పూల్ (ఇంగ్లండ్): వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో భారత బాక్సర్లు పవన్ బర్త్వల్, సాక్షి చౌధరి శుభారంభం చేశారు. మొదటి రౌండ్‌లో సాక్షి (54కి.)-హూయెల్ (ఉక్రెయిన్)పై, పవన్ (55కి.)-డగ్లస్ (బ్రెజిల్)పై నెగ్గారు. హితేశ్ (77కి.), అభినాష్ (65కి.), లవ్లీనా బోర్గొహైన్ (మహిళల 75 కి.)లకు మొదటి రౌండ్‌లో బై లభించింది. ఇక నిఖత్‌జరీన్ (51కి.) తొలి రౌండ్‌లో లొజానా (అమెరికా)తో ఆడనుంది.

మూడో స్థానం పోరులో భారత్

కాఫా నేషన్స్ కప్


హిసోర్ (తజికిస్థాన్): కాఫా నేషన్స్ కప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు మూడో స్థానం కోసం పోటీ పడనుంది. గురువారం అఫ్ఘానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌ను 0-0తో డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్‌కు వెళ్లేది. దీంతో ఇరాన్-తజికిస్థాన్ మ్యాచ్ ఫలితంపై ఆధారపడాల్సి వచ్చింది. ఈ మ్యాచ్ 2-2తో డ్రా కావడంతో భారత్ ఊపిరిపీల్చుకుంది.

శ్రేయా పాటతో..మహిళల వన్డే వరల్డ్‌కప్ షురూ

గువాహటి: మహిళల వన్డే వరల్డ్‌కప్ ఆరంభ వేడుకల్లో ప్రఖ్యాత గాయని శ్రేయా ఘోషాల్ తన గాన మాధుర్యంతో అలరించనుంది. ఈనెల 30న ఈ మెగా టోర్నీ ఆరంభం కానుంది. అదే రోజు గువాహటిలో జరిగే భారత్-శ్రీలంక జట్ల మధ్య మ్యాచ్‌కు ముందు టోర్నీ అధికారిక గీతం 'బ్రింగ్ ఇట్ హోమ్'ను శ్రేయా ఆలపించనుంది. మరోవైపు భారత్‌లో జరిగే అన్ని మ్యాచ్‌ల టిక్కెట్ల కనీస ధరలను కేవలం రూ.100కే విక్రయించనున్నట్టు ఐసీసీ ప్రకటించింది. గురువారం నుంచే ఆన్‌లైన్‌లో టిక్కెట్ల అమ్మకాలు కూడా ఆరంభమయ్యాయి.

స్పోర్ట్స్

క్రికెట్‌కు అమిత్ మిశ్రా గుడ్‌బై



న్యూఢిల్లీ: భారత వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా (42) క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 25 ఏళ్ల కెరీర్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు మిశ్రా గురువారం సోషల్ మీడియాలో తెలిపాడు. హరియాణాకు చెందిన మిశ్రా చివరిసారిగా 2017లో బెంగళూరులో ఇంగ్లండ్‌తో టీ20 మ్యాచ్ ఆడాడు. 2024దాకా ఐపీఎల్‌లో ఆడిన మిశ్రా ఇకపై అన్ని ఫార్మాట్‌లకు గుడ్‌బై చెబుతున్నట్టు తెలిపాడు. 2003లో ఢాకాలో సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో మిశ్రా వన్డేల్లో అరంగేట్రం చేశాడు. 2008లో ఆస్ట్రేలియాతో ఆడిన తన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో సత్తాచాటాడు. 2010లో జింబాబ్వేతో మ్యాచ్‌తో టీ20ల్లోకి అడుగుపెట్టాడు. భారత్ తరఫున 22 టెస్టులు, 36 వన్డేలు, 10 టీ20లలో ప్రాతినిధ్యం వహించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 156, ఐపీఎల్‌లో 166 వికెట్లు సాధించాడు.

ధవన్‌ను విచారించిన ఈడీ



న్యూఢిల్లీ: బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేసినందుకు భారత క్రికెట్ జట్టు మాజీ ఓపెనర్ శిఖర్ ధవన్ చిక్కుల్లో పడ్డాడు. గురువారం అతడిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) 8 గంటల పాటు విచారించింది. గతంలో ధవన్ 1xBETఅనే యాప్‌కు ప్రచారం చేశాడు. దీనికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు రావాలని ఇప్పటికే ఈ మాజీ ఆటగాడికి నోటీసులు పంపారు.

రుతురాజ్ భారీ శతకం



బెంగళూరు: రుతురాజ్ గైక్వాడ్ (184) శతక సహాయంతో వెస్ట్ జోన్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. దులీప్ ట్రోఫీలో భాగంగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న ఈ సెమీస్‌లో.. తొలి రోజు ఆట ముగిసే సమయానికి వెస్ట్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 363/6 స్కోరుతో నిలిచింది. నార్త్ జోన్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో సౌత్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 297/3 స్కోరు సాధించింది. ఓపెనర్ ఎన్.జగదీశన్ (148 బ్యాటింగ్) అజేయ శతకంతో నిలిచాడు.

భారత్ జోరు

- మలేసియాపై గెలుపు
- ఆసియా కప్ హాకీ



రాజ్‌గిర్ (బిహార్): ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. అపజయమెరుగని రికార్డును నిలబెట్టుకుంది. సూపర్-4లో తొలి విజయం అందుకుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో 4-1తో మలేసియాను చిత్తు చేసింది. మన్‌ప్రీత్ సింగ్ (17), సుఖ్‌జీత్ సింగ్ (19), షీలానంద్ లక్రా (24), వివేక్ సాగర్ ప్రసాద్ (38) భారత్ తరఫున గోల్స్ చేశారు. మలేసియాకు ఏకైక గోల్‌ను హసన్ షఫీక్ (1) అందించాడు. బుధవారం జరిగిన సూపర్-4 తొలి మ్యాచ్‌లో కొరియాతో మనోళ్లు డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. రెండో మ్యాచ్ గెలుపుతో లభించిన రెండు పాయింట్లతో కలిపి.. మొత్తం మూడు పాయింట్లతో సూపర్-4 పట్టికలో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. శనివారం జరిగే ఆఖరి పోరులో చైనాతో భారత్ తలపడనుంది. ఆ మ్యాచ్‌ను డ్రా చేసుకుంటే మనోళ్లకు ఫైనల్ బెర్త్ ఖాయమవుతుంది. ఇక..గురువారం జరిగిన మరో సూపర్-4 మ్యాచ్‌లో చైనా 3-0తో డిఫెండింగ్ చాంపియన్ కొరియాకు షాకిచ్చింది.

విజయంతో ఆరంభించాలని..

- థాయ్‌లాండ్‌తో భారత్ తొలిమ్యాచ్
- నేటి నుంచి మహిళల ఆసియా కప్ హాకీ



హాంగ్‌ఝూ (చైనా): ఇటీవలి కాలంలో ఓటములతో డీలాపడ్డ భారత మహిళల హాకీ జట్టు శుక్రవారం నుంచి జరిగే ఆసియా కప్‌ను విజయంతో ఆరంభించాలనుకొంటోంది. పూల్-బిలో థాయ్‌లాండ్‌తో జరిగే తమ తొలి మ్యాచ్‌లో వరల్డ్ నెం.9 భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. జపాన్, సింగపూర్ కూడా ఇదే గ్రూప్‌లో ఉన్నాయి. పూల్-ఎలో చైనా, కొరియా, మలేసియా, చైనీస్ తైపీ జట్లున్నాయి. ఈ నెల 14న ఫైనల్ జరుగుతుంది. వచ్చే ఏడాది బెల్జియంలో జరిగే వరల్డ్ కప్‌నకు క్వాలిఫయింగ్ టోర్నీ కావడంతో ప్రతి జట్టుకూ ఇది కీలకంగా మారింది. వెటరన్ గోల్ కీపర్ సవిత, ఏస్ డ్రాగ్ ఫ్లికర్ దీపిక గాయాలతో టోర్నీకి దూరం కావడం భారత్‌కు దెబ్బగానే పరిగణించాలి. వీరి గైర్హాజరీలో కెప్టెన్ సలీమా టెటే, నవ్‌నీత్ కౌర్, ఉదిత, షర్మిలా దేవి, లాల్‌రిమ్సియామి జట్టు బాధ్యత తీసుకోవాల్సి ఉంది. భారత జట్టు 2004, 2017లో ఆసియా కప్ విజేతగా నిలిచింది.

తెలుగు టైటాన్స్ తొలి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12లో ఆతిథ్య తెలుగు టైటాన్స్‌కు తొలి విజయం దక్కింది. ఇక్కడి పోర్టు రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 37-32 స్కోరుతో జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. తొలి రెండు మ్యాచ్‌ల ఓటమితో పాఠాలు నేర్చుకున్న టైటాన్స్.. ఈ మ్యాచ్‌లో వ్యూహాత్మకంగా ఆడింది. ఆట ప్రారంభం నుంచే టైటాన్స్ ఆటగాళ్లు ఆధిపత్యం ప్రదర్శించారు. దీంతో ప్రథమార్థం 16-09 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్థంలో ఒక్కసారిగా పుంజుకున్న పాంథర్స్ వరుస పాయింట్లు రాబట్టి టైటాన్స్‌ను ఆలౌట్ చేసే ప్రయత్నం చేసింది. చివరి నిమిషాల్లో టైటాన్స్ సూపర్ రైడ్స్‌తో పాయింట్లు రాబట్టి సురక్షిత స్థాయికి చేరింది. టైటాన్స్‌లో కెప్టెన్ విజయ్, భరత్ చెరో 8 పాయింట్లు...చేతన్, అజిత్ పవార్ చెరో ఐదు పాయింట్లు రాబట్టి విజయంలో కీలకపాత్ర వహించారు. పింక్ పాంథర్స్ జట్టులో రైడర్ నితిన్ కుమార్ అత్యధికంగా 13 పాయింట్లు సాధించాడు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 5-9-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

కన్న తండ్రే కాలయముడు

వీడిన ముగ్గురు చిన్నారుల అదృశ్యం మిస్టరీ

తండ్రే వేర్వేరుచోట్ల వారి ప్రాణాలు తీశాడు

పురుగు మందు తాగించి పెట్రోల్‌తో తగలబెట్టాడు

చివరికి వేరేచోటికెళ్లి తండ్రి ఆత్మహత్య

ముందుగా అతడి మృతదేహం గుర్తింపు

తెలంగాణలో పిల్లల మృతదేహాలు లభ్యం

మృతులది ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం

6

ఓ ఐఏఎస్ దుర్మార్గం!

హైదరాబాద్‌లో వివాహేతర సంబంధం

అనుమానంతో ఆమెను కొట్టిన అధికారి!

తీవ్రంగా గాయపడి ఆ మహిళ మృతి

పోలీసు కేసు కాకుండా గోల్‌మాల్

ఏమీ ఎరగనట్లుగా

విజయవాడకు వచ్చి విధులు

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి! హైదరాబాద్‌లో ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నారు. అందులోనూ అనుమానాలు, గొడవలు! అది కాస్తా ఘర్షణకు దారి తీసింది. ఆ మహిళను కొట్టడం, తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె మరణించింది. అయితే... ఆయన తన పలుకుబడినంతా ఉపయోగించి... పోలీసు కేసు కాకుండా చూసుకున్నారు. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం ఇవీ ఆ వివరాలు... ఆ సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకప్పుడు సౌమ్యుడు, మంచివాడే! ఇప్పటికీ పైకి చూడటానికి అలాగే కనిపిస్తారు. ఏపీ కేడర్‌కు చెందిన ఆయన గతంలో ఒక ముఖ్యమంత్రి పేషీలో కూడా పని చేశారు. జగన్ హయాంలో ఒక కీలకమైన శాఖకు ఆయన

మిగతా 11వ పేజీలో...



సీసాలో 'భూ'తం!

మద్యం సొమ్ముతో చెవిరెడ్డి భూముల దందా

6 కోట్లతో గూడూరులో 260 ఎకరాలు కొనుగోలు

ఆ వెంటనే అరబిందోకు రూ.26 కోట్లకు విక్రయం

ఆ డబ్బుతో తిరుపతి చుట్టూ భారీగా భూ కొనుగోళ్లు

'తుడా' నిధులతో రోడ్లు, మౌలిక వసతులు.. లేఔట్లు

ప్లాట్ల విక్రయంతో వందల కోట్ల సొమ్ము

'సిట్' సోదాల్లో సంచలనాలు వెలుగులోకి

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

'మద్యం సీసా'లోంచి అనేక అక్రమాల భూతాలు బయటపడుతున్నాయి. సొమ్ములు పోగేసుకోవడం, ఎన్నికల్లో ఓట్లు కొనడమే ప్రధాన లక్ష్యంగా జగన్ హయాంలో మద్యం విధానం రూపుదిద్దుకుంది. అయితే... ముడుపుల వసూళ్లు, రవాణాలో కీలక పాత్ర పోషించిన వారు కొంత సొమ్ము మళ్లించేసి మాయ చేశారు. అందులో... మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన భూదందా బయటపడింది. తాజాగా

మిగతా 8వ పేజీలో...

మోహిత్‌పై ప్రశ్నల వర్షం.. కేవీఎస్ ఇన్‌ఫ్రాపై ఆరా.. హార్డ్ డిస్కులు, రికార్డులు స్వాధీనం

కౌంట్‌డౌన్

పెరిగేవేంటి.. తగ్గేవేంటి.. జీఎస్టీ రేట్లు మారే 22వ తేదీపైనే అందరి దృష్టి

టీవీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లపై రూ.1,500 నుంచి 45 వేల వరకు తగ్గే చాన్స్

13 శాతం వరకు తగ్గనున్న ఐస్‌క్రీమ్ ధరలు

ద్విచక్ర వాహనాలపై 25 వేల వరకు మిగులు

జిమ్‌లు, సెలూన్లపై పన్ను 5 శాతానికి తగ్గింపు

రూ.100లోపు సినిమా టికెట్లపై తగ్గిన పన్ను

స్విగ్గీ, జొమాటో ఫుడ్ డెలివరీ కాస్త భారం

ఐపీఎల్ టికెట్లపై 40 శాతం పన్ను మోత

బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్లు మరింత ప్రియం

జీఎస్టీ లబ్ధి వినియోగదారుడికి అందేనా?

పాత, కొత్త సరుకులంటూ వ్యాపారులు

కొర్రీలు పెడతారంటూ ప్రజల్లో అనుమానాలు

సరుకు ఎప్పటిదైనా లాభం ప్రజలకు చేరాల్సిందే

విక్రయదారులు అక్రమాలకు పాల్పడితే ఫిర్యాదు చేయవచ్చు: జీఎస్టీ కమిషనర్



జీఎస్టీ శ్లాబుల కుదింపు, చాలా రకాల వస్తువుల పన్నుల్లో మార్పుతో లబ్ధి ఎంత? పన్ను తగ్గిన వస్తువుల ధరలు నేరుగా అంత శాతం తగ్గుతాయా? ఇతర అంశాల ప్రభావం ఏమైనా ఉంటుందా? ఏయే వస్తువుల రేట్లు ఎంత వరకు తగ్గుతాయి? టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషిన్ వంటివాటి నుంచి కార్లు, బైకుల దాకా ఏది కొంటే ఎంత ఆదా అవుతుంది? ఎవరెవరికి, ఎలాంటి ప్రయోజనం ఉంటుంది?.. ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే చర్చ.. కొత్త పన్ను రేట్లు అమల్లోకి వచ్చే సెప్టెంబరు 22 పైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కొత్తగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ గృహోపకరణాలు కొనుగోలు చేయాలని భావించే వారంతా 22వ తేదీ తర్వాత కొంటే ఎంత మిగులుతుందనే అంచనాలు వేసుకుంటున్నారు.

10

షి'కారు' కోసం కాస్త ఆగండి!

22 నుంచి కొత్త రేట్లతో తగ్గనున్న కార్ల ధరలు

లక్షన్నర దాకా ఆదా.. తగ్గనున్న లైఫ్ ట్యాక్స్

నిరుటితో పోలిస్తే తగ్గిన కార్ల కొనుగోళ్లు

పన్ను తగ్గింపుతో మళ్లీ పెరిగే అవకాశం



జీఎస్టీ 2.0తో డబుల్ డోస్ అభివృద్ధి

10

పేదలకు మేలు చేసేలా సంస్కరణలు: మోదీ

ప్రజలకు మేలు.. రాష్ట్ర ఖజానా కుదేలు!

ప్రభుత్వానికి ప్రతినెలా 15% నష్టం

వాణిజ్య పన్నుల శాఖ అంచనాలు

సంక్షేమం, అభివృద్ధిపైనా ప్రభావం

కేంద్రమే ఆదుకోవాలని డిమాండ్

జీఎస్టీ సెస్‌తో కేంద్రానికి 40,500 కోట్ల మిగులు

7

వెల్లడించిన ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక

ఈ నిధులతో రాష్ట్రాలకు వాటిల్లే నష్టాన్ని భర్తీ చేయాలని వినతులు

జీఎస్టీ మండలి భేటీలో హైడ్రామా!

పన్ను తగ్గింపుపై 4 రాష్ట్రాల అభ్యంతరం

తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్

రాత్రి 7 గంటలకే ముగియాల్సిన భేటీ

రెండు రాష్ట్రాల అభ్యంతరాలతో 9.30 వరకు కొనసాగిన వైనం

10

ఓటింగ్‌కు వెళ్దామన్న మరో రాష్ట్ర మంత్రి

అంగీకరించని ఆర్థిక మంత్రి నిర్మల

బెంగాల్ మంత్రి జోక్యంతో వివాదం కొలిక్కి



రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు

అందరికీ

ఆరోగ్యమస్తు!

యూనివర్సల్ హెల్త్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

ప్రతి కుటుంబానికీ రూ.25 లక్షల బీమా కవరేజ్

రాష్ట్రంలోని 1.63 కోట్ల కుటుంబాలకు లబ్ధి

3,257 చికిత్సలు ఉచితంగా పొందే అవకాశం

రూ.2.50 లక్షల వరకూ చెల్లించనున్న బీమా సంస్థలు

2.50 లక్షలు దాటితే ఎన్టీఆర్ వైద్యసేవ పరిధిలోకి

ఉద్యోగులు, పెన్షనర్లు, ఏపీఎల్ ప్రజలకూ మేలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం గొప్ప ముందడుగు వేసింది. ఇప్పటికే అమలులో ఉన్న ఆయుష్మాన్ భారత్ - ఎన్టీఆర్ వైద్య సేవా పథకంతో పాటు రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించేందుకు సిద్ధమైంది. దీనికోసం తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీకి గురువారం క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ బీమా సౌకర్యంతో రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య బీమా లభించనుంది. ప్రజల ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికీ ఏడాదికి రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం అందనుంది. ఇప్పటికే

మిగతా 11వ పేజీలో...



రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలు

పీపీపీ పద్ధతిలో ఏర్పాటు

అపోలో టైర్స్ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం

మడకశిరలో 1,197 కోట్లతో హెచ్ఎఫ్‌సీఎల్

'కడప'లో 160 మెగావాట్ల సోలార్, విండ్ ప్రాజెక్టులు

క్యాబినెట్ నిర్ణయాలు

ఫేక్‌లపై ఉక్కుపాదం

తప్పుడు ప్రచారాలపై ఉదాసీనత వద్దు.. సోషల్ మీడియా కట్టడికి చట్టం

విధివిధానాల కోసం ఉపసంఘం.. తప్పుడు విమర్శలు చేస్తే కఠినచర్యలు

కూటమి నేతలను ఎవరు విమర్శించినా కలిసికట్టుగా స్పందించండి

క్యాబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు.. పోస్టుల నివారణకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు మొదలు పెట్టింది. చట్టం విధివిధానాల రూపకల్పనకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తూ క్యాబినెట్ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, పార్థసారథి,

మిగతా 11వ పేజీలో...

నేడు ప్రధానితో లోకేశ్ భేటీ.. 'యోగాంధ్ర'పై నివేదిక!

అంబటీ.. ఇదేంటి?!

మాజీ మంత్రిపై భారీ అవినీతి ఆరోపణలు

జగనన్న కాలనీల కోసం భూముల కొనుగోలులో అక్రమాలు

ఎకరం 10 లక్షలకు కొని.. ప్రభుత్వానికి 30 లక్షలకు అమ్మకం

11

రియల్ వెంచర్లలో ల్యాండ్ కన్వర్షన్‌కు ఎకరాకు 5 లక్షలు వసూలు

ముగ్గురాయి వ్యాపారుల నుంచి ఐదేళ్లలో రూ.10 కోట్లు స్వాహా

విద్యుత్ కేంద్రాల్లో షిఫ్ట్ ఆపరేటర్ పోస్టు రూ.7 లక్షలకు అమ్మకం

విజిలెన్స్‌కు ఫిర్యాదుల వెల్లువ

విచారణకు ఆదేశించిన ప్రభుత్వం

మా మంచి మాస్టార్లు

ఈ గురువుల కృషికి వందనం

విద్యా బోధనతో పాటు సామాజిక బాధ్యత

పేద విద్యార్థులకు ఎందరో టీచర్ల సాయం

పాఠశాలల అభివృద్ధి, వసతుల కోసం లక్షల రూపాయల సొంత నిధులు ఖర్చు

బోధనతో పాటు టెక్నాలజీ, క్రీడలు, సాంస్కృతిక అంశాల్లో శిక్షణ

నేడు గురుపూజోత్సవం



తల్లీ తండ్రీ తర్వాతి స్థానం గురువుదే!
చివరికి... ఆ దైవమైనా గురువు తర్వాతే!

ఉపాధ్యాయుడంటే కేవలం పాఠాలు చెప్పేవారు కాదు! ఒక మిత్రుడిలా ఆదరించి... ఒక మార్గదర్శిగా చెయ్యిపట్టుకుని నడిపించి... సరైన తోవ చూపించే తాత్వికుడు! కాలగమనంలో ఎవరినైనా మరిచిపోతారు... కానీ, ఒక మంచి టీచర్‌ను మాత్రం జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు! నలుగురు బాల్య మిత్రులు కలిస్తే... వారి మాటల్లోకి 'బడి' వచ్చి తీరుతుంది. 'ఫలానా మాస్టారు' అనగానే ఒక ఆనందం! వారు చెప్పిన పాఠం మళ్లీ వినిపిస్తుంది. చేతిపై పడిన బెత్తం దెబ్బ తియ్యగా గుర్తుకొస్తుంది. పెరిగి పెద్దై ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా సరే... ఆ మంచి గురువు కనిపించగానే చేతులు జోడించాలనిపిస్తుంది. ఇది.. ఉపాధ్యాయ వృత్తికి మాత్రమే లభించే ప్రత్యేక గౌరవం! బాలలను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న గురువులు ఎందరో! అందులోనూ కొందరు మరింత ప్రత్యేకం! వారికి బోధన కేవలం ఒక వృత్తి కాదు! మది నిండా పెంచుకున్న ఆసక్తి, అనురక్తి! వారు పని చేసేది జీతం కోసం మాత్రమే కాదు... పిల్లల బతుకులను తీర్చిదిద్దడం కోసం! ఇందుకు సొంత సొమ్ము ఖర్చు పెట్టేవారున్నారు. శ్రమను లెక్కచేయని వారున్నారు. సమయాన్ని వెచ్చించే వారున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను, పిల్లల అవగాహనా స్థాయి విసిరే సవాళ్లను తట్టుకుని అంకిత భావంతో, ఆసక్తితో, వినూత్నంగా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు ఎందరో! అలాంటి మంచి మాస్టార్లలో కొందరి గురించి...

నేడు 'గురుపూజోత్సవం' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం 12లో

ఈజీగా ఇంగ్లిష్..



ఈ టీచర్ పేరు ఆసుపాన మధుబాబు. శ్రీకాకుళం జిల్లా బ్రాహ్మణతర్లా జడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్. గ్రామీణ విద్యార్థులకు ఇంగ్లిష్ పట్ల భయాన్ని తొలగించి వినూత్న తరహాలో బోధిస్తున్నారు. టాయ్‌బేస్డ్ పెడగాజీ, డిజిటల్ విద్యావిధానం ద్వారా సులభంగా నేర్చుకునేలా చెబుతున్నారు.

స్థానికానికి చిక్కులు!

బీసీ కులగణన జరిపాకే ఎన్నికలు

షెడ్యూల్ ప్రకారం జనవరి నాటికి స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగాలి

అప్పటికి కులగణన ప్రక్రియ పూర్తయ్యేనా?

స్థానికంలో 34% రిజర్వేషన్ అమలుకు కూటమి ఇచ్చిన హామీ కూడా అప్పుడే సాధ్యం!

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు శంఖారావం మోగిందోలేదో, అంతలోనే చిక్కులు మొదలయ్యాయి. ఎన్నికలకు ముందే బీసీ కులగణన పూర్తిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వాన్ని కోరడంతో, షెడ్యూల్ లోపు మునిసిపాలిటీ ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్లు

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'సుప్రీం'లో సుంకాల పోరు

మిగతా ప్రపంచంమీద తాను సాగిస్తున్న సుంకాల సమరం అమెరికా ప్రయోజనాల పరిరక్షణకే కాదు, యుద్ధ నివారణకూ, ప్రపంచశాంతికీ కూడా అత్యంత ముఖ్యమని సుప్రీంకోర్టులో ట్రంప్ చెప్పుకున్నారు. దిగుమతులపై సుంకాలు విధించేందుకు ఫెడరల్ చట్టాల ప్రకారం అధ్యక్షుడికి విస్తృతమైన అధికారాలున్నాయని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. ఆర్థిక అత్యయిక అధికారాలు వాడి సుంకాలు ప్రయోగించడం చట్ట విరుద్ధమంటూ అప్పీల్స్‌కోర్టు తీర్పు చెప్పిన నేపథ్యంలో, ట్రంప్ ప్రభుత్వం అమితవేగంతో సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో పాటు, వెంటనే విచారణ ఆరంభించి, తీర్పు త్వరితంగా వెలువడేట్టు చూడాలని కూడా విజ్ఞప్తి చేసుకుంది. ఐదునెలలుగా విదేశాలతో సాగిస్తున్న చర్చలను, సాధించిన విజయాలను దిగువకోర్టు తీర్పు అనిశ్చితిలో పడేస్తుందని ట్రంప్ ప్రభుత్వం హెచ్చరిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటున్న భారతదేశాన్ని అదనపు సుంకాలతో శిక్షిస్తూ ఉక్రెయిన్‌లో రష్యా చేస్తున్న యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నిస్తున్నట్టు సుప్రీంకోర్టులో ట్రంప్ ప్రభుత్వం చెప్పుకుంది. దిగువకోర్టు అంటున్నట్టుగా ట్రంప్ తన పరిధినేమీ అతిక్రమించలేదని, ప్రపంచ దేశాలన్నింటినీ కొత్త ఒప్పందాలకు దిగివచ్చేట్టుచేసి అమెరికాను ఆర్థికంగా వెలిగేట్టు చేస్తున్నారనీ, ఈ టారిఫ్‌లు కనుక లేకుంటే అమెరికా ఏడాది క్రితం వరకూ ఉన్నట్టుగా ఇకపై శాశ్వతంగా పేదదేశంగానే మిగిలిపోతుందని ప్రభుత్వం వాదన. తాము అధికారంలోకి వచ్చిన తరువాతే దేశం కళ్ళుతెరిచిందనీ, వెలుగుతున్న దేశాన్ని చూసి మిగతా ప్రపంచం అసూయపడుతోందనీ, కుట్రలు చేస్తోందని నాయకులు చెప్పుకోవడం సహజమేకానీ, న్యాయ స్థానాలు అవును నిజమేనంటాయా? అన్నది ప్రశ్న.

1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాలచట్టం (ఐఈఈపీఏ) వాడి సుంకాలు ప్రయోగించినప్పటినుంచీ ట్రంప్ చర్యమీద చర్చ జరుగుతూనే ఉంది. ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధమంటూ దాఖలైన పిటిషన్లపై తొలిగా విచారించిన అమెరికా వాణిజ్య న్యాయస్థానం ఆయనకు విదేశీ వాణిజ్యంతో చిత్తం వచ్చినట్టు వ్యవహరించగల విశేషాధికారాలేమీ లేవని మూడునెలల క్రితమే తేల్చేసింది. అప్పీల్స్‌కోర్టు మరునాడే ఆ తీర్పును నిలిపివేసి ట్రంప్‌కు తాత్కాలికంగా ఊరట కలిగించినా, ఇప్పుడు మంచి మెజారిటీతో కిందికోర్టు మాటే సరైనదని నిర్ధారించింది. జిమ్మీ కార్టర్ కాలంలో తయారై, ఇప్పటివరకూ ఏ అధ్యక్షుడూ వినియోగించని ఈ ఆర్థిక అత్యయిక చట్టాన్ని వాడి ట్రంప్ మిగతా ప్రపంచంతో యుద్ధం చేస్తున్నాడు. ఈ పురాతన చట్టంతో తాను న్యాయస్థానాల్లో నెగ్గుకురాగలనో లేదో ట్రంప్‌కు తెలియకపోయినా న్యాయనిపుణులు తెలియచెప్పకుండా ఉండరు. తన చర్య చట్ట బాహ్యమైనది అయినప్పటికీ, ట్రంప్‌కు కావల్సింది సామాన్య జనంలో రక్షకుడని అనిపించుకోవడం. గత పాలకుల చేతగాని తనం వల్ల దుర్భరమైన పేదరికంలో కడుదీనాతిదీనంగా బతుకీడుస్తున్న అమెరికాను తిరిగి వెలుగుజిలుగుల అగ్రరాజ్యంగా ఉన్నతంగా నిలబెట్టే పేరిట ఆయన ఎన్ని విన్యాసాలైనా చేస్తాడు. ఏప్రిల్ 2న 'లిబరేషన్ డే' పేరిట ఆయన అక్షరక్రమంలో ప్రతీ దేశానికీ టారిఫ్‌లు విధించిన దృశ్యం చూసినవారికి ఆయనకు దేశాన్ని తీర్చిదిద్దడంకంటే తాను గ్రేట్ అనిపించుకోవడం ప్రధానమని అర్థమైంది. మిగతా ప్రపంచంతో పోరాడుతున్నానని ఆయన అంటూంటే, ఆయన మీద రాష్ట్రాలు, వాణిజ్య సంస్థలు, వేదికలు న్యాయపోరాటం చేస్తూ ఒక్కోమెట్టూ ఎక్కుతున్నాయి. ట్రేడ్‌కోర్టు తీర్పులోనూ, ఇప్పుడు అప్పీల్స్‌కోర్టు తీర్పులోనూ ఆయనకు రాజకీయ కుట్రలూ, తనపట్ల ద్వేషం, దేశంపట్ల న్యాయమూర్తుల బాధ్యతారాహిత్యం కనిపించాయి. సుంకాలను సంధించి శాంతిని సాధిస్తున్నానంటూ భారత్–పాక్ యుద్ధాన్ని కూడా ఆయన గతంలో న్యాయస్థానంలో వాడుకున్నాడు. దౌత్యం కంటే, చర్చలకంటే సుంకాల సమరమే సర్వరోగనివారిణి అని ఆయన నమ్ముతున్నాడు. ఎంతటి మొండిదేశాన్ని అయినా టారిఫ్‌వార్‌తో లొంగదీయగలనని గర్విస్తున్న ట్రంప్‌కు ఇది మరింత పెద్ద ఎదురుదెబ్బ. అమెరికన్ కాంగ్రెస్‌లో ఎటువంటి చర్చా చేయకుండా, దానిని పక్కకునెట్టేసి, ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న ట్రంప్‌కు రేపు సర్వోన్నత న్యాయస్థానంలో కూడా ఇదే పరిస్థితి ఎదురైతే నైతికంగా ఓడిపోయినట్టే.

అమెరికా ఆధిపత్యం నిలిచేనా?

చరిత్ర అనేది ఒక నిరంతర చైతన్య వాహిని. కఠినమైన న్యాయమూర్తి. ఎవరిపైనా పక్షపాతం చూపదు, ఎవరినీ కనికరించదు. ఎంతో గొప్పవారమని ఎవరు భావించినా, తామే శాశ్వత పాలకులమని, ఎప్పటికీ అధినాథులమని ఎవరు అనుకున్నా చరిత్ర ఎప్పుడూ అటువంటి వారికి ఒక గట్టి పాఠం నేర్పింది. అధికారం, సంపదతో పాటు మరేదీ శాశ్వతం కాదని చరిత్రలో పదే పదే రుజువయింది. ఇవి ఎప్పటికీ మరచిపోకూడని పాఠాలు. ఆ సత్యాలు వర్తమాన ప్రపంచానికి, ముఖ్యంగా నేటి అమెరికాకు వర్తిస్తాయి.

వంద సంవత్సరాల క్రితం గ్రేట్ బ్రిటన్ సమస్త ప్రపంచానికి ఏకైక నాయకి. ప్రపంచ సంపదలో ఆ దేశానికి 20శాతం కంటే ఎక్కువ వాటా ఉండేది. మానవాళిలో నాలుగో వంతుకు పైగా జనాభా బ్రిటిష్ సామ్రాజ్య పాలనలో ఉండేది. వినూత్న వాణిజ్యాలు, కొత్త పరిశ్రమలు, నవ సాంకేతికతలు సమస్తమూ అన్నీ బ్రిటన్ నుండే ప్రభవించినట్టుండేవి. సప్త సముద్రాలపై బ్రిటిష్ నౌకాదళ సర్వాధిపత్యం తిరుగులేకుండా ఉండేది. లండన్‌లో తీసుకున్న నిర్ణయాలు దేశదేశాల భవిష్యత్తును మార్చేవి. 'బ్రిటిష్ సామ్రాజ్యంలో సూర్యుడు ఎప్పుడూ అస్తమించడు' అనేది కేవలం మాట కాదు, వాస్తవం. అయితే ఇరవయో శతాబ్ది పూర్వార్ధంలో సంభవించిన రెండు ప్రపంచ యుద్ధాలు బ్రిటన్‌ను గట్టిగా కుదిపేశాయి. ఆ యుద్ధాల వలన బ్రిటన్ సిరిసంపదలు అడుగంటిపోయాయి. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య పాలకుల ఆత్మవిశ్వాసం దెబ్బతిన్నది. వలస దేశాల్లో స్వాతంత్ర్య ఉద్యమాలు ఉధృతమయ్యాయి. తొలుత భారత్ విముక్తమయింది. ఆ తరువాత ఆసియా, ఆఫ్రికా దేశాలు క్రమంగా స్వతంత్ర రాజ్యాలుగా ఆవిర్భవించాయి. 20వ శతాబ్దం మధ్య నాటికే బ్రిటన్ ఒక సాధారణ యూరోపియన్ దేశంగా మారిపోయింది. ఇప్పటికీ అలాగే మిగిలిపోయి ఉంది. ఒకప్పుడు ప్రపంచాన్ని పాలించిన బ్రిటన్, నేడు తన గత చరిత్ర జ్ఞాపకాలతో కాలాన్ని నెట్టుకొస్తున్నది.

రెండు శతాబ్దాల క్రితం యూరప్ ఖండంలో ఫ్రాన్స్ అత్యంత శక్తిమంతమైన దేశంగా వెలిగింది. నెపోలియన్ చక్రవర్తి సైన్యాలు యూరప్ అంతటినీ జయించాయి. నెపోలియన్ అజేయుడని భావించేవారు. ఫ్రెంచ్ సంస్కృతి, కళలు, భాష సమస్త ప్రపంచాన్నీ ఆకర్షించాయి. తన పాలన శాశ్వతమని నెపోలియన్ విశ్వసించాడు. ఆ వివేకరాహిత్యమే అతడిని దెబ్బ తీసింది. నిరంతర యుద్ధాలు ఫ్రాన్స్ ఆర్థిక వనరులను హరించివేశాయి. బ్రిటన్, ఇతర యూరోపియన్ దేశాలు సమైక్యంగా నెపోలియన్‌పై దండెత్తాయి. చివరికి అతడిని ఓడించి, ఒక సుదూర దీవిలో ఒంటరిగా బంధించాయి. ఫ్రాన్స్ ఆధిపత్యం తగ్గిపోయింది. ఆ తరువాత కూడా ఫ్రాన్స్ సాటిలేని ఒక సాంస్కృతిక, ఆర్థిక శక్తిగా నిలిచినా, సామ్రాజ్యాధిపత్యాన్ని మాత్రం కోల్పోయింది.

నాలుగు శతాబ్దాల క్రితం స్పెయిన్ ప్రపంచ సముద్రాలపై తిరుగులేని ఆధిపత్యం చెలాయించింది. ఆసియాలోని ఫిలిప్పీన్స్‌లో మనీలా నుంచి ఉత్తర అమెరికాలోని మెక్సికో వరకూ సువిశాల భూభాగాలు స్పెయిన్ పాలనలో ఉండేవి. వెండి, బంగారం, సుగంధ ద్రవ్యాలు, పట్టుతో నిండిన నౌకలు తరలివచ్చేవి. స్పానిష్ రాజవంశం తమ పాలన దేవదత్తమని, శాశ్వతమని నమ్మింది. కానీ తన సంపదను సరైన విధంగా ఉపయోగించలేదు. మితిమీరిన ఖర్చులు చేసింది. ప్రబలిపోయిన మత అసహనం, యుద్ధాలు, దోపిడీలు... ఇవన్నీ స్పెయిన్ శక్తి సామర్థ్యాలను క్రమంగా క్షీణింపచేశాయి. 19వ శతాబ్దంలో లాటిన్ అమెరికా దేశాలు స్పెయిన్ వలస పాలన నుంచి స్వాతంత్ర్యం సాధించాయి. ఒకప్పుడు బంగారం, వెండి నిల్వలతో మెరిసిన స్పెయిన్ సామ్రాజ్యాన్ని కోల్పోయిన తరువాత యూరప్‌లో ఒక సాధారణ దేశంగా మిగిలిపోయింది.



నిజమైన నాయకత్వం అనేది సైనిక బలంపై కాకుండా, న్యాయం, సమానత్వం, మానవతా విలువలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు ఒక దేశాన్ని గొప్ప నాగరికతా శక్తిగా నిలుపుతాయి. ఆ విలువలను విస్మరించిన రోజు ఆ దేశం ప్రాబల్య ప్రభావాలు క్షీణించడం ప్రారంభమవుతుంది. ఇది చారిత్రక సత్యం. అమెరికా దీనిని మరవకూడదు.

బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్– ఈ మూడు దేశాల పతనం వెనక ఒకే కారణం ఉన్నది– తాము శాశ్వతమని నమ్మడం. బ్రిటన్ తన పాలనా విధానమే ఉత్తమమని భావించింది. ఫ్రాన్స్ తన సైన్యం ఎప్పటికీ అజేయమని అనుకుంది. స్పెయిన్ తన బంగారం ఎప్పటికీ తరుగదని విశ్వసించింది. అయితే కాలం అన్నది ఎవరి కోసం ఆగదు. చరిత్ర ముందుకు సాగిపోయింది. ప్రతి సామ్రాజ్యం ఎప్పటికైనా కూలిపోతుందనే సత్యాన్ని స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్ చరిత్ర రుజువు చేసింది.

ప్రస్తుత ప్రపంచంలో ఏకైక అగ్రరాజ్యంగా పేరుబడిన అమెరికా కూడా నెమ్మదిగా గతించిన సామ్రాజ్యాల బాటలో నడుస్తున్నది. ఇరవయో శతాబ్దం తొలినాళ్ల నుంచి ఇప్పటి వరకు అమెరికా తిరుగులేని ఆర్థిక, సైనిక శక్తిగా, సాంకేతిక ఆవిష్కరణలలో అగ్రగామిగా వెలుగొందింది. డాలర్‌ను ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రధాన కరెన్సీగా మార్చి, ఇతర దేశాలపై తన ప్రభావాన్ని చూపుతున్నది. అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, ప్రతిభావంతులను ఆకర్షించే అవకాశాలు అన్నీ అమెరికాలోనే కేంద్రీకృతమయ్యాయి. అంతేకాదు, అనేక దేశాల్లో సైనిక స్థావరాలను నెలకొల్పి తన కుయుక్తిని ప్రదర్శిస్తున్నది. ప్రపంచ నాయకత్వం తనకు మాత్రమే సొంతం అనే అహంభావాన్ని సుదీర్ఘ కాలంగా కొనసాగిస్తున్నది.

అయితే కాలం మారింది. అంతర్గతంగా, బాహ్యంగా అమెరికా ఇప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. దేశీయంగా రాజకీయ అస్థిరత పెరిగిపోతున్నది. పార్టీ విభేదాలు, విధానాల్లో అస్పష్టత, ప్రజల్లో అసంతృప్తి పెరుగుతున్నాయి. ధనిక–పేదల మధ్య అసమానతలు ఆందోళనకర స్థాయికి చేరాయి. జాత్యహంకారం, వర్ణ వివక్ష ఇంకా పూర్తిగా అంతరించలేదు. ఫలితంగా, అమెరికా ప్రజలు ఎన్నడూ లేని విధంగా తమ ప్రభుత్వాలపై నమ్మకం కోల్పోతున్నారు.

విదేశీ సంబంధాలలో కూడా అమెరికా పరిస్థితి మునుపటిలా లేదు. చైనా, భారత్, బ్రెజిల్, టర్కీ మొదలైన దేశాలు వేగంగా ఎదుగుతున్నాయి. సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలు పాశ్చాత్య దేశాలకు మాత్రమే పరిమితం కాకుండా ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాల్లో కూడా జరుగుతున్నాయి. ఒకప్పుడు అమెరికా చెప్పిన మాటే తుది నిర్ణయంగా ఉండేది. అయితే ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై అమెరికా మాట అంతగా చెల్లడం లేదు. అగ్ర రాజ్య ఆధిపత్యం తగ్గిపోతున్న సంకేతాలు స్పష్టంగా కనబడుతున్నాయి.

చరిత్ర మనకు ఒక గొప్ప పాఠాన్ని చెబుతున్నది. ప్రపంచంలో ఏ సామ్రాజ్యమూ శాశ్వతం కాదు. రోమన్ సామ్రాజ్యం, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్– ఒకప్పుడు శక్తిమంతమైన దేశాలే, సందేహం లేదు. అయితే అహంకారం, నిర్లక్ష్యం, అంతర్గత విభేదాల వల్ల అవి క్రమంగా బలహీనపడి చరిత్రలో కనుమరుగయ్యాయి. నేడు అమెరికా కూడా అదే మార్గంలో నడుస్తున్నట్టుగా కనిపిస్తున్నది.

నిజమైన నాయకత్వం అనేది సైనిక బలంపై కాకుండా, న్యాయం, సమానత్వం, మానవతా విలువలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమాజానికి మేలు చేసే ఆవిష్కరణలు ఒక దేశాన్ని గొప్ప నాగరికతా శక్తిగా నిలుపుతాయి. ఆ విలువలను విస్మరించిన రోజు ఆ దేశం ప్రాబల్య ప్రభావాలు క్షీణించడం ప్రారంభమవుతుంది. ఇది చారిత్రక సత్యం. అమెరికా దీనిని మరవకూడదు.

అమెరికా లేకపోయినా ప్రపంచం ముందుకు సాగుతుంది. రోమ్ కూలిపోయినా యూరప్ పురోగమనం ఆగలేదు. బ్రిటన్, ఫ్రాన్స్ ప్రభావం తగ్గినా కొత్త శక్తులు ప్రభవించాయి. అలాగే అమెరికా కూడా సమర్థమైన, సమంజసమైన నాయకత్వం అందించకపోతే ప్రపంచం దానిని దాటి ముందుకు వెళ్తుంది. ఇప్పటికే అనేక దేశాలు కొత్త కూటములుగా సంఘటితమవుతున్నాయి. అమెరికాతో నిమిత్తం లేకుండా ఆర్థిక, సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారం పెరుగుతున్నది.

ఏ సామ్రాజ్య పతనం ఒక్కసారిగా సంభవించదు. అది నెమ్మదిగా, క్రమంగా జరుగుతుంది. అంతర్గత సమస్యలు, రాజకీయ విభజనలు, అహంకారం పెరిగితే ఎంత బలమైన దేశమైనా కూలిపోతుంది. అమెరికా కూడా ఈ సత్యాన్ని అంగీకరించి, తన మార్గాన్ని సరిదిద్దుకోవాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమెరికా ముందు రెండు మార్గాలు ఉన్నాయి. మొదటిది– చరిత్ర పాఠాలు గుర్తు పెట్టుకుని వినయం, న్యాయం, ఆవిష్కరణల ఆధారంగా కొత్త శతాబ్దానికి తగిన నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం; రెండోది–'మేమే శాశ్వత అగ్రగాములు' అనే భ్రమలో మునిగి, మెల్లగా తన ప్రభావాన్ని కోల్పోవడం.

కాలం ఎవరిని విడిచిపెట్టదు. ఆర్థిక కలిమి, సైనిక బలం, రాజకీయ దురహంకారం ఆధారంగా నడిచే సామ్రాజ్యాలు ఎప్పటికీ నిలవవు. కాలమే వాటిని కనుమరుగు చేస్తుంది. అమెరికా భవిష్యత్తును నిర్ణయించేది ఇప్పుడు ఆ పాలకులు తీసుకునే నిర్ణయాలే.



■ పి. వేణుగోపాల్‌రెడ్డి
ఏకలవ్య ఫౌండేషన్ సంస్థాపకుడు

వాణిజ్య పంటలతో గిరిజనులకు ఆదాయం

ఏజెన్సీ ప్రాంతాల్లో వాణిజ్య పంటల సాగు ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి, అలాగే గిరిజన రైతుల జీవన ప్రమాణాల పెంపునకు కీలకపాత్ర పోషించనుంది. ప్రధానంగా అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, పాడేరు, పార్వతీపురం వంటి ప్రాంతాల్లో రబ్బర్, జీడిపప్పు, కాఫీ, పసుపు, మిరియాలు వంటి పంటల సాగుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ పంటలు వర్షాధారం, కొండ ప్రాంత వాతావరణానికి అనుకూలంగా ఉండటంతో పాటు, తక్కువ వ్యయంతో గిరిజనులకు దీర్ఘకాలిక ఆదాయం అందిస్తాయి. పంటల విలువ ఆధారిత ప్రాసెసింగ్, బ్రాండింగ్, ఎగుమతుల ద్వారా గిరిజన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు విస్తరించి, స్థిరమైన ఆర్థికాభివృద్ధికి మార్గం సుగమం చేస్తాయి. చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల్లో వాణిజ్య పంటల సాగు అవకాశాలపై మరింత దృష్టి పెట్టింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల ఆదాయ మార్గాలను గణనీయంగా విస్తృతపరిచే అవకాశం ఉన్న వాణిజ్య పంటల సాగు, అవకాశాలు, సవాళ్లను ఓసారి పరిశీలిద్దాం.

పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో కాఫీ సాగు ప్రస్తుతం 2,68,407 ఎకరాల్లో సాగవుతున్నా, అందులో 2,10,395 ఎకరాలు మాత్రమే ఉత్పత్తి ఇస్తున్నాయి. రాష్ట్రంలో వార్షిక ఉత్పత్తి సుమారు 25,000 మెట్రిక్ టన్నులు ఉన్నా, ఎకరాకు సగటు దిగుబడి 120 కిలోలే. ఇది జాతీయ సగటు 480 కిలోల కంటే నాలుగు రెట్లు తక్కువ. ప్రభుత్వం 2023–26 మధ్యలో 32,815 ఎకరాలను పునరుద్ధరించే లక్ష్యంతోపాటు, 2026–31 మధ్య మరో లక్ష ఎకరాలకు విస్తరించాలనే ప్రణాళిక రూపొందించింది. ప్రస్తుతం కాఫీ ఉత్పత్తిలో 60శాతం 'డ్రై చెర్రీ' రూపంలోనే అమ్మటం కూడా పెద్ద సమస్యగా ఉంది. దీని వల్ల రైతులకు సరైన ధర లేక ఆదాయం కోల్పోతున్నారు. దీన్ని అధిగమించడానికి 10,000 చిన్న పల్పర్లు, 30 కమ్యూనిటీ ఎకో పల్పర్లు, 50 సోలార్ హైబ్రిడ్ డ్రైయర్లు, కాంక్రీట్ డ్రైయింగ్ యార్డులు, కాఫీ క్యూయరింగ్ వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి.

ఏజెన్సీ ప్రాంతంలో రబ్బర్ సాగు ప్రస్తుతం కేవలం వెయ్యి హెక్టార్లలో మాత్రమే సాగవుతుండగా, 30 వేల హెక్టార్లకు పైగా అనువైన భూమి వాడుకలో లేదు. ఆంధ్రప్రదేశ్‌లో సగటు దిగుబడి హెక్టారుకు 1,000 కిలోలు ఉంది. ఇది జాతీయ సగటు 1,400–1,500 కిలోలు కంటే తక్కువ. కాబట్టి శాస్త్రీయ పద్ధతులు, సాంకేతిక సహాయం చాలా అవసరం ఉంది. ప్రారంభ సంవత్సరాల్లో పైనాపిల్, అల్లం, అరటి, పసుపు వంటి పంటలతో అంతర సాగు చేసి రైతుల ఆదాయం పెంచవచ్చు. ప్రభుత్వం 100శాతం సబ్సిడీతో నాట్లు, 5 ఏళ్లపాటు నిర్వహణ గ్రాంట్, రబ్బర్ బోర్డు అనుసంధానం వంటి విధానాలను అమలు చేసేందుకు కృతనిశ్చయంతో ఉంది.



వాణిజ్య పంటల సాగుతో గిరిజన ప్రాంతాల ఆర్థిక, సామాజిక, పర్యావరణ స్థితిని గణనీయంగా మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ పంటల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు, సబ్సిడీలు, మౌలిక వసతులు, మార్కెట్ అనుసంధానం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నది.

గిరిజన ప్రాంతాల్లో జీడిపప్పు 60 వేల హెక్టార్లలో సాగవుతోంది. దేశీయ, ఎగుమతి డిమాండ్ అధికంగా ఉండడంతో, రాష్ట్రంలో సాగు పెంచితే దిగుమతులు తగ్గించి, ఎగుమతులు పెంచే అవకాశం ఉంది. ప్రస్తుతం రాష్ట్ర సగటు దిగుబడి హెక్టారుకు 650 కిలోలు. వియత్నాం ఉత్పత్తి (1,200 కిలోలు) కంటే తక్కువ. నాలుగేళ్లలో సారవంతమైన నాట్లు, నీటిపారుదల వసతులు అందించి దిగుబడి రెండింతలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

ఆదివాసీ ప్రాంతాల్లో పసుపు పంట 21,987 ఎకరాల్లో సాగవుతున్నది. ప్రస్తుతం ఎకరాకు 1–1.2 టన్నుల దిగుబడి వస్తుండగా, జాతీయ సగటు 1.4 టన్నులు. దిగుబడి పెంపునకు రోమా, ప్రగతి వంటి అధిక దిగుబడి రకాల విత్తనాలు, వ్యాధి–కీటక రహిత నాట్లు, శాస్త్రీయ సాగు పద్ధతులు, జీవ ఎరువుల వాడకం కీలకం. ఏజెన్సీ ప్రాంతంలో పసుపు ప్రాథమిక ప్రాసెసింగ్‌లో పెద్ద లోటు ఉంది. క్లస్టర్ స్థాయి మౌలిక వసతుల కొరత, యాంత్రీకరణ లోపం, నిల్వ సదుపాయాల కొరత, మార్కెట్ అనుసంధానం లేకపోవడం వల్ల రైతులు తగిన ధర పొందడం లేదు. ఈ సమస్యలను అధిగమించడానికి మినీ ప్రాసెసింగ్ యూనిట్లు, పాలిషర్లు, బాయిలర్లు, డ్రైయింగ్ ప్లాట్‌ఫార్మ్‌లు, శిక్షణా కార్యక్రమాలు, ఆర్థిక మద్దతు, సబ్సిడీలు, బలమైన మార్కెట్ చానెల్స్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.


ఆంధ్రప్రదేశ్‌లో మిరియాల సాగు 1,68,000 ఎకరాల్లో జరుగుతున్నది. ప్రస్తుత దిగుబడి ఎకరాకు 150 కిలోలు, ఇంచుమించు జాతీయ సగటు 160 కిలోలకు దగ్గరగా ఉంది. అయితే క్లస్టర్ స్థాయిలో లాడర్లు, సోలార్ డ్రైయర్లు, డ్రైయింగ్ ప్లాట్‌ఫార్మ్‌లు, త్రెషర్లు వంటి పరికరాల కొరత, పచ్చి దశలోనే కోత కారణంగా నాణ్యత తగ్గడం, గ్రేడింగ్ ప్రమాణాలు పాటించకపోవడం, నిల్వ, మార్కెటింగ్ లోటు వంటి సమస్యలు ఉన్నాయి. ఈ లోటును భర్తీ చేయడానికి మినీ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆధునిక పరికరాలు, శిక్షణా కార్యక్రమాలు, రుణ సదుపాయాలు, సబ్సిడీలు, మార్కెట్ అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.

ఈ వాణిజ్య పంటల సాగుతో పాటు చెర్రీ, మామిడి, పనస, కుంకుమ వంటి పంటలను గిరిజన రైతులు సాగు చేస్తున్నారు. 2024–25లో 10,818 ఎకరాల్లో వికల్ప పంటల సాగు సైతం ప్రోత్సహించగా, రూ.6 కోట్లతో ట్రైబల్ మల్టీపర్పస్ మార్కెటింగ్ సెంటర్లు ఏర్పాటవుతున్నాయి. గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ (జీసీసీ) ఉత్పత్తులను రాష్ట్రవ్యాప్తంగా విక్రయించే చర్యలతో గిరిజన రైతు కుటుంబాలకు రూ.50,000 నుంచి రూ.1,00,000 వరకు అదనపు ఆదాయం సాధించే దిశగా ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. వాణిజ్య పంటల సాగుతో గిరిజన ప్రాంతాల ఆర్థిక, సామాజిక, పర్యావరణ స్థితిని గణనీయంగా మెరుగుపరచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ పంటల విస్తరణకు ప్రత్యేక ప్రణాళికలు, సబ్సిడీలు, మౌలిక వసతులు, మార్కెట్ అనుసంధానం, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాట్లకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటున్నది.

● కిడారి శ్రావణ్
గిరిజన కో–ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్

జ్ఞానప్రదాతలు

దేశ అభివృద్ధి, సమాజ నిర్మాణం, విద్యార్థుల భవిష్యత్, మానవ విలువలు, మూర్తిమత్వం, మానవత్వం, సామాజిక స్పృహ, ఓర్పు, నేర్పు, అన్నిటికీ మూలం గురువు. ఏ దేశమైనా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలో ఆర్థికరంగ నిపుణులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, వ్యవసాయరంగ నిపుణులు, నీటిపారుదల రంగం, రక్షణశాఖ, డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు... ఇలా ప్రతి రంగంలోని వ్యక్తులూ విద్యావంతులు కావల్సిందే. వీరిని తీర్చిదిద్దేది కేవలం ఉపాధ్యాయుడే, అంటే దేశాభివృద్ధికి కారకుడు గురువే. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా నేడు జరుపుకొనే ఉపాధ్యాయ దినోత్సవం ఒక ఉపాధ్యాయుని జ్ఞానానికి, త్యాగానికి ప్రతిఫలం. డా. రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తిలో ఎన్నో సన్మానాలు, అవార్డులు పొందారు. 27సార్లు నోబెల్ పురస్కారానికి నామినేట్ అయ్యారు. దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న పొందారు. ఆయనను రాష్ట్రపతిగా ఎన్నుకోవడానికి ప్రధాన కారణం, ఆయన సాధించిన అవార్డులు, పేరు ప్రఖ్యాతులు, విద్యా రంగానికి చేసిన సేవలే.



మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ అని సమాజంలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువులకే ఇస్తారు. బాధ్యతలను, కర్తవ్యాలను, తెలివితేటలను, శక్తిని, యుక్తిని, శాంతిని, ధర్మాన్ని, తన దగ్గరున్న అపార అనుభవాన్ని నరనరాన నింపి, శిల్పి శిల్పాన్ని చెక్కినట్టు విద్యార్థులలో జ్ఞానాన్ని చెక్కేది ఉపాధ్యాయుడే. సాంకేతికత ఎంత పెరిగినా, అర చేతిలో ప్రపంచం మొత్తం కనపడేలా ఫోన్లు, నెట్‌వర్క్‌లు ఉన్నా కూడా, కొన్ని విషయాలను ఆయనే నేర్పగలడు. సమాజంలో మంచి పౌరులు తయారవ్వాలన్నా, యువత స్వావలంబన వైపు నడవాలన్నా, ప్రగతి సాధించాలన్నా, శాంతియుతంగా, ఐకమత్యంగా ఉండాలన్నా, దేశభక్తి పెంపొందాలన్నా, మానవత్వం అలవర్చుకోవాలన్నా గురువు బోధనే ముఖ్యం. కొన్ని దేశాలలో గురువుల స్థానం ఆ దేశంలోని వీఐపీలతో సమానంగా ఉంది. మన దేశంలో కూడా వారికి సమున్నత స్థానం కల్పించాలి.

– సయ్యద్ జబీ, టీజీవో సెక్రటరీ, సిరిసిల్ల

నేర రాజకీయాల ఆటకట్టుకు తొలి అడుగు

తీవ్ర నేరాభియోగాలపై అరెస్టై వరుసగా 30 రోజుల పాటు నిర్బంధంలో ఉంటే రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, చివరికి ప్రధానమంత్రినైనా 31వ రోజు పదవి నుంచి తప్పించడానికి రాజ్యాంగంలోని 75, 164, 239ఎఎ అధికరణలకు సవరణలను ప్రతిపాదిస్తూ 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 20న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు నిబంధనలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని, రాజకీయ దురుద్దేశాలతో ప్రతిపక్షాలకు చెందిన నాయకులను గద్దె దించడానికి దోహదపడతుందని విపక్ష పార్టీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. చివరకు ఈ బిల్లుల్ని సమగ్ర అధ్యయనం నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ సంఘం పరిశీలనకు పంపించాలని మూజువాణీ ఓటుతో లోక్‌సభ నిర్ణయించింది. పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలి వారం చివరి రోజున జేపీసీ తన నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ రాజ్యాంగ సవరణ దేశ వ్యాప్తంగా రాజకీయ నాయకుల్లో కలవరం సృష్టిస్తోంది. అత్యున్నత అధికార స్థానాల్లో అవినీతిని రూపుమాపేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను ప్రతిపక్ష ఇండియా కూటమి పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని ఇటీవల బిహార్ పర్యటనలో ప్రధాని మోదీ ఆరోపించారు. ఒక సాధారణ ప్రభుత్వోద్యోగి ఒక చిన్న తప్పు చేసి కొంతకాలం జైలు జీవితం గడిపితే సస్పెన్షన్‌కు గురవుతున్నప్పుడు, 30 రోజులు జైలులో ఉన్న ముఖ్యమంత్రి లేదా ప్రధాని తమ స్థానం నుంచి దిగిపోకుండా ఎలా ఉంటారని ఆయన ప్రశ్నించారు. ఒకవైపు ఊచలు లెక్కిస్తూనే మరోవైపు ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారంటే మనం చింతించాలని అన్నారు. అయితే ఈ నిబంధన తటస్థంగా ఉండవలసిన వ్యవస్థలను అనివార్యంగా రాజకీయమయం చేస్తుందని, బెయిలు దరఖాస్తులను నిర్ణయించే జడ్జీలు ఎవరు పాలించాలో నిర్ణయించే శక్తులుగా మారతారని, పోలీసులు కూడా తాము ఒక ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తే ప్రభుత్వం కూలిపోతుందని గ్రహిస్తారని కొందరు విమర్శిస్తున్నారు.

అయితే నేరమయమై పోయిన నేటి రాజకీయాల్లో మార్పునకు ఇది ఒక తొలి అడుగుగానే భావించాలే తప్ప, యూనియన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ రాజ్యాంగ సవరణతో దేశ రాజకీయాలు సచ్ఛీలంగా మారిపోతాయని అనుకోవడం భ్రమే. అలాగే ఈ సవరణ ప్రభుత్వాన్ని మార్చేందుకు రాజ్యాంగం ప్రసాదించిన 'కూల్చివేత ఆయుధం'గా ఎన్డీయే ప్రభుత్వం ఉపయోగించుకుంటుందని, బ్యాలెట్ కన్నా లాకప్ ఒక మార్గంగా మార్చుకుంటుందని అనుకోవడం కూడా పొరపాటే. నేర రాజకీయాలు అంతమైతే నష్టపోయే వారు హింసా రాజకీయాలకు, నేరాలకు పాల్పడే రాజకీయ నాయకులే... కాబట్టి కొందరు ఉద్దేశపూర్వకంగానే ఈ సవరణను వ్యతిరేకిస్తున్నారన్నది నిజం.

వాస్తవానికి మన దేశంలో నేర రాజకీయాలు ఏదో ఒక పార్టీకి మాత్రమే పరిమితమయ్యాయని భావిస్తే పొరపాటు. అన్ని ప్రధాన పార్టీలూ నేరచరితులకు నిర్లజ్జగా పెద్దపీట వేస్తున్నాయి. ఈ నేర చరితులనే సమాజానికి ఆదర్శంగా చూపుతున్నాయి. ఎన్నికల్లో దౌర్జన్యం చేసి గెలవగానే ఈ పార్టీల ప్రభుత్వాలే నేరస్తులపైన కేసుల్ని రద్దు చేస్తున్నాయి. నేరస్తుడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాల్సింది పోయి, అతడికి రక్షణ పేరుతో సాయుధ పోలీసులనిస్తోంది ప్రభుత్వం! ఇక గెలవగానే అది వరకు నేరస్తులను నిలదీసిన పోలీసు అధికారులను బదిలీ చేయించడం, తమ అడుగులకు మడుగులొత్తే వాళ్లను తమ ప్రాంతాల్లో వేయించుకోవడం అధికారంలో ఉన్నవాళ్లు చేసే మొదటి పని. ఈ విషవలయం నుంచి బయటపడడం వ్యవస్థ భవిష్యత్తుకు, ప్రజల సంక్షేమానికి అవసరం.

నిజానికి మన దేశంలో రాజకీయ నాయకులకి, నేరగాళ్లకు విడదీయరానంత ప్రగాఢ సంబంధాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. మన ప్రభుత్వ వ్యవస్థలు– ముఖ్యంగా పోలీసు యంత్రాంగం నిర్వీర్యం కావడమే దీనికి ప్రధాన కారణం. పోలీసు అధికారుల నియామకాలు, బదిలీలు, ప్రమోషన్లు వంటివన్నీ ప్రభుత్వంలోని నాయకుల చేతుల్లో ఉన్నాయి. నిజాయితీగా నేర పరిశోధన చేసే ఏ అధికారి అయినా ఎన్నో ఇబ్బందులను, ఒడిదుడుకులను ఎదుర్కొనవలసి వస్తోంది. దాంతో ఇక తప్పని పరిస్థితుల్లో నాయకుల మాట విని నెట్టుకురావాల్సిన పరిస్థితి పోలీసులది. దీంతో పోలీసుల ప్రతిష్ఠ మరింత దిగజారుతోంది. నేర రాజకీయం, హింసా సంస్కృతి, అవినీతి, మాఫియా నేర సామ్రాజ్యాలు, ఎన్నికల అక్రమాలు, కులం పేరుతో ముఠాలు, ప్రైవేటు సైన్యాల ద్వారా తగాదాల పరిష్కారాలు, అధికారుల బదిలీలు, ప్రభుత్వ సిబ్బందిని సొంత సేవకులుగా వినియోగించుకోవడం, ప్రభుత్వ పనులపైన పూర్తి ఆధిపత్యం– ఇవన్నీ మన వ్యవస్థలో కలగాపులగమైపోయాయి. నేరాల దర్యాప్తులో రాజకీయ జోక్యంతో రాజకీయాలు నేరస్తులను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టడం, సెటిల్మెంట్లు, ఓట్ల కొనుగోలు... ఇవన్నీ కలిస్తేనే ఎన్నికల్లో గెలుపు అవకాశాలు అనే ఫార్ములా నేరచరితులకు రాజకీయాల్లో ప్రవేశం కల్పిస్తున్నాయి.

మన దేశంలో నేర రాజకీయాలు ఏదో ఒక పార్టీకి మాత్రమే పరిమితమయ్యాయని భావిస్తే పొరపాటు. అన్ని ప్రధాన పార్టీలూ నేరచరితులకు నిర్లజ్జగా పెద్దపీట వేస్తున్నాయి. ఇప్పుడైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ కలిసి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. దీనికి కావలసిందల్లా రాజకీయ సంకల్పం, సమాజంలో అవగాహన.



ఇప్పుడు జరగవలసిన మరొక చర్చ ఏమిటంటే– అవినీతి, అక్రమాలు, ఆర్థిక నేరాలు... ఇలా కేసులు ఏమైనా కావొచ్చు, ఈ కేసులలో దోషులుగా రుజువైన వాళ్ళు పోటీకి, అర్హులా, అనర్హులా అనే దానికంటే... కోర్టుల్లో ప్రాథమిక విచారణ తరువాత, నేరారోపణ జరిగిన అనంతరం తీర్పు వచ్చేలోగా అలాంటి వాళ్ళు పోటీకి అర్హులా, కాదా అనే అంశం మీద అసలు చర్చ జరగాలి. ప్రస్తుత చట్టాల ప్రకారం సాక్షాత్తూ హత్య చేసి దొరికినవాళ్ళు కూడా కోర్టుల్లో తీర్పు వచ్చి శిక్ష పడేదాకా పోటీకి అర్హులు! నాగరిక సమాజంలో ఇంతకన్నా మరో దారుణం లేదు.

ఏది ఏమైనా ఇప్పటికే చాలా ఆలస్యమైంది, పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండాలంటే ఇప్పుడైనా ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ కలిసి కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు. మొదటిది– సమర్థులు, నిజాయితీపరులైన అధికారులను ఎంపికచేసి, వారికి తగిన అధికారాలను, సిబ్బందిని ఇచ్చి, వెన్నుతట్టి ప్రోత్సహించడం. రెండవది– నేరగాళ్ళను, ముఠా నాయకులను ఎన్నికలకు దూరంగా ఉంచడం. 'నాలుగు సీట్లు పోయినా పర్వాలేదు, మేం మాత్రం మా పద్ధతి మార్చుకుంటున్నాం' అని ప్రజలకు ప్రత్యక్షంగా రుజువు చేయగలగాలి. మూడోది– నేర పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా కట్టుదిట్టం చేయాలి. ప్రమోషన్లు, బదిలీలలో రాజకీయ జోక్యం లేకుండా చూడాలి. చివరిది– నేరాల విషయంలో త్వరితగతిన న్యాయం అందేలా న్యాయవ్యవస్థలో మార్పులు జరగాలి. సకాలంలో న్యాయం అందటం నాగరికతకు చిహ్నం, అసలు న్యాయాన్నే అందించలేకపోతే రాజ్యవ్యవస్థకు, ప్రభుత్వానికి మనగలిగే హక్కు లేదు. జాతీయ స్థాయిలో పెద్ద మార్పులు రావాలి. అందు కోసం ఆగకుండా కనీసం స్థానికంగా న్యాయం త్వరగా అందేలా గ్రామ న్యాయాలయాలను, పట్టణాలలో త్వరితగతిన వివాదాలు తీర్చడం కోసం తగిన న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి. ఈ నాలుగు మార్పులతో పాటు చట్టబద్ధ పాలన సక్రమంగా అమలు చేసే విషయంలో ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి. ఇదే సందర్భంలో సమర్థులు, నిజాయితీపరులు... ముఖ్యంగా యువత నాయకత్వ బాధ్యతల్ని అందుకునేలా, వీలున్నంత కాలం చేశాక తమ తర్వాతి తరానికి బాధ్యతల్ని బదిలీ చేసేలా సంస్కరణల్ని తెచ్చుకోవడం ఇప్పుడు ప్రజల ముందున్న ప్రధాన లక్ష్యం. అదేవిధంగా ఓటు వేసేది ఎన్నికల్లో నిలబడ్డవారికి కాదు... తన భవిష్యత్తుకు వేస్తున్నాననే స్పృహ ప్రతి ఒక్కరిలో రావాలి. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలూ ఇలాంటి చర్యలు తీసుకోకుండా, ప్రజల్లో మార్పు రాకుండా కేవలం నేర రాజకీయాల గురించి మాట్లాడుకుని ఉపయోగం లేదు. దీనికి కావలసిందల్లా రాజకీయ సంకల్పం, సమాజంలో అవగాహన.

◆ కూసంపూడి శ్రీనివాస్
జనసేన అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్



● నిమజ్జన వేడుక
కృష్ణానదికి గణనాథులు క్యూ కట్టారు. గురువారం అర్ధరాత్రి భారీగా విగ్రహాలు ప్రకాశం బ్యారేజీ వద్దకు కదిలివచ్చాయి. భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనోత్సవం జరిగింది.



↑ వేదాద్రి ఘాట్‌లో..

● నీరు లేక..

కృష్ణానదికి వరద తగ్గుముఖం పట్టడంతో నిమజ్జనం పూర్తయిన విగ్రహాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులను ఇటీవల నదిలో నిమజ్జనం చేసిన సంగతి తెలిసిందే. నది మధ్యలోకి విగ్రహాలను తీసుకెళ్లి వదలాలనుకున్నా వరద కారణంగా అప్పుడు కుదరలేదు. నేడు వరద తగ్గుముఖం పట్టడంతో గణేశ్ విగ్రహాలన్నీ బయటపడుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ వద్ద, వేదాద్రి ఘాట్ వద్ద ఇలా పదుల సంఖ్యలో వినాయక విగ్రహాలు బయటపడ్డాయి. - జగ్గయ్యపేట రూరల్



● నేటి విద్యార్థులే రేపటి ఉపాధ్యాయులు

గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తిరువూరు మండలం లక్ష్మీపురం మండల పరిషత్ స్కూల్లో విద్యార్థులు.. ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధిస్తున్న దృశ్యం

గురుతర బాధ్యత

● నేడు గురుపూజోత్సవం

- జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- పిల్లలకు పాఠాలు తేలిగ్గా అర్థమయ్యేలా కళారూపాలు, ఎగ్జిబిషన్లు
- సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి మార్గదర్శకంగా..
- క్రీడల్లోనూ రాణిస్తూ.. పోటీల్లో పతకాలు సాధిస్తూ..

6

ఓ చేత్తో బెత్తం పట్టుకుని, మరో చేత్తో పుస్తకం పట్టుకుని పాఠం చెప్తే పని అయిపోయిందనుకోలేదు. ప్రశ్నలకు జవాబులు చెప్పి, కంఠస్థం చేయించి సరిపెట్టుకోనూ లేదు. బెత్తంతో బెదిరించకుండా చాకచక్యంగా, సులభతరంగా పాఠాలు చెప్పి గురుతర బాధ్యతను రెండు భుజాలపై వేసుకున్నారు ఆ ఉపాధ్యాయులు. కళారూపాలతో, సైన్స్ ఎగ్జిబిషన్లతో విద్యార్థులకు తేలిగ్గా అర్థమయ్యేలా పాఠాలు చెప్పినవారు కొందరైతే, సేవాగుణంతో ముందుకెళ్తూ, క్రీడోత్సాహంతో పతకాలు సాధిస్తూ అంతులేని పేరు సంపాదించినవారు కొందరు. అవార్డులు, రివార్డులతో సంబంధం లేకుండా విద్యార్థుల్లో విద్యాసక్తిని పెంచడానికి అహరహం కృషిచేస్తున్న గురువుల విజయ గాథలపై నేడు (శుక్రవారం) గురుపూజోత్సవం సందర్భంగా కథనం.. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

మళ్లీ కృష్ణా ఎగ్జిబిషన్

- వ్యవసాయ పారిశ్రామిక ఎగ్జిబిషన్ ఏర్పాటుకు అడుగులు
- గొల్లపూడిలో పనులు ప్రారంభించిన ఎగ్జిబిషన్ సొసైటీ
- దేవదాయ శాఖకు చెందిన 40 ఎకరాల్లో పనులు
- చురుగ్గా మెరక పనులు
- ఎంపీ కేశినేని చిన్ని చొరవతో ఏళ్ల తర్వాత మళ్లీ..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దశాబ్దంన్నర కాలం తర్వాత మళ్లీ కృష్ణా వ్యవసాయ పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను చూడబోతున్నాం. గొల్లపూడిలోని దేవదాయశాఖ స్థలంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు ఈ ఎగ్జిబిషన్ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం మట్టి చదును పనులు జరుగుతున్నాయి. మచిలీపట్నంలోని వేంకటేశ్వర స్వామి ఆలయానికి చెందిన 40 ఎకరాలు గొల్లపూడిలో ఉన్నాయి. ఇందులో 20 ఎకరాల్లో ఈ పనులు చేస్తున్నారు. మెరక పనులు పూర్తి కాగానే, ఎగ్జిబిషన్ నిర్వహణ పనులు చేపడతారు.

గతంలో మంచి స్పందన

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా వ్యవసాయ పారిశ్రామిక ఎగ్జిబిషన్‌కు మంచి స్పందన వచ్చేది. అప్పట్లో స్వరాజ్యమైదానంలో దీనిని నిర్వహించేవారు. రాష్ట్రం నలుమూలల నుంచి విజయవాడ వచ్చేవారు. నెల రోజుల పాటు జరిగేది. కాలక్రమంలో కొన్ని కారణాల వల్ల అది జరగలేదు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఎగ్జిబిషన్ సొసైటీకి, జిల్లా యంత్రాంగానికి మధ్య కొన్ని సమస్యలు ఉండేవి. ఇప్పటికి ఆ సమస్యలను ఎంపీ కేశినేని చిన్ని పరిష్కరించారు. కలెక్టర్ లక్ష్మీశతో చర్చించగా, ఆయన అనుమతులిచ్చారు. గతంలో కంటే మిన్నగా ఈ ఎగ్జిబిషన్ నిర్వహించాలని ఎంపీ కేశినేని చిన్ని కూడా నిర్వాహకులకు సూచించారు. దసరాలో 'విజయవాడ ఉత్సవ్' నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను అందులో అంతర్భాగం చేయాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగానే రకరకాల స్టాళ్లతో పాటు ఆకట్టుకునే ఆహ్లాద కార్యక్రమాలు నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

అమ్మ సొమ్మంటే అలుసా!

దసరాకు ప్రభుత్వ శాఖల ఇండెంట్ ఖర్చు రూ.4 కోట్లు

కార్పొరేషన్, పోలీసు, మత్స్యశాఖ, ఇరిగేషన్, విద్యుత్ శాఖలవే..

రాష్ట్ర పండుగగా నిర్వహించే ఉత్సవాలకు దేవస్థానం డబ్బెందుకు?

4,500 మంది పోలీసులే ఎక్కువ.. వారికి రూ.కోటి ఖర్చా..?

తిరుమల బ్రహ్మోత్సవాల్లోనూ ఈ పద్ధతి లేదు.. ఏటా దుర్గమ్మ ఆదాయానికి కోత

అమ్మ సొమ్మంటే అందరికీ అలుసే. ఉన్న దానికి, లేనిదానికి ఇబ్బడిముబ్బడిగా, ఇష్టానుసారంగా ఇండెంట్లు పెట్టడం చూస్తే ఇది నిజమేననిపిస్తుంది. ఇంద్రకీలాద్రిపై 10 రోజుల పాటు జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు రాష్ట్రస్థాయి పండుగ. దీనికి ప్రభుత్వంలోని ఏ శాఖ అయినా ఉచితంగా విధులు నిర్వహించాలి. దుర్గమ్మకు చేసుకునే సేవాభాగ్యంగా భావించాలి. అలాకాకుండా.. తాము విధులు నిర్వహిస్తున్నందుకు రూ.కోట్లలో దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానానికి ఇండెంట్లు పెట్టడం ఏమిటో విడ్డూరంగా ఉంది. ఈ ఏడాది ఉత్సవాలకు ఏకంగా రూ.4 కోట్ల దేవస్థాన నిధులు ఖర్చు చేయించేందుకు ఇండెంట్లు రావడం విమర్శలకు తావిస్తోంది. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

● మునిసిపల్ కార్పొరేషన్‌కు రూ.అరకోటి

ఇంద్రకీలాద్రి దిగువ ప్రాంతాలు, రోడ్లు, స్నానఘాట్లు, పార్కింగ్ ఏరియాలు, టికెట్, ప్రసాద కౌంటర్ల దగ్గర పారిశుధ్య పనులను విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ నిర్వహిస్తుంది. ఈ పనులు చేయటం కార్పొరేషన్ బాధ్యత. ఇందుకోసం శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానం రూ.55 లక్షలు చెల్లించాలని ఇండెంట్ పెట్టడం ఎంతవరకు సబబు? కార్పొరేషన్ శానిటేషన్ విభాగంలో పనిచేయని పర్మినెంట్ శానిటరీ వర్కర్లు భారీగా ఉన్నారు. మస్తర్లు వేయించుకుంటూ తమ స్థానంలో జీతాలకు వేరేవారిని పెట్టుకుని పనిచేయిస్తుంటారు. అలాంటి వారితో కనీసం దసరా ఉత్సవాల్లో అయినా పనిచేయించాల్సింది పోయి దేవస్థానాన్ని డబ్బు అడగడం ఎంతవరకు కరెక్ట్ అనే వాదన వినిపిస్తోంది.



● 4,500 మంది పోలీసు బందోబస్తుకు రూ.కోటి

ఈ దసరా ఉత్సవాల్లో 4,500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు దేవస్థానానికి సమాచారం ఇచ్చారు. కిందటి ఏడాది పోలీసు శాఖకు దేవస్థానం రూ.85 లక్షలు చెల్లించింది. ఈ ఏడాది వారి ఇండెంట్ బడ్జెట్ రూ.కోటికి పెరిగింది. తిరుమల బ్రహ్మోత్సవాల్లో కూడా వందల సంఖ్యలో తప్ప వేలసంఖ్యలో పోలీసులు ఉండరు. అలాంటిది 4,500 మంది ఎందుకో తెలియని పరిస్థితి. దీనికోసం రాష్ట్ర నలుమూలల నుంచి ఆయా స్టేషన్ల నుంచి పోలీసులను రప్పిస్తున్నారు. తెలంగాణాలో జరిగే సమ్మక్క సారక్క జాతరకు ఇంతకంటే ఎక్కువ సంఖ్యలోనే పోలీసులు విధులు నిర్వహిస్తారు. కానీ, అక్కడి కమిటీ వారికి నయాపైసా చెల్లించదు.

● మత్స్యశాఖ ఇండెంట్ రూ.35 లక్షలట..!

మత్స్యశాఖ రూ.35 లక్షలకు ఇండెంట్ పెట్టింది. పెర్రిఘాట్ దగ్గర బోట్లు, జాలర్లు, గజ ఈతగాళ్లను పెట్టడంతో పాటు లైఫ్ జాకెట్లు, రేడియం స్టిక్కర్లు, ఇతర స్టేషనరీ కొనుగోలు కోసం ఈ ఇండెంట్ పెట్టడం గమనార్హం. దసరా ఉత్సవాలకు, పెర్రిఘాట్‌కు సంబంధమేమిటో అర్థంకాని పరిస్థితి. ఉత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలేవీ అక్కడ జరగవు. కిందటి ఉత్సవాల్లోనూ రూ.35 లక్షలు తీసుకున్నారు. అప్పుడు కొన్న లైఫ్ జాకెట్లు, రేడియం స్టిక్కర్లు ఏమయ్యాయో మిగతా 4లో..

ఎకరం భూమి స్వాహా

పాతపాడులో ఓ వీఎంసీ ఉద్యోగి నిర్వాకం

నిర్మించిన పోలవరం డీఈఈ

స్థలం స్వాధీనం చేసుకోవాలని ఎమ్మార్వోకు లేఖ



పాతపాడులోని స్థలం

గుణదల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం పాతపాడు గ్రామంలో పోలవరం కాల్వకు, జగనన్న కాలనీకి మధ్య ఉన్న ఎకరం భూమిని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)లో పనిచేసే ఓ ఉద్యోగి ఆక్రమించుకున్నాడు. ఆక్రమిత భూమి చుట్టూ సరిహద్దులతో కూడిన సిమెంట్ పోల్స్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అంతేకాదు.. ఇందులోని సుమారు 20 సెంట్లను రూ.20 లక్షలకు అమ్ముకున్నాడు కూడా. మిగిలిన 80 సెంట్ల జాగాలో మామిడి, కంది మొక్కలు వేసి మధ్యలో చర్చి నిర్మించడానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ విషయం పోలవరం డీఈఈ శ్రీనివాసరావుకి తెలియడంతో ఆయన సర్వే చేయించారు. ఆక్రమణ నిజమని తెలుసుకుని విజయవాడ రూరల్ ఎమ్మార్వోకు లేఖ రాశారు. జీవో నెంబరు 188 ద్వారా రెవెన్యూ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానికులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా, ఉన్నతాధికారులు ఆదేశిస్తే.. ఆక్రమణలు తొలగిస్తానన్నారు. ఆక్రమణదారుడు మరోచోట ఉన్న ఖాళీ స్థలంలోనూ కొంతమందితో పాకలు వేయించాడు. శివాలయం కట్టుకోవచ్చని సలహా ఇచ్చి ఒకచోట శివలింగం, దానిముందే నంది విగ్రహాలు ఏర్పాటు చేయించాడు. ఆక్రమిత స్థలాన్ని పరిశీలించేందుకు పోలవరం డీఈఈ వెళ్లగా, బెదిరించే ధోరణితో మాట్లాడాడు. ఆక్రమణ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కంభంపాడులో డ్రోన్‌తో ఎరువుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ



ఎరువుల కొరత లేదు

కృత్రిమ కొరత సృష్టిస్తే కేసులు పెడతాం..

ఎ.కొండూరు మండలంలో కలెక్టర్ లక్ష్మీశ

ఎ.కొండూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరువుల కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. మండలంలోని ఎ.కొండూరు సొసైటీ, కంభంపాడు గ్రోమోర్ దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రైతులందరికీ ఎరువులు అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రస్తుతం 3,474 మిగతా 4లో..

అజ్ఞాతవాసులు

డ్రగ్స్ కేసుల్లో పోలీసులకు చిక్కని సూత్రధారులు

- ఏ కేసులోనూ ఇప్పటి వరకు బయటకు రాని మూలాలు
- డ్రగ్స్ కొనుగోలుదారులు దొరికిన వెంటనే అప్రమత్తం
- అజ్ఞాతంలోకి వెళ్లిపోయి.. చాటుగా వ్యాపార కార్యకలాపాలు
- కేసు చతికలపడ్డాక బయటకు వచ్చి మళ్లీ వ్యాపారం

● కొద్దినెలల క్రితం హైదరాబాద్ నుంచి ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొస్తున్న ఇద్దరు యువకులను పటమట పోలీసులు రామవరప్పాడు రింగ్ వద్ద పట్టుకున్నారు. వారు ఇచ్చిన సమాచారంతో మరో యువకుడిని అరెస్టు చేశారు. ఈ ముగ్గురికీ ఎండీఎంఏను పంపుతున్న వ్యక్తి ఢిల్లీలో ఉన్నట్టు గుర్తించారు. తాను సరుకు పంపిన ముగ్గురు వ్యక్తులకు పోలీసులకు దొరికిపోయారని తెలుసుకున్న ఢిల్లీలోని వ్యక్తి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అతడిని పట్టుకోవడానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ కేసులో అసలు డ్రగ్‌ను తయారుచేసిన వ్యక్తి, దాన్ని మార్కెట్ చేసిన వ్యక్తి ఇప్పటి వరకు చిక్కలేదు.

● కొద్దిరోజుల క్రితం ఈగల్ పోలీసులు బెంగళూరు నుంచి ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ డ్రగ్‌ను తీసుకొస్తున్న వైజాగ్‌కు చెందిన యువతీ యువకులను మహానాడు జంక్షన్ వద్ద పట్టుకున్నారు. వారిని విచారణ చేసి, వైజాగ్‌కు చెందిన మరో యువకుడిని కూడా అరెస్టు చేశారు. ఈ ముగ్గురికి రెండు డ్రగ్‌లను బెంగళూరులో మల్లెల మధుసూదనరెడ్డి సమకూర్చినట్టు నిర్ధారించారు. ఇప్పుడు అతడు ఎక్కడున్నాడో తెలియని పరిస్థితి ఏర్పడింది.



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఇప్పటివరకు పోలీసులు బట్టబయలు చేసిన డ్రగ్ కేసుల్లో కొనుగోలుదారులు, వారికి డ్రగ్స్ తయారీదారుల చిరునామాలను ఇచ్చినవారే పట్టుబడుతున్నారు. అసలు సూత్రధారులు ఎక్కడున్నారన్నది తెలియట్లేదు. అజ్ఞాతంలో ఉంటూ, చాకచక్యంగా వ్యవహరిస్తూ వ్యాపారాన్ని మూడు పూలు, ఆరు కాయలుగా చేసుకుంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల విద్యాసంస్థల్లోని యువకులకు మత్తు రుచి చూపించి ఏజెంట్లుగా మార్చుకుంటున్నారు. ఇప్పటి వరకు జరిగిన ఘటనలు, వాటి దర్యాప్తు తీరుతెన్నులను పరిశీలిస్తే.. అసలు సూత్రధారులు దొరికిన దాఖలాలు ఎక్కడా లేవు. సమాచారం వచ్చిన వెంటనే ఆయా మార్గాల్లో గస్తీ నిర్వహించి డ్రగ్స్‌ను తీసుకెళ్తున్న వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. వారిని రెండు, మూడు రోజులు విచారణ చేసి నెట్‌వర్క్ గురించి కొంతవరకు మిగతా 4లో..

దుర్గమ్మ కానుకల ఆదాయం 31 రోజులకు రూ.4.57 కోట్లు
● మహామండపం ఆరో అంతస్థులో హుండీల లెక్కింపు 4



తిరుమల తరహా దర్శన విధానం అమలు చేయండి
● ఉత్సవ ఏర్పాట్ల సమీక్షలో మంత్రి ఆనం 4

ప్రతిష్ఠాత్మకంగా విజయవాడ ఉత్సవ్
● ఎంపీ కేశినేని చిన్ని 4

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండుప్రాణం బలి
● బస్సు ఢీకొని భవన నిర్మాణ కార్మికుడి మృతి



హుండీల కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈవో, అధికారులు

దుర్గమ్మ కానుకల ఆదాయం
31 రోజులకు రూ.4.57 కోట్లు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను గురువారం దేవస్థానం మహామండపం ఆరో అంతస్తులో లెక్కించారు. ఈవో వీకే శీనానాయక్, దేవదాయ శాఖ అధికారులు, ఏఈవోలు, ఆలయ సిబ్బంది, ఎస్పీఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదారులు కానుకల లెక్కింపులో పాల్గొన్నారు. పకడ్బందీ బందోబస్తు మధ్య కానుకల లెక్కింపులో 31 రోజుల వ్యవధికిగాను రూ.4,57,31,258లు నగదు సమకూరింది. బంగారం 400 గ్రాములు, వెండి 7 కిలోల 600 గ్రాములు, 524 యుఎస్‌ఏ డాలర్లు, 70 ఇంగ్లాండ్ పౌండ్లు, 52 సింగపూర్ డాలర్లు, 60 ఆస్ట్రేలియా డాలర్లు, 590 సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (దిరాహమ్స్), 28 సౌదీ రియాల్స్, 300 ఒమన్ (బయాసా), 73 ఖతార్ రియాల్స్ 210 మలేషియా రిగ్గిట్స్, 115 యూరప్ యూరోలు, 6.1/3 కువైట్ దినార్స్, 10 న్యూజిలాండ్ డాలర్లు, 100 హాంకాంగ్ డాలర్లు, 270 కెనడా డాలర్ల చొప్పున విదేశీ కరెన్సీ కానుకగా వచ్చింది.



సందీప్ మాధుర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

కనకదుర్గమ్మ సేవలో రైల్వే జీఎం సందీప్ మాధుర్

ఇంద్రకీలాద్రి : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ మాధుర్ గురువారం విజయవాడ దుర్గమల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. సిగ్నలింగ్, కార్యకలాపాలు, అంతర్జాతీయ ప్రాజెక్టుల్లో మూడు దశాబ్దాల అనుభవం సందీప్ మాధుర్‌కు ఉంది. ఆలయ ఈవో వీకే శీనానాయక్ ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద ఆశీస్సుల అనంతరం సందీప్ మాధుర్ దంపతులకి ఈవో అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



హోంమంత్రి అనితకు జ్ఞాపికను అందజేస్తున్న మహిళలు

కార్యసిద్ధి మహాశక్తి గణపతిని దర్శించుకున్న హోంమంత్రి అనిత

విద్యాధరపురం : విద్యాధరపురం లేబర్ కాలనీ గ్రౌండ్‌లో డూండీ గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత 72 అడుగుల కార్యసిద్ధి మహాశక్తిగణపతిని దర్శించుకున్నారు. గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, 72 అడుగుల ఏకో ఫ్రెండ్లీ మట్టి గణపతిని ఏర్పాటు చేయటంపై డూండీ గణేష్ సేవా సమితి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో డూండీ రాకేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సినీ, రాజకీయ రంగాల్లో నాన్నే ఆదర్శం

» ఎన్టీఆర్ తనయుడు నందమూరి బాలకృష్ణ



పామర్రు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సినీకళారంగం, రాజకీయ రంగంలో తనకు గురువైనా.. దేవుడైనా నాన్న ఎన్టీఆర్ అని హిందుపురం ఎమ్మెల్యే, హీరో నందమూరి బాలకృష్ణ అన్నారు. సినీ ప్రస్థానంలో 50 ఏళ్లు పూర్తిచేసుకుని, ప్రపంచ బుక్‌ఆఫ్ రికార్డ్స్‌లో తొలి తెలుగు హీరోగా అవార్డు దక్కించుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్వగ్రామమైన నిమ్మకూరుకు విచ్చేశారు. తొలుత గ్రామంలోని తల్లిదండ్రులు ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలిసి నివాళులర్పించారు. గురుకుల పాఠశాల విద్యార్థులు స్వాగతం పలకగా నిమ్మకూరు ఆడపడుచులు హారతులిచ్చారు. అనంతరం విలేఖర్ల సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ, సినీ కళారంగంలో తన 50 ఏళ్ల ప్రస్థానంలో పద్మభూషణ్, వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం సంపాదించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పదవులు తనకు ముఖ్యంకాదని వాటికే తాను అలంకారమన్నారు. తన విజయాలు పుణ్యదంపతులైన తల్లిదండ్రులకు, నిమ్మకూరువాసులకు, అభిమానులకు అంకితమన్నారు. హిందూపురం ఎమ్మెల్యేగా వరస విజయాలు ఇచ్చిన రాయలసీమను తన అడ్డాగా భావిస్తానన్నారు. నాడు దివంగత ఎన్టీఆర్, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం భౌగోళికంగా నేడు ఎంతో ప్రాధాన్యత పొందిందన్నారు. హైందవ ధర్మానికి ప్రతిరూపంగా తీర్చిదిద్దిన అఖండ-2 చిత్రాన్ని కులాలకు ఆపాదించకుండా వీక్షించాలని ప్రేక్షకులను కోరారు. బంధువు నందమూరి శివరామకృష్ణ ఇంట్లో పలువురు అభిమానులు, టీడీపీ నేతలు ఆయనతో సెల్ఫీలు దిగారు.

సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి స్థలాలు సేకరించండి

» ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

విజయవాడ సిటీ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అధిక లోడ్ విద్యుత్ వినియోగం ఉన్న ప్రాంతాల్లో సబ్ స్టేషన్‌లు నిర్మాణం చేసేందుకు స్థలాలను పరిశీలించాలని విద్యుత్ శాఖ సిబ్బందికి ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పొగాకు పుల్లారెడ్డి సూచించారు. సీపీడీసీఎల్ పరిధిలోని ఎన్టీఆర్, కృష్ణా, సీఆర్‌డీఏ, గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల విద్యుత్ శాఖ అధికారులతో నగరంలోని సర్కిల్ కార్యాలయంలో సీఎండీ సమావేశమయ్యారు. 33/11 కేవీ సబ్ స్టేషన్స్ సరఫరా లైన్‌లలో అంతరాయాలను తగ్గించాలని, దీని కోసం నిర్వహణ పనులకు అవసరమైన సామాగ్రిని ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లను వెంటనే మంజూరు చేయాలని, రైతులకు పగటి పూట తొమ్మిది గంటలు నిరంతరంగా విద్యుత్ అందించాలని ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని, పర్యావరణాన్ని పరిరక్షించి విద్యుత్ బిల్లుల పొదుపునకు సహకరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీపై సోలార్ ప్యానెల్‌లు అందించేందుకు లబ్ధిదారుల నుంచి సమ్మతి లేఖలు సేకరించాలన్నారు. ఫీడర్ లెవల్ సోలరైజేషన్‌కు స్థలాలను పరిశీలించి ప్రాజెక్ట్ మొదలు పెట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 1912ను సంప్రదించాలని ఈ సందర్భంగా ప్రజలకు సీఎండీ సూచించారు. సమావేశంలో డైరెక్టర్‌లు మురళీకృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు, విజయవాడ ఆపరేషన్స్ ఎస్ఈ ఉప్పలపాటి హనుమయ్య పాల్గొన్నారు.

దసరాకు తిరుమల తరహాలో దర్శనాలు

» మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో భక్తుల రద్దీ నియంత్రణలో ఏవిధానం అమలు చేస్తున్నారో.. అదే తరహాలో దుర్గగుడి దసరా ఉత్సవాల సందర్భంగా అమలు చేయడానికి ప్రయత్నం చేయాలని, భక్తులకు సరైన సమాచారం అందించడానికి అన్నిచర్యలు తీసుకోవాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా మహోత్సవ ఏర్పాట్లపై గురువారం బ్రాహ్మణవీధిలోని జమ్మిదొడ్డిలో గల సమావేశపు హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్నారని అందిన సమాచారం ప్రకారం.. అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. మహిళల సౌలభ్యం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీ శక్తి పథకంతో మహిళా భక్తుల సంఖ్య భారీగా పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగా అన్నిచర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. త్వరలో రెవెన్యూ, దేవదాయ, హోం, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి తీసుకున్న నిర్ణయాల మేరకు ముందుకు వెళతామని మంత్రి ప్రకటించారు. దసరా ఉత్సవాలలో అన్ని శాఖల సమన్వయం కీలకమని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ అన్నారు. దేవస్థాన సిబ్బందికి అన్నిపనులపై అవగాహన ఉండాలని, ఈనెల 15 లోపు అన్ని పనులు పూర్తి కావాలని, దేవదాయ శాఖ నుండి అన్ని అనుమతులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలలో స్వచ్ఛంద సేవకుల పాత్ర కీలమని, వారికి శిక్షణ ఇచ్చి సేవల్లో వినియోగించుకోవాలని ఆదేశించారు. గతంలో కంటే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, వారి అవసరాలకు తగ్గట్టు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు అన్నారు. కొత్త హోల్డింగ్ ఏరియాలు, కంట్రోల్ రూమ్ వినియోగం, వెస్ట్ బైపాస్ వినియోగించుకొని ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడటం వంటివి చేస్తున్నట్టు సీపీ తెలిపారు. మీడియా, సోషల్ మీడియా ద్వారా భక్తులకు పూర్తి సమాచారం అందేలా చూస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ, ఈవో శీనానాయక్, అధికారులు పాల్గొన్నారు.

7న మధ్యాహ్నం నుంచి దుర్గగుడి మూసివేత

ఇంద్రకీలాద్రి : ఈనెల7 ఆదివారం రాత్రి రాహుగ్రస్త పాక్షిక చంద్రగహణం సందర్భంగా దేవస్థాన వైదిక కమిటీ సూచనల మేరకు ఆగమ శాస్త్ర ప్రకారం ఆరోజు మధ్యాహ్నం 3.30 గంటల నుంచి అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాల కవాట బంధనం (మూసివేత) చేస్తున్నట్టు ఈవో వీకే శీనానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 8వ తేదీ సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి భక్తులకు దర్శన అవకాశం కల్పిస్తారు. స్నపనాభిషేకములు, అర్చనాది కార్యక్రములు నిర్వహించు సందర్భంగా ఆర్జిత సేవలు రద్దు చేస్తారు.

ప్రతిష్టాత్మకంగా విజయవాడ ఉత్సవ్ : ఎంపీ శివనాథ్



ఆలపాటి సురేష్‌తో ఎంపీ శివనాథ్

వన్‌టౌన్ : దసరా నవరాత్రుల్లో ప్రతిష్టాత్మకంగా విజయవాడ ఉత్సవ్‌ను ... శివనాథ్ (చిన్ని) తెలిపారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో గురువారం ఎంపీ కేశినేని శివనాథ్, ప్రెస్ అకాడమి ఛైర్మన్ ఆలపాటి సురేష్ భేటీలో దసరా నవరాత్రుల సందర్భంగా 11 రోజుల పాటు నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్ గురించి ఎంపీ వివరించారు. పర్యాటక, సాంస్కృతిక, చారిత్రక వైభవానికి విజయవాడ వేదిక కానుందని, సినీ కళాకారులు, పద్య, గద్య నాటక ప్రదర్శనలు, 40 ఎకరాల్లో ఎగ్జిబిషన్ ప్రదర్శన ఆకట్టుకోనుందన్నారు. కృష్ణానదిపై కేరళ తరహా బోట్ రేసింగ్, ప్రకాశం బ్యారేజీ సిడ్నీ హార్బర్ బ్రిడ్జి తరహా బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని, గిన్నీస్ రికార్డు దిశగా ప్రదర్శనలు ఉంటాయని, దసరా అంటే విజయవాడ అని దేశమంతటా ప్రతిధ్వనించేలా ఉత్సవం జరుగుతుందని ఎంపీ పేర్కొన్నారు.

చేయూత ఇవ్వండి.. చంటి బిడ్డ ప్రాణం నిలపండి

» దాతల సాయం కోరుతున్న తల్లిదండ్రులు



వెంటిలేటర్ ద్వారా చికిత్స పొందుతున్న చిన్నారి

విజయవాడ సిటీ, సెప్టెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): సంతానం కోసం ఏన్నో ఏళ్ల నిరీక్షణ తరువాత పుట్టి.. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బిడ్డను బతికించుకునేందుకు ఆ దంపతులు పడుతున్న ఇబ్బందులు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టిస్తున్నాయి. నెలలు నిండకుండానే పుట్టి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చంటి బిడ్డను కాపాడుకునేందుకు వారికున్న అన్ని ఆస్తులు, బంగారం అమ్మేశారు. రోజుకు రూ.75 వేల చొప్పున 28 రోజులుగా ఆసుపత్రికి ఖర్చు చేస్తున్నారు. వారి వద్ద ఉన్న డబ్బంతా అయిపోయింది. దాంతో కంటి పాపను కాపాడుకునేందుకు ఆ పేద దంపతులు సమాజ సాయాన్ని కోరుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మర్రిపూడి శివసాయిరమణ, ప్రియాంక దంపతులు సంతానం కోసం ఎన్నో ఏళ్లు నిరీక్షించారు. రెండు సార్లు అబార్షన్ తరువాత మూడో సారి గర్భం నిలబడింది. అయితే నెలలు నిండకుండానే ఏడో నెలలో పుట్టిన బాబు బరువు తక్కువగా ఉండటంతో పాటు లంగ్స్ పూర్తిగా ఏర్పడలేదు. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో చేర్చారు. బాబును బతికించుకునేందుకు వారికి ఉన్నదంతా అమ్మేశారు. స్నేహితులు, బంధువులు కొంత మేర సాయం చేశారు. మరో నెల రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచాలని వైద్యులు చెప్పడంతో ఆ దంపతులు కన్నీంటి పర్యంతమవుతున్నారు. సహృదయంతో సాయం చేసే చేతుల కోసం ఎదురుచూస్తున్నారు. సాయం చేయదలచినవారు మర్రిపూడి శివసాయి వెంకటరమణ, బ్యాంకు అకౌంట్ నెంబర్: 50100314409367 (హెచ్‌డీఎఫ్‌సీ(విజయవాడ, గురునానక్ కాలనీ బ్రాంచ్), ఐఎఫ్‌సీ కోడ్: హెడీఎఫ్‌సీ0009062 లేదా ఫోన్‌పే/ గూగుల్ పే: 77992 25111 చేయాలని కోరుతున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యం.. నిండు ప్రాణం బలి

» బస్సు ఢీకొని భవన నిర్మాణ కార్మికుడి మృతి



ప్రమాదానికి కారణమైన బస్సు

జగ్గయ్యపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం పనికి వచ్చిన వృద్ధుడైన తాపీ మేస్త్రీని మృత్యువు ఆర్టీసీ బస్సు రూపంలో కబళించింది. బస్టాండ్ లోపలకు వస్తున్న బస్సు ఢీకొట్టడంతో టైరుకింద పడి దుర్మరణం పాలైన సంఘటన జగ్గయ్యపేటలో గురువారం ఉదయం జరిగింది. పెనుగంచిప్రోలు మండలం పాత ముండ్లపాడు గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ (భవన నిర్మాణ కార్మికుడు) షేక్ మస్తాన్ (64) రోజూ జగ్గయ్యపేటలో చెరువుబజార్ వద్ద అడ్డాకు పనికోసం వస్తుంటాడు. గురువారం ఉదయం 7.30కి జగ్గయ్యపేట వచ్చి బస్టాండ్ దాటుతుండగా జగ్గయ్యపేట నుంచి బూదవాడ వెళ్లేందుకు బడి బస్సు లోపలకు వస్తు ఢీకొట్టడంతో వెనుక టైర్‌కింద పడి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆర్టీసీ అన్‌కాల్స్ డ్రైవర్ శ్రీను డ్రైవింగ్ చేస్తు మస్తాన్‌ను ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయిన దృశ్యాలు సీసీటీ పుటేజీలో స్పష్టంగా కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆసుపత్రి వద్ద బంధువుల రోదనలతో విషాదవాతావరణం నెలకొంది. డ్రైవర్ శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గణేశ్ మండపం చెంత మాంసాహారమా!

» కొనసాగుతున్న ధార్మిక సంఘాల నిరసన

» మొండితోక సోదరుల నిర్వాకంపై టీడీపీ, బీజేపీ ఆగ్రహం

నందిగామ, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైఎస్ వర్ధంతి సందర్భంగా ఈనెల 2న వినాయక పందిరి పక్కన మాంసాహార భోజనాలు పెట్టడంపై హిందూ ధార్మిక సంఘాలు నిరసన కొనసాగిస్తున్నాయి. ఆ పార్టీ శాసన మండలి సభ్యుడు మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావులు స్వయంగా మాంసాహారాన్ని వండించి ప్రజలకు వడ్డించడం చర్చనీయాంశమైంది. మూడురోజులుగా బీజేపీ, టీడీపీలతో పాటు పలు ధార్మిక సంఘాలు నిరసన తెలుపుతున్నాయి. మొండితోక సోదరులు దీనిపై స్పందించక పోగా తప్పును సమర్థించుకొనే ప్రయత్నం చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తున్నది.

ఈ ఘటనపై నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి మాదల రమేష్ మాట్లాడుతూ, హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాల్సిన వ్యక్తులు ఇంత నీచంగా ప్రవర్తించడం హేయమన్నారు. తక్షణమే మొండితోక సోదరులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు ధార్మిక సంఘాల ప్రతినిధులు సైతం మొండితోక సోదరులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అడ్డుకున్నా లెక్క లేకుండా స్వామి ఎదుట మాంసాహారం తీసుకొని హిందువుల మనోభావాలు దెబ్బతీశారని ఆరోపిస్తున్నారు. అపచారానికి పాల్పడిన వారిపై పోలీసులు కేసు నమోదు చేసి తక్షణమే అదుపులోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

అజ్ఞాతవాసులు

(3వ పేజీ తరువాయి)

సమాచారం సేకరిస్తున్నారు. డ్రగ్స్‌ను తీసుకొస్తున్న వారు దొరికిపోయారని తెలిసిన వెంటనే ఆ నెట్‌వర్క్‌లో ఉన్నవారంతా ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి అజ్ఞాతంలోకి పారిపోతున్నారు.

కొత్త నెంబర్లు.. పాత ఖాతాలు

దశలవారీగా ఉన్న డ్రగ్ నెట్‌వర్క్‌లోని వ్యక్తులు పోలీసులు వేస్తున్న అడుగులను బట్టి ఎత్తులు వేస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో కొనుగోలుదారులు చివరి దశలో ఉంటున్నారు. ఒకసారి కొనుగోలుదారుడు దొరికిన వెంటనే ఆ పైన దశల్లో ఉండేవారంతా అప్రమత్తమైపోతున్నారు. ఈ సమాచారాన్ని వెంటనే ప్రధాన సూత్రధారులకు చెప్పేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకుని వారి చిరునామాల వివరాలను తెలుసుకునే సరికి వారు మొత్తం సర్దేసుకుంటున్నారు. అప్పటి వరకు ఉపయోగించిన ఫోన్ నెంబర్లను స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. అప్పటి వరకు ఉపయోగించిన ఆ సిమ్‌లను తొలగించేస్తున్నారు. బ్యాంక్ ఖాతాల్లో ఉన్న మొత్తం డబ్బును లాగేసుకుంటున్నారు. పోలీసులు బ్యాంక్‌ల్లో ఉన్న నగదును స్తంభింపజేసినా నష్టం లేకుండా ఇలాంటి ప్రణాళికలు అమలు చేస్తున్నారు. పోలీసులు ఈ కేసు గురించి దర్యాప్తును ఆపేశారని తెలుసుకున్న తర్వాత మరో కొత్త సిమ్ తీసుకుని పాత ఖాతాదారులకు సమాచారం ఇస్తున్నారు. అక్కడి నుంచి అడ్డంకులు లేకుండా మత్తును నలుమూలలకు పంపుతున్నారు. తిరిగి ఎక్కడైనా ఎవరైనా పోలీసులకు చిక్కారని తెలియగానే మళ్లీ ఆ నెంబర్లను వదిలేస్తున్నారు. పోలీసులు గుట్టురట్టు చేసిన ప్రతి డ్రగ్ కేసులోనూ ఇదే జరుగుతోంది. ఈ కారణంగానే ముఠాలకు మూలస్తంభాలు బయటకు రావడం లేదన్న వాదన వినిపిస్తోంది. పోలీసుల దర్యాప్తు కొన్ని దశల వరకే సాగుతోంది. ఈ విషయాన్ని డ్రగ్ నెట్‌వర్క్‌లో ఉన్న వారు బాగా గ్రహించారు.

నెమ్మదిగా దర్యాప్తు

బెంగళూరు కేంద్రంగా రాష్ట్రంలోని ఉభయగోదావరి జిల్లాలకు చెందిన కొందరు యువకులు ఎండీఎంఏ డ్రగ్స్‌ను విచ్చలవిడిగా తయారు చేస్తున్నట్టు ఆధారాలు లభించాయి. పోలీసులకు పలు సందర్భాల్లో చిక్కిన నిందితులు ఇదే విషయాన్ని వెల్లడించారు. వారంతా తెలుగు వారిని బెంగళూరులో ఏజెంట్లుగా నియమించుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. వారి మూలాలు ఇప్పటి వరకు పోలీసులకు చిక్కలేదు. గంజాయి కేసుల్లో పడినంత వేగంగా అడుగులు డ్రగ్స్ దర్యాప్తులో పడట్లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తాజాగా నమోదైన కేసులో అయినా అసలు మూలాలు బయటకు వస్తాయో రావో వేచి చూడాలి.

సీఎంను కలిసిన రైల్వే జోన్ జీఎం మాథుర్

విజయవాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ కోస్తా రైల్వేజోన్ జనరల్ మేనేజర్ (జీఎం) సందీప్ మాథుర్ గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో అమల్లో ఉన్న ప్రస్తుత రైల్వే ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రికి మాథుర్ వివరించారు. ప్రధానంగా నూతన రైల్వే జోన్‌కు సంబంధించి, అమరావతి నూతన రైల్వే లైను రాష్ట్రంలోని ఇతర రైల్వే ప్రాజెక్టుల స్థితి, ఖర్చు, బ్యాలెన్స్ పనులను ఆయన వివరించారు. మాథుర్ వెంట విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియా కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఈ సందర్భంగా వందేభారత్ రైలు ఇంజిన్ నమూనాను జీఎం మాథుర్ బహూకరించారు.

సర్వమానవాళి శ్రేయస్సు కాంక్షించిన ప్రవక్త

వక్ఫ్ బోర్డు ఛైర్మన్ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ ప్రజలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞానం, అంధకారంలో కూరుకుపోయిన ఆనాటి సమాజంలో ప్రవక్త జ్ఞాన జ్యోతులను వెలిగించారని గురువారం ఒక ప్రకటనలో అజీజ్ పేర్కొన్నారు. విద్యా కుసుమాలను వికసింపచేశారని, సర్వమానవాళి శ్రేయస్సు, సాంఘిక సమానత్వం, ప్రపంచ శాంతి స్థాపనకు ప్రవక్త తన జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. ఈ పవిత్ర దినోత్సవం సమాజంలో సోదరభావం, ఐక్యత, సత్యం, శాంతి, ప్రేమ, విలువలను పెంపొందించాలని అజీజ్ ఆకాంక్షించారు.

మహిళా కమిషన్ కార్యక్రమానికి అధికారులను పంపండి

» సీఎస్‌ను కోరిన కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి రాష్ట్రం తరపున అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌ను కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో సీఎస్‌తో సమావేశమైనట్లు ఆమె మీడియాకు తెలిపారు. కమిషన్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, చట్టాలు, భద్రతపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను సీఎస్‌కు ఆమె వివరించారు. జాతీయ మహిళా కమిషన్, లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు డామన్ డయ్యూలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి అధికారులతోపాటు పోలీస్ అధికారులను నామినేట్ చేయాలని సీఎస్‌ను కోరారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి అధికారులు హాజరయ్యేలా జాతీయ మహిళా కమిషన్ చర్యలు తీసుకుందన్నారు. పౌర, పోలీసు అధికారుల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం, మహిళా సంక్షేమ పథకాలు, చట్టాల అమల్లో మెరుగుదల, బీఎన్ఎస్-2023, బీఎన్ఎస్ఎస్-2023 వంటి కొత్త చట్టాలపై ఉన్నతాధికారులకు తాజా పరిజ్ఞానం అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతుందని సీఎస్‌కు వివరించినట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల రక్షణ, హక్కులు, చట్టాలపై రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాన్ని చేపట్టిన అంశాన్ని సీఎస్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అలాగే, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శైలజ హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు ప్రతిరోజూ క్రీడలపై శిక్షణ

» 10 నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా పోటీలు ప్రారంభం

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతిరోజూ వారికి ఇష్టమైన క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు అన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందించవచ్చన్నారు. గురువారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో జరిగిన జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శుల వార్షిక సమావేశంలో వారు మాట్లాడారు. 26 జిల్లాలకు మహిళా స్కూల్ గేమ్స్ కార్యదర్శులను నియమించామని పేర్కొన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఎక్కువ పతకాలు సాధించే లక్ష్యంతో విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే క్రీడా పోటీలు, తేదీల వివరాలను సమావేశంలో వివరించారు. అండర్-11, అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు ఉంటాయన్నారు. ఈనెల 10 నుంచి ఉమ్మడి జిల్లాల వారీగా పోటీలు ప్రారంభమవుతాయని, రాష్ట్రస్థాయి పోటీలు 20 నుంచి ఉంటాయని తెలిపారు.

అందుబాటులో ఎరువులు

» ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా విషయంలో ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లాలో రైతుల అవసరాల మేరకు పుష్కలంగా అందుబాటులో ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి ఎరువులు విస్తారంగా దిగుమతి అయ్యాయని, కేంద్రం 53 వేల టన్నులను విడుదల చేసిందని, ప్రతి రైతుకు ఎరువులు సరఫరా అయ్యేలా పటిష్ట చర్యలు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా రైతులకు ఎరువులు అందిస్తోందని, యూరియాపై వస్తున్న అపోహలు నమ్మవద్దని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం..

» 12 మంది సచివాలయ సిబ్బందికి నోటీసులు

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ పరిధిలోని సచివాలయాల్లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు సిబ్బందికి గురువారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎండీవో) విగ్గిన్స్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. సచివాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బంది ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సి ఉండగా.. నున్న గ్రామం సచివాలయం-1, 2 పరిధిలో పనిచేసే కొందరు సిబ్బంది ఉదయం 11 గంటలు దాటినా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఈ విషయమై గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఎండీవో విగ్గిన్స్ రెండు సచివాలయాల్లో సమయానికి విధులకు హాజరుకాని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది వివరాలు సేకరించారు. వివిధ విభాగాల్లో పని చేస్తున్న మొత్తం 12 మంది సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీచేశారు.

ఎరువుల కొరత లేదు

(3వ పేజీ తరువాయి)

టన్నుల యూరియా అందుబాటులో ఉందని, మరో రెండు రోజుల్లో 200 టన్నులు, వారంలో 5 వేల టన్నుల యూరియా వస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ఎరువులను, యూరియాను 708 షాపులు, సొసైటీలు, ఆర్‌ఎస్‌కేల ద్వారా సరఫరా చేసి రెవెన్యూ, పోలీస్, మార్క్‌ఫెడ్ పర్యవేక్షణలో పంపిణీ చేస్తామన్నారు. ఎక్కడైనా ఎరువులు అధిక ధరలకు అమ్మినా, బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కలెక్టర్ కార్యాలయం సెల్ నెంబర్ 9154970454కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రైతులతో మమేకం

కంభంపాడు గ్రామానికి చెందిన విష్ణు అనే రైతుకు ప్రభుత్వం ద్వారా సబ్సిడీ డ్రోన్ మంజూరైంది. దీనిద్వారా గ్రామానికి చెందిన రైతులు జువ్వాజి రాంబాబు, గొర్ల రమేశ్‌రెడ్డి వరి పొలంపై గురువారం నానో యూరియా పిచికారీ విధానాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా పొలంలో ఎరువులు పిచికారీ చేయడం మంచి విధానమన్నారు. పురుగు మందులు స్ప్రే చేసే డ్రోన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు ఆర్డీవో మాధవి, తహసీల్దార్ కె.లక్ష్మీ, ఎస్సై కృష్ణా, ఇన్‌చార్జి ఏవో టిప్పుసుల్తాన్, ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల సరఫరా, సమస్యలపై నేడు డయల్ యువర్ కలెక్టర్

కలెక్టరేట్ : జిల్లాలో ఎరువుల సరఫరా, సమస్యలపై ప్రతి శుక్రవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, శుక్రవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలు, పంపిణీ ఏర్పాట్లు, వరికి ఎరువుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి సమాచారాన్ని తెలుసుకోవడంతో పాటు ఫిర్యాదులు, సమస్యలను 9154970454 నెంబరుకు కాల్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

7న ఫారెస్ట్ బీట్, సెక్షన్ ఆఫీసర్ల పరీక్ష

కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, సెక్షన్ ఆఫీసర్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేసి పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఫారెస్ట్ ఈ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఈనెల 7న ఆదివారం ఆఫ్‌లైన్ ఓఎంఆర్ ఆధారితంగా ఈ పరీక్ష జరుగుతుందని, నగరంలో 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 6,593 అభ్యర్థులు హాజరుకానున్నారన్నారు. 6న ఇన్విజిలేటర్లతో సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. తహసీల్దార్లు, 144 సెక్షన్ అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేసి పరీక్ష కేంద్రాలను సిద్ధంగా ఉంచాలని డీఆర్ఎం లక్ష్మీ నరసింహం అధికారులను ఆదేశించారు. ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ సీహెచ్ సాయిప్రకాష్, కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎస్ సలీం, తదితర అధికారులున్నారు.

అలుసా..!

(3వ పేజీ తరువాయి)

తెలియని పరిస్థితి ఏర్పడింది. కనీసం దేవస్థానానికి కూడా అప్పగించకుండా మళ్లీ కొత్తగా ఇండెంట్ పెట్టడం విడ్డూరమే. ఫీడర్లు పెడుతున్నామని విద్యుత్ శాఖ, తెప్పోత్సవం, ప్రకాశం బ్యారేజీపై లైటింగ్ కోసమని ఇరిగేషన్ శాఖ, బారికేడింగ్ ఏర్పాట్ల కోసం ఆర్అండ్‌బీ.. ఇలా ఏదో ఒక శాఖ అవసరం ఉన్నా, లేకపోయినా దేవస్థానం సొమ్మును ఖర్చు చేసేందుకు ఇండెంట్లు పెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 127,136, 147
చికెన్ విత్ స్కిన్ 240
చికెన్ స్కిన్‌లెస్ 250
నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 545

ఐటీఐలో అప్రెంటీస్ మేళా 8న

భారతీనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళాను ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 8న నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కనకరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళా 8న ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని అర్హులైన అభ్యర్థులను అప్రెంటిస్‌కు ఎంపిక చేస్తారని అన్నారు. ఐటీఐ పాస్, పూర్తి కాని అభ్యర్థులు, ఈ ఏడాది (2025) ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా హాజరు కావచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పదోవ తరగతి, ఐటీఐ మార్కులు మెమోలు, ఎస్‌టీసీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, మూడు జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

వినాయక పందిళ్లలో అన్నదానాలు

మాచవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ డివిజన్‌లో బి.ఎస్.ఆర్ నగర్ ఒకటో రోడ్డులో, మొగల్‌రాజపురం రావి చెట్టు సెంటర్ వద్ద గల వినాయక చవితి ఉత్సవాల కార్యక్రమాల్లో టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్ పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించి భక్తులు స్వయంగా వడ్డన చేశారు. ఈ కార్యక్రమంలో పడాల గంగాధర్, నాగవంశీ, ఎరుబోతు రమణ, రాము, పైడి నాయుడు, దుక్కా సూర్యకిరణ్, భాస్కర్, పడాల పండు, భార్గవ్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత వాతావరణమే లక్ష్యం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

రామలింగేశ్వరనగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత వాతావరణాన్ని ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. 15వ డివిజన్‌లోని సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుంచి ఏ ఇబ్బంది కలగకుండా ప్రపంచ స్థాయి పరిజ్ఞానాన్ని ఉపయోగించి కాలుష్యాన్ని నివారించడానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గురువారం ఉదయం తూర్పు పరిధి 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ పుట్టరోడ్డు చివర ఉన్న వీఎస్ఆర్ ప్లాజా వద్ద మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం డివిజన్‌లోని నిరుపేద కుటుంబానికి చెందిన మాదిరి లక్ష్మీకి టిఫిన్ బండిని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కృష్ణానది రిటైనింగ్ వాల్ పూర్తైన తరువాత ఊట నీరు ఇళ్ల వైపు రాకుండా ప్రత్యేకంగా రోడ్డు నిర్మాణంతో పాటుగా పంపింగ్ స్టేషన్ నిర్మాణం చేయడానికి రూ.96 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. దానితో పాటుగా ఇక్కడున్న సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ కారణంగా స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయం తన దృష్టిలో ఉందన్నారు. ప్రపంచ స్థాయిలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సుమారు రూ.126 కోట్లతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆ పనులు కూడా త్వరలోనే పూర్తయి మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్, వెలగపూడి సుబ్బారావు, అమ్ములు, చిన్నం, ఈశ్వరరావు, సింగంశెట్టి రమేష్, నిమ్మల హేమ, పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్: కార్పొరేట్ సంస్థలు, పౌరులు బాధ్యతగా సమాజసేవలో పాల్గొనాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం తూర్పు పరిధి ఏపీఐఐసీ కాలనీలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు ఐడీబీఐ బ్యాంకు సమకూర్చిన రెండు ఏసీలు, 50కుర్చీలను బ్యాంకు అధికారులు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు అందజేశారు. ఐడీబీఐ బ్యాంకు సుమారు రూ.7లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఏసీలు, ఫ్రిజ్‌లు, బీరువాలు, కుర్చీలు, ఫ్యాన్లు, వాటర్ ప్యూరిఫైయర్లు తదితర సామాగ్రిని తూర్పు పరిధిలోని పలు ఆరోగ్య కేంద్రాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఐడీబీఐ బ్యాంకు సామాజిక సేవా కార్యక్రమం(సీఎస్ఆర్)కింద నగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన సామగ్రిని అందచేయడం అభినందనీయమని తెలిపారు. ఐడీబీఐ జనరల్ మేనేజర్ సాయికృష్ణ మాట్లాడుతూ సీఎస్ఆర్‌లో భాగంగా హోప్ అనే పేరుతో తమ బ్యాంకు ఈ సౌకర్యాలను కల్పిస్తుందని తెలిపారు. కాలనీ అధ్యక్షులు పాతూరి సాంబశివరావు, పార్టీ నాయకులు గద్దె రమేష్, సాయన బుజ్జి, తాడి బాబురావు, కోడూరు వాసు, దేవరపల్లి ఆంజనేయులు, ప్రభుత్వ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీకి అవయవదానం

● భవిష్యత్తులో అవయవదానం ఇవ్వడానికి నిర్ణయం

విజయవాడ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన జి.వరప్రసాద్ అనే వ్యక్తి మృతదేహాన్ని కుటుంబసభ్యులు సిద్ధార్థ మెడికల్ కాలేజీకి విరాళంగా అందించారు. నూజివీడు మండలం తుక్కులూరుకు చెందిన వరప్రసాద్ తీవ్ర అనారోగ్యంతో మూడు రోజుల కిందట జీజీహెచ్‌లో చేరారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. మృతుడి సోదరుడు జి.అశోక్‌కుమార్, కుటుంబసభ్యులు వైద్య విద్యార్థులకు విరాళంగా అందించినట్టు గురువారం సూపరింటెండెంట్ ఏ.వెంకటేశ్వరరావు తెలిపారు. అంతేకాకుండా భవిష్యత్తులో వరప్రసాద్ సోదరుడు, వదిన మృతదేహాలనూ మెడికల్ కాలేజీకి అందజేయాలని వైద్యుల సమక్షంలో కుటుంబసభ్యులు నిర్ణయించుకున్నట్టు ఆయన తెలిపారు. ఇలాంటి ఉన్నతమైన సేవా దృక్పథం వైద్య విద్యార్థులకు మాత్రమే కాకుండా సమాజానికి ఆదర్శమని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.

వర్షపు నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయండి

● నగర కమిషనర్ ధ్యానచంద్ర

భారతీనగర్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వర్షపు నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం ఏర్పాటుచేసి సమీప కాలువలోకి ప్రవాహ మార్గం చేపట్టాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. నగర పర్యటనలో భాగంగా పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, బెంజిసర్కిల్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు సర్వీస్ రోడ్డు, మాచవరం ప్రాంతాలలో పర్యటించి డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు రోడ్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా కాలువలను ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. మాచవరం శ్మశానం వద్ద డ్రెయిన్‌ను విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కె.షమీ, చీఫ్ ఇంజనీర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జున రావు, వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.



డ్రెయినేజీ వ్యవస్థ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

రక్తదానంతో ప్రాణాలను కాపాడొచ్చు

బెంజ్‌సర్కిల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ వై.రామారావు తెలిపారు. గురువారం పటమటలంకలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రక్తదాన సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. అత్యధిక రక్తదాన కార్యక్రమాలు నిర్వహించే విద్యా సంస్థలకు కార్ల్ ల్యాండ్‌స్టీనర్ అవార్డు ప్రదానం చేస్తామన్నారు. ఈ ఏడాదికి ఆదిత్య విద్యా సంస్థలకు ఈ అవార్డు అందిస్తున్నామని ప్రకటించారు. అనంతరం డాక్టర్ సమరం మాట్లాడుతూ రక్తదాతలను ప్రాణదాతలుగా అభివర్ణించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొసిరెడ్డి వీర్రాజు, కళాశాల ఛైర్మన్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ ఎస్. సుగుణరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ బి.ఈ.వి.ఎల్ నాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమరాన్ని సన్మానిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ వై. రామారావు, చిత్రంలో కళాశాల యాజమాన్యం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుణదల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పటమట మహిళా హెడ్ కానిస్టేబుల్ పి.కోటేశ్వరమ్మ అన్నారు. పటమటలోని వల్లూరు సరోజనీదేవి నగర పాలకసంస్థ పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలు ఎదురయ్యే సమస్యలపట్ల బాల బాలికలకు అవగాహన కలిపించే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న నాటి నుంచే ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను అలవర్చుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. చెడు స్నేహాలు, అపరిచితుల మాటలకు లోనై మత్తు పదార్థాలను అలవాటు చేసుకోరాదని చెప్పారు. మత్తుపదార్థాలకు బానిసలైతే భవిష్యత్తులో ఏమీ సాధించలేరని అన్నారు. గంజాయి, కొకైన్‌కు అలవాటుపడినా, వాటిని కలిగి ఉన్నా, విక్రయించే ప్రయత్నం చేసినా చట్ట రీత్యా నేరం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాలభవన్ జోనల్ కో-ఆర్డినేటర్ జాకబ్ రాజు, ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు, ఎస్ కె.నజ్మా, కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తున్న పటమట హెడ్ కానిస్టేబుల్ పి.కోటేశ్వరమ్మ

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పాలిటెక్నిక్ అధ్యాపకులు

భారతీనగర్, సెప్టెంబరు04(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ 2024-25విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు అందజేస్తున్న అవార్డులకు ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ఎంపికయ్యారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మెకానికల్ ఇంజనీర్ అధ్యాపకురాలు గంగిశెట్టి దుర్గాదేవి. ఈమెకు 12సంవత్సరాల టీచింగ్ అనుభవంతో పాటు డిపార్ట్‌మెంట్ ఎడ్యుకేషన్ అనుభవం కలదు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ అధ్యాపకురాలు నూకవరపు లక్ష్మీ. ఈమెకు 12.5సంవత్సరాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో టీచింగ్ అనుభవం కలదు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులుగా పని చేస్తున్న గంగిశెట్టి దుర్గాదేవి, నూకవరపు లక్ష్మీ ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు అందజేస్తున్న అవార్డులకు ఎంపికయ్యారు. వీరు నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఈ అవార్డును అందుకుంటారు.



గంగిశెట్టి దుర్గాదేవి



నూకవరపు లక్ష్మీ

పీబీ సిద్ధార్థలో దొణప్ప 30వ వర్ధంతి సభకు ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాక

విజయవాడ కల్చరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖ, చెన్నపురి తెలుగు అకాడమీ సంయుక్త నిర్వహణలో ఈనెల 6న ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి సంవత్సరం సందర్భంగా 30వ వర్ధంతి సభను భారత 13వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు ప్రారంభించనున్నారు. దీంతో పాటు డాక్టర్ తూమాటి సంజీవరావు రచన విశిష్ట తెలుగు దిగ్దర్శనంగ్రంథాన్ని ఆవిష్కరిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ప్రారంభసభలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, విశ్రాంత ప్రాచార్యులు డాక్టర్ సూరం శ్రీనివాసులు, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అధ్యక్షులు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్ పాల్గొంటారని, మధ్యాహ్నం నుంచి సాయంకాలం వరకు ఆచార్య దొణప్ప రచనలపై సెమినార్ హాలులో జరిగే సదస్సుల్లో సాహితీ ప్రముఖులు, విశ్రాంత ఆచార్యులు ప్రసంగిస్తారని తెలియజేశారు.

మహిళా సాధికారతతోనే దేశ ప్రగతి

● ఐద్వా కార్యదర్శి రమాదేవి

చిట్టినగర్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశప్రగతి మహిళా సాధికారతతో సాధ్యమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి అన్నారు. తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో గురువారం చిట్టినగర్ మోతీ మసీద్‌లో మహిళల ఆర్థిక అవసరాలు-విస్తరిస్తున్న అవకాశాలు అనే అంశంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో మహిళలు ఆర్థికంగా మెరుగుపడటమే కాకుండా మన ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.సుహాసిని మాట్లాడుతూ మహిళలు పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందన్నారు. ఆ సహాయ సహకారాలను మహిళలు వినియోగించుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ కృష్ణ ప్రభు, ఇండస్ట్రీయల్ ప్రమోషనల్ ఆఫీసర్ ఎం.లావణ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తరుణీ తరంగాలు సభ్యురాలు డాక్టర్ ఎన్.విద్యాఖన్నా, జిల్లా పరిశ్రమలశాఖ సిబ్బంది, జనశిక్షణ సంస్థాన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముసాఫిర్ ఖానా లీజుపై అపోహలను నమ్మొద్దు

● ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

వన్‌టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ముసాఫిర్ ఖానా లీజు విషయంలో వస్తున్న అపోహలను ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ముసాఫిర్ ఖానా లీజు పరిమితి కేవలం మూడేళ్ల మాత్రమేనని, ఇది ప్రైవేటీకరణ కాదని, వక్ఫ్ ఆస్తులు ఎప్పటికీ ప్రైవేటుకు ఇవ్వబడవని స్పష్టం చేశారు. నూతన లీజుదారుడు వచ్చినా గతంలో వసూలు చేసిన రుసుములు (బీపీఎల్ కుటుంబాలకు - 12,500, నాన్ బీపీఎల్ కుటుంబాలకు - 30 వేలు) యథాతథంగా కొనసాగుతాయని తెలిపారు.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు..

● భయం గుప్పిట్లో స్థానికులు




రామవరప్పాడు రాజుల బజార్లో స్థానికులను హడలెత్తిస్తున్న వీధి కుక్కలు

గుణదల, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు గుంపులు గుంపులు తిరుగుతుండటంతో రామవరప్పాడు రాజుల బజార్లో నివాసం ఉండేవారు భయం గుప్పిట్లో బ్రతుకుతున్నారు. విజయవాడ రూరల్ మండలంలోని రామవరప్పాడు గ్రామంలో గల రాజుల బజార్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు గుంపులుగా దర్శనమిస్తుంటాయి. అదే బజార్లో జిల్లా పరిషత్ పాఠశాల ఉంది బాల బాలికలు ఇటుగానే నడుచుకుంటూ పాఠశాలకు వెళుతుంటారు. రాత్రివేళల్లో స్థానికులు ఇళ్ళకు నడుచుకుంటూ వెళ్ళాలంటే ప్రాణాలరచేత పెట్టుకుని వెళ్ళాల్సిన పరిస్థితి. ద్విచక్రవాహనాలపై వెళ్ళేవారిని వీధి కుక్కలు వెంబడిస్తుండటంతో మరింగ భయంగా ఉంటుంది. ఏదైనా పెను ప్రమాదం జరిగేంత వరకు అధికారులు ఈ విషయమై దృష్టి పెట్టరా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ అధికారులు వీధికుక్కల సమస్యను పరిష్కరించి గ్రామస్తుల ప్రాణాలకు ప్రమాదం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

- జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.


ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

గురుతర బాధ్యత

- జిల్లాలో ఆదర్శంగా నిలుస్తున్న పలువురు ఉపాధ్యాయులు
- పిల్లలకు పాఠాలు తేలిగ్గా అర్థమయ్యేలా కళారూపాలు, ఎగ్జిబిషన్లు
- సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి మార్గదర్శకంగా..
- క్రీడల్లోనూ రాణిస్తూ.. పోటీల్లో పతకాలు సాధిస్తూ..
- నేడు గురుపూజోత్సవం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/జగ్గయ్యపేట/తిరువూరు/మచిలీపట్నం టౌన్/గుడివాడ రూరల్/కూచిపూడి): విద్యార్థులకు పాఠాలు అందరు ఉపాధ్యాయులు చెబుతారు. అర్థమయ్యేవారికి అర్థమవుతుంది లేకుంటే లేదు. కొంతమందిలో ఒకరో ఇద్దరో విద్యార్థుల కోసం అధిక సమయం కేటాయిస్తారు. మరికొంతమంది మాత్రమే తమ వద్ద చదివే ప్రతి విద్యార్థి ప్రయోజకులవ్వాలని ఆశిస్తూ తమ సర్వస్వం ధారబోస్తారు. ఉమ్మడి జిల్లాలో అలాంటి ఉపాధ్యాయుల్లో కొంతమంది గురించి..



వరదలకు వాహనాలు, బ్రిడ్జిలు కొట్టుకుపోకుండా సైన్సు టీచర్ గార్లపాటి చంద్రశేఖర్ రూపొందించిన ప్రాజెక్టు

ప్రాజెక్టుల సార్ ఈ సైన్సు మాస్టార్

జగ్గయ్యపేట పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో సైన్సుటీచర్ గార్లపాటి చంద్రశేఖర్ ప్రాజెక్టుల సార్‌గా పేరుగాంచారు. విద్యార్థులను పరిశోధన రంగంలోకి వెళ్లేలా సైన్సు బోధన, ఆవిష్కరణలుంటాయి. ఆయన ఆవిష్కరణలు దక్షిణభారత స్థాయి సైన్సు ఫెయిర్‌లో బహుమతులు అందుకున్నాయి. 1995లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన ఆయన పట్టణంలో నాగమయ్య బజార్ పాఠశాలకు సొంత భవనం లేకపోవటంతో ఐదేళ్లపాటు అద్దె భవనంలో నిర్వహించి సొంత భవనానికి బీజం వేశారు. మక్కపేట యూపీ స్కూల్‌లో 50 మంది విద్యార్థులను 260 మందికి పెంచారు. విద్యార్థులతో 100కు పైగా ప్రాజెక్టులు చేయించారు. వర్షాల నుంచి పంటల రక్షించే ప్రాజెక్టు జాతీయస్థాయిలో ప్రశంసలందుకుంది. తన యూట్యూబ్ చానల్‌లో వేలాది మందికి సైన్సు ప్రాజెక్టులు, గణితావధానంపై చైతన్యం తెచ్చారు. భారీ వర్షాలు, వరదల్లో వాహనాలు, బ్రిడ్జిలు కొట్టుకుపోకుండా రూపొందించిన ప్రాజెక్టు పాండిచ్చేరిలో జరిగిన సైన్సు ఫెయిర్‌లో ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. 2024లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు.


రక్తదానం చేస్తున్న హెచ్‌ఎం నేలవెల్లి రమేష్‌బాబు

సేవా గుణ సంపన్నుడు, రక్తదాత నేలవెల్లి

1996లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన నేలవెల్లి రమేష్ ప్రస్తుతం గండ్రాయి ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యా ప్రమాణాలు, దాతల సహకారంతో పాఠశాలలో సౌకర్యాలు మెరుగుపరుస్తుంటారు. 1984 నుంచి ఇప్పటికి 97 సార్లు రక్తదానం చేసిన ఆయన రక్తదాతలను ప్రోత్సహిస్తుంటారు. ఉపాధ్యాయ మిత్ర సంస్థ ద్వారా పేద విద్యార్థులను ఆదుకోవటం, పర్యావరణ పరిరక్షణకు 200కి పైగా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మ వరప్పాడు పాఠశాలను రూ.8లక్షలతో అభివృద్ధి చేయటంలో కీలకపాత్ర పోషించారు.


స్ట్రాంగ్‌మెన్ ఆఫ్ ఇండియా టైటిల్ అందుకుంటున్న గంటా వెంకటేశ్వర్లు

'పవర్'ఫుల్ పీఈటీ

వ్యాయామోపాధ్యాయుడిగా వచ్చిన జీతం మొత్తం పవర్ లిఫ్టింగ్‌కే అంకితం చేశారు చిల్లకల్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గంటా వెంకటేశ్వర్లు. వత్సవాయి మండలం భీమవరానికి చెందిన ఈయన 1987లో ఎస్వీఎస్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నప్పటి నుంచే పవర్ లిఫ్టింగ్‌లో రాటుతేలాడు. 2001 డీఎస్సీలో వ్యాయామోపాధ్యాయుడుగా రాష్ట్రస్థాయిలో 10వ ర్యాంకు సాధించి పీఈటీగా ఎంపికైయ్యారు. పవర్ లిఫ్టింగ్‌లో దాదాపు 200 మందికి శిక్షణ ఇచ్చి సగానికి పైగా లిఫ్టర్లను జాతీయ స్థాయికి తీసుకెళ్లారు. బాలుర హైస్కూల్‌కు రూ.4లక్షలదాకా వెచ్చించి పెయింట్లు, గ్రౌండ్‌కు మరమ్మతులు చేయించారు. బలుసుపాడు, గౌరవరంలో పోటీలకు సొంతడబ్బులు వెచ్చించారు. ఎస్వీఎస్ కళాశాల, డిపో గ్రౌండ్ పోటీల నిర్వహణ సైతం సొంత నిధులతోనే చేయించారు. 2022 నుంచి 2025 వరకు జాతీయ మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు. 2021లో ఆసియన్ పవర్‌లిఫ్టింగ్‌లోను చాంపియన్ షిప్‌ను గెలుచుకుని, స్ట్రాంగ్ మెన్ ఆఫ్ ఇండియా, ఆసియాగా నిలిచారు. పవర్‌లిఫ్టర్‌గా అద్భుత విజయాలు సాధించిన వెంకటేశ్వర్లుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది.

దళితవాడలో 'సుధా'మృతం


విద్యార్థులకు నూతన పదాలను నేర్పేందుకు తయారు చేసిన ఉపకరణంతో టీచర్ జయసుధ

జగ్గయ్యపేట మండలంలో కృష్ణా పరివాహక ప్రాంతమైన రావిరాల దళితవాడలో ఉపాధ్యాయిని తుమ్మలచర్ల జయసుధ విద్యామృతాన్ని పంచుతున్నారు. విద్యార్థుల విద్య, జ్ఞాపకశక్తి సామర్థ్యాలను గుర్తించి ఉపకరణాల ద్వారా విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలకు వచ్చిన తొలి అర్ధగంట పిల్లల ఆసక్తిని గమనించి వారితో యాక్టివిటీస్ చేయిస్తున్నారు. నూరుశాతం హాజరు, క్రమశిక్షణ, యూనిఫామ్ వేసుకురావటం, మధ్యాహ్న భోజనం అందరూ తినేలా చేయటానికి ఆమె ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన స్మార్ట్ టీవీతో పాటు, తాను నిర్వహిస్తున్న జయాస్ టీచింగ్ టెక్నిక్స్ యూట్యూబ్ చానల్ ద్వారా పిల్లలతో పలు స్కిట్లను చేయించి వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపారు. మెగా డీఎస్సీ అభ్యర్థులను ఎలా ఎదుర్కోవాలో ఇచ్చిన క్లాసులు యూట్యూబ్‌లో అనేకమందికి మార్గదర్శనం చేశాయి. పెళ్లై ఇద్దరు పిల్లలు కలిగాక బీఈడీ చేసి, డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఆమె ఎందరో మహిళలకు స్ఫూర్తిగా నిలిచారు. ఆమె చానల్‌కు 15వేల మందికి పైగా వీక్షకులున్నారు.


పఠనాసక్తిని పెంచేందుకు ఏర్పాటు చేసిన లైబ్రరీలో పిల్లలకు పుస్తకం పరిచయం చేస్తున్న టీచర్ నవీనా

విద్యాబోధనలో 'నవీన'ం

జగ్గయ్యపేట పట్టణంలో అట్టడుగు వర్గాలు నివసించే మిట్టగూడెం పాఠశాలలో పనిచేస్తూ వినూత్న పద్ధతుల ద్వారా విద్యాబోధన చేస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల పట్ల ఆకర్షితుల్ని చేస్తున్నారు చిన్నపంగు నవీన. సింగిల్ టీచర్ స్కూల్‌కు హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కూతవేటు దూరంలో ప్రైవేట్ పాఠశాలలున్నా ప్రభుత్వ పాఠశాల బాట పట్టించారు. పిల్లలకు స్మార్ట్ టీవీ బోధనతో పాటు మొబైల్స్ దూరంగా ఉంచేందుకు లైబ్రరీ ఏర్పాటు చేసి కథల పుస్తకాలను ఏర్పాటు చేశారు. 1వ తరగతి పిల్లలను తన ఒడిలో కూర్చొబెట్టుకుని పాఠాలు చెబుతుంటారు. స్కూలంటే భయం పోగొట్టి రోజు వచ్చేలా చేశారు. తోడుగా ఒక వలంటీరును పెట్టుకుని తానే జీతం ఇస్తూ స్కూల్ నడుపుతున్నారు.

కళారూపాలతో గణిత బోధన



ఆమె గణిత ఉపాధ్యాయురాలు. అందరి ఉపాధ్యాయుల్లా పాఠాలు చెప్పామా వెళ్లామా అన్నట్టు ఉండరామె. పిల్లలతో ఆడుతుంది, పాడుతుంది, రంగులద్ది పాఠాలు బోధిస్తుంది మచిలీపట్నంలోని రైలుపేట మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు శివలెంక ఉష. పిల్లల్లో గణితమంటే భయంగా ఉంటుంది. వారికి ఆ భయాన్ని పోగొడుతూ, గణితాన్ని ఆటపాటలతో నేర్పుతోంది. పాఠశాల ఆవరణలోకి తీసుకెళ్లి కళా నైపుణ్యాలతో బోధిస్తూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న ఆమె గణితాన్ని విద్యార్థులకు నూతన ఒరవడిలో బోధిస్తున్నారు. కూచిపూడి నర్తకి అయిన ఉష విద్యార్థులకు తన హావభావాలతో, కళా నైపుణ్యాలతో గణితాన్ని అలవోకగా బోధిస్తూ గణితక్లబ్‌ను ఏర్పాటుచేశారు. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో ఈమె గణితం బోధిస్తున్న సమయంలో కొందరు విద్యార్థులు నూటికి నూరు మార్కులు సాధించి లక్షల్లో ప్రైజ్‌మనీ సాధించారు.

విద్యాశ్రామికుడు రాంప్రదీప్



టెన్త్ విద్యార్థులు ఇంగ్లీషు సులభంగా నేర్చుకునేలా పుస్తకాన్ని రాశారు ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కోడూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు మందడపు రాంప్రదీప్. 2009లోనే పుస్తకం రాసి దాతల సాయంతో అచ్చువేయించి విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. ఖాళీ సమయాల్లో స్థానిక గ్రామాల్లో తిరుగుతూ పిల్లలకు ఇంగ్లీషు బోధన చేస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక బాధ్యుడిగా మూఢనమ్మకాలు పోగొట్టడానికి విజ్ఞాన కార్యక్రమాలు నిర్వహించారు. గానుగపాడులోని మండల పరిషత్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేశారు. సదుపాయాల లేమితో హోదా రద్దవుతుందేమోనని గ్రామపెద్దల సహకారంతో సుమారు రూ.50లక్షల విలువైన ఎకరం స్థలాన్ని సేకరించి భవనం నిర్మాణం చేయించి సొంత నిధులతో కంప్యూటర్, బీరువాలు, ఫర్నీచర్, పుస్తకాలను అందించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



సమగ్రశిక్షలో ఎఫ్ఏవోగా ఎస్వీఆర్టీలో ఫిలాసఫీలో లెక్చరర్‌గా చేసి ప్రస్తుతం వేలేరు హైస్కూల్‌కు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు కొమ్మా విజయ్. నాడు-నేడులో ఆగిన పోయిన పనులను పూర్వ విద్యార్థుల సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించారు. అంతేకాక సదుపాయాలకు స్వంత నిధులు వినియోగిస్తూ విద్యార్థులు, ప్రజల మన్ననలు పొందారు. ప్రస్తుతం జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచడమే ధ్యేయం



మల్లవల్లి హైస్కూల్‌లో సెంకడరీ గ్రేడ్ టీచర్‌గా నియమితులైనప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారు వెలమర్తి రవిబాబు. ప్రభుత్వ పాఠశాలలపై ఉండే అపోహను పోగొడుతూ, వాటి గొప్పతనాన్ని వివరిస్తూ పాఠశాలలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా ప్రయత్నాలు చేసి సఫలమయ్యారు. గ్రామస్థుల సాంతో మల్లవల్లి హైస్కూల్‌కు 5 ఎకరాల స్థలాన్ని సేకరించడంతోపాటు భవన నిర్మాణానికి తనవంతు సహాయం చేసి మల్లవల్లి రవిగా గుర్తింపు పొందారు. సోషల్ ఉపాధ్యాయుడు అయినప్పటికీ విద్యార్థులకు క్షేత్రపర్యటన చేయించి సామాజికంగా ఎలా ఉండాలో నేర్పడడంతో దిట్ట. ప్రస్తుతం రేమల్లె మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్నారు.


విద్యార్థుల తల్లులతో మాట్లాడుతున్న భగవద్గీత

దోనర్ల సాయంతో ఖర్చు లేకుండా విద్య

గుడివాడ రూరల్ మండలంలోని లింగవరం ప్రాథమిక పాఠశాలలో జ్యోగి భగవద్గీత ఎంఎస్సీ బీఈడీ (సింగిల్ టీచర్)గా పని చేస్తున్నారు. 23 మంది విద్యార్థులున్నారు. డీఎస్సీలో భగవద్గీతకు జాబ్ రాగా, మచిలీపట్నంలో రెండేళ్లు పనిచేసి 2023లో లింగవరం పాఠశాలకు బదిలీపై వచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేకంగా వాట్సాప్ క్రియేట్ చేసి, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు విద్యాబోధనపై వివరాలు వాట్సాప్‌కు పంపుతున్నారు. నవోదయకు విద్యార్థులను తయారు చేస్తున్నారు. తల్లిదండ్రులకు ఖర్చు లేకుండా దోనర్ల సాయంతో విద్యార్థులకు కావల్సినవి అందించడం గొప్పవిషయం. చిత్రలేఖనం, వ్యక్తిగత వికాసం, మహాభారత, రామాయణ కథలు చెప్పటం వంటి అంశాల్లో విద్యార్థులకు మంచి ప్రావీణ్యం నేర్పుతున్నారు.

మా మంచి లెక్కల మాస్టారు మేకా రాణి

విద్యార్థుల్లో సహజంగా గణితమంటే భయం ఉంటుంది. ఆ భయాన్ని పోగొట్టి ఆసక్తి కలిగించేలా బోధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు లెక్కల ఉపాధ్యాయురాలు మేకా రాణి. వేలాది రూపాయల సొంత నిధులు ఖర్చు చేసి స్వయంగా కొన్ని ఉపకరణలు తయారుచేసి గణితాన్ని బోధించడం విశేషం. మొవ్వ జడ్పీహెచ్ పాఠశాల నుంచి కాజ జడ్పీ పాఠశాలకు వచ్చిన ఆమె ఎక్కడ విధులు నిర్వహించినా విద్యార్థులతో సన్నిహితంగా ఉంటూ గణితంపై భయం పోగొట్టి మెదడులో నాటుకుపోయేలా చెప్పడం ఆమె ప్రత్యేకత. పనిచేసిన చోటల్లా 'మా మంచి లెక్కల టీచర్' అనే ఖ్యాతి గడించారు. సొంత నిధులతో గణితం ల్యాబ్‌ను ఏర్పాటుచేసి సృజనాత్మకతకు పదునుపెడుతూ విద్యార్థుల మదిలో ప్రత్యేకస్థానం సంపాదించుకున్నారు. కుటుంబసభ్యుల సహకారంతో పేద విద్యార్థులకు ఫీజులు కట్టడం, పుస్తకాలు కొనివ్వడం చేస్తున్నారు. మొవ్వ గ్రామానికి చెందిన కందుల భాస్కర్ ఏబీబీఎస్ విద్యకు సుమారు రూ.2 లక్షలకు పైగా ఆర్థిక సాయం చేశారు.



జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు

» నాలుగైదు నెలల్లో పూర్తి ఫలితాలు: మంత్రి పయ్యావుల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి వచ్చే ఆదాయాలు తగ్గినా సామాన్యులకు, పేద ప్రజలకు మేలు కలుగుతున్నందునే జీఎస్టీ సంస్కరణలకు పూర్తి మద్దతు పలికామని మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సామాన్యుడికి మరింత మేలు జరిగేలా జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దేశ ఆర్థిక రంగంలో సంస్కరణలను మరింతగా ముందుకు తీసుకెళ్లాలని ఎప్పటినుంచో చంద్రబాబు కోరుతున్నారు. గతంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసినప్పుడు కూడా జీఎస్టీలో సంస్కరణల గురించి చర్చించాం. జీఎస్టీ సంస్కరణలపై కౌన్సిల్ సమావేశంలో చర్చలో భాగంగా కొంత భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా చివరికి అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారు. జీఎస్టీ సంస్కరణల ఫలితాలు నెల రోజుల్లోనే ఆరంభమవుతాయి. పూర్తి ఫలితాలు నాలుగైదు నెలల్లోనే వస్తాయి' అని పయ్యావుల ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజలకు మేలు ఖజానా కుదేలు!



ప్రభుత్వానికి ప్రతినెలా 15% నష్టం.. వాణిజ్య పన్నుల శాఖ అంచనాలు

» సంక్షేమం, అభివృద్ధిపైనా ప్రభావం
» కేంద్రమే ఆదుకోవాలని డిమాండ్
» జీఎస్టీ సెస్‌తో కేంద్రానికి 40,500 కోట్ల మిగులు
» వెల్లడించిన ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక
» ఈ నిధులతో రాష్ట్రాలకు వాటిల్లే నష్టాన్ని భర్తీ చేయాలని వినతులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ సంస్కరణలు రాష్ట్ర ఆదాయంపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. పేదలు, మధ్యతరగతికి ఊరటనిచ్చేలా ఇకపై 5, 18 శాతం పన్ను రేట్లు మాత్రమే కొనసాగుతాయని జీఎస్టీ మండలి తాజాగా ప్రకటించింది. ఈ నిర్ణయంతో రాష్ట్ర ఖజానాకు 15శాతం వరకు నష్టం వాటిల్లవచ్చని వాణిజ్య పన్నుల శాఖ అంచనా వేస్తోంది. ఆగస్టులో రాష్ట్రానికి నికరంగా రూ.2,977 కోట్ల జీఎస్టీ ఆదాయం వచ్చింది. తాజా సవరణలు అమల్లోకి వచ్చిన తర్వాత ఈ ఆదాయంలో ప్రతి నెలా 15శాతం వరకు కోత పడొచ్చని భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా జీఎస్టీ వసూళ్లలో నెలకు రూ.5వేల కోట్ల చొప్పున ఏటా రూ.60వేల కోట్ల వరకూ నష్టం ఉండొచ్చని ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో బీజేపీయేతర ప్రభుత్వాలున్న ఎనిమిది రాష్ట్రాలు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్రమే ఈ నష్టాన్ని భర్తీ చేయాలని, లేకుంటే తమ రాష్ట్రాల్లో అభివృద్ధి కార్యకలాపాలు కుంటుపడతాయని స్పష్టం చేస్తున్నాయి.

సర్కారుపై పెనుభారం

ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా ఎదురీదుతోంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అధిక వడ్డీరేట్లకు అప్పులు తేవడమే తప్ప అభివృద్ధి పనులు చేయకపోవడం, పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో ఆ భారమంతా ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పడింది. అప్పులపై అసలు, వడ్డీలు కలిపి ఏటా రూ.65,000 కోట్ల నుంచి రూ.70,000 కోట్ల వరకూ చెల్లిస్తున్నారు. మరోవైపు అభివృద్ధి, సంక్షేమంలో ఎక్కడా రాజీపడటం లేదు. ఈ సమయంలో 15 శాతం ఆదాయం తగ్గడం రాష్ట్రాన్ని మరింతగా కుంగదీయనుంది. అప్పులకు అసలు, వడ్డీ చెల్లింపులను పెండింగ్‌లో పెట్టడం సాధ్యం కాదు కాబట్టి, ఈ నష్టం ప్రభావం సంక్షేమం, అభివృద్ధిపైనే పడనుంది. రాష్ట్రంలో రహదారులు, కొత్త అభివృద్ధి ప్రాజెక్టులు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి. ఏళ్ల తరబడి నిలిచిపోయిన పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతి పనులు వేగం పుంజుకున్నాయి. ఈ సమయంలో జీఎస్టీ సవరణలతో నష్టపోతున్న ఆదాయాన్ని కేంద్రమే భర్తీచేసి ఆదుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సెస్ నిధులిచ్చి ఆదుకోవాలి

2017లో జీఎస్టీ పన్ను విధానం అమల్లోకి వచ్చినప్పుడు ప్రతి రాష్ట్రానికి అంతకుముందు వచ్చిన ఆదాయం ఆధారంగా జీఎస్టీ మండలి ఒక బెంచ్‌మార్క్ నిర్దేశించింది. దానికంటే తక్కువ ఆదాయం ఉన్న రాష్ట్రాలకు కేంద్రం పరిహారం ఇచ్చింది. జీఎస్టీపై సెస్ వేసి ఆ ఆదాయాన్ని పరిహారం ఇవ్వడానికి ఉపయోగించింది. ఏపీ ప్రతినెలా సెస్ చెల్లిస్తున్నప్పటికీ, ఇంతవరకూ పరిహారం తీసుకోవాల్సిన అవసరం రాలేదు. 2022 మార్చి తర్వాత ఏ రాష్ట్రం కూడా ఈ పరిహారాన్ని క్లెయిమ్ చేసుకోలేదు. అయితే కొవిడ్ సమయంలో రాష్ట్రాలకు కేంద్రం రుణాలిప్పించింది. వాటికి అసలు, వడ్డీ చెల్లించడానికి ఆ సెస్ నిధులను ప్రస్తుతం వాడుతోంది. ఈ ఏడాది డిసెంబరు నాటికి కొవిడ్ రుణాల చెల్లింపులు పూర్తవుతాయని ఇటీవల జీఎస్టీ మండలిలో చర్చించారు. కానీ, వచ్చే ఏడాది మార్చి వరకు ఈ సెస్‌ను కేంద్రం వసూలు చేయనుంది. ఈ రూపంలో కేంద్రానికి రూ.40,500 కోట్లు అందుబాటులో ఉంటాయని వాటితో రాష్ట్రాలకు జరిగే ఆదాయ నష్టాన్ని భర్తీ చేయొచ్చని ఎస్‌బీఐ రిసెర్చ్ నివేదిక అభిప్రాయపడింది. కేరళ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నాయి. 2018 జూలై, 2019 అక్టోబరులో జీఎస్టీ శ్లాబులు సవరించినప్పుడు కూడా తొలుత ఆదాయం తగ్గినా ఆ తర్వాత పుంజుకున్న విషయాన్ని ఆ నివేదిక గుర్తుచేసింది. కొత్త శ్లాబుల ప్రకారం జీఎస్టీ ఆదాయాలు పుంజుకునే వరకూ తమకు కలిగే నష్టాన్ని కేంద్రం భర్తీ చేయాలని రాష్ట్రాలు కోరుతున్నాయి.

జీఎస్టీ తగ్గింపుతో ఆక్వా రంగానికి ఊతం

» 12 నుంచి 5 శాతానికి తగ్గిన జీఎస్టీ
» తగ్గనున్న చేపలు, రొయ్యల పెంపకం ఖర్చులు
» పెరగనున్న సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు


అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వస్తువులు, సేవల పన్ను(జీఎస్టీ) విధానంలో కేంద్ర ప్రభుత్వం తాజాగా తెచ్చిన సంస్కరణలతో మత్స్య పరిశ్రమకు భారీగా ఉపశమనం లభించింది. సవరించిన జీఎస్టీ రేట్ల ప్రకారం చేప నూనె, వలలు, చేపలు, రొయ్యలు, సముద్ర ఉత్పత్తులు, ఆక్వాకల్చర్ ఇన్‌పుట్స్‌లపై జీఎస్టీని 12 నుంచి 5శాతానికి కౌన్సిల్ తగ్గించింది. దీంతో దేశీయ వినియోగదారులకు విలువ ఆధారిత సముద్ర ఆహార ఉత్పత్తులు సరసమైన ధరకు రానున్నాయి. రొయ్యల సాగు కార్యకలాపాలు, హేచరీలకు అవసరమైన డీజిల్ ఇంజన్లు, పంపులు ఏరియేటర్లు, స్పింక్లర్లపై జీఎస్టీ ఇక 5శాతమే. చేపల చెరువుల్లో నీటి నాణ్యతకు ఉపయోగించే అమ్మోనియా, ఇతర సూక్ష్మపోషకాల వంటి రసాయనాలపై కూడా 5 శాతమే పన్ను పడనున్నది. దీంతోపాటు ఫీడ్ ఖర్చులు తగ్గడం, చేపలు, రొయ్యల చెరువు నిర్వహణ, వాటి ఇన్‌పుట్స్‌పై జీఎస్టీ తగ్గినందున చేపలు, రొయ్యల ఎగుమతులు బలోపేతం కానున్నాయి. అలాగే శుద్ధి చేసిన సముద్ర ఆహార పదార్థాలను ఎక్కువగా వినియోగించడానికి అవకాశాలు పెరుగుతాయి. ఆక్వా ఎగుమతులు గణనీయంగా బలోపేతం కానున్నాయి.

తగ్గిన జీఎస్టీతో రైతులకు ఊరట

జీఎస్టీ సంస్కరణలు రైతులకు ఊరట ఇవ్వనున్నాయి. వ్యవసాయ అవసరాలకు వాడే ట్రాక్టర్లపై జీఎస్టీని 12 నుంచి 5శాతానికి తగ్గించగా, ట్రాక్టర్ విడి భాగాలు, టైర్లు, ట్యూబులపై 18 నుంచి 5శాతానికి తగ్గింది. వ్యవసాయ, ఉద్యాన, అటవీ సాగు భూములకు వాడే యంత్రాలు, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింది. హార్వెస్టర్లు, మందులు పిచికారి చేసే చేతి పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్లు, పౌల్ట్రీ సామాగ్రిపై జీఎస్టీ తగ్గడం రైతులకు ఊరటనిస్తుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు. రూ.5లక్షల విలువ చేసే ట్రాక్టర్‌పై జీఎస్టీ తగ్గడంతో రూ.50వేలపైగా ప్రయోజనం చేకూరనున్నది.

జ్ఞానానికి సాంకేతికత ప్రత్యామ్నాయం కాదు

» మాజీ ఐఏఎస్ డాక్టర్ కె.లక్ష్మీనారాయణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మనిషి జ్ఞానానికి సాంకేతిక అనేది ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదని మాజీ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె.లక్ష్మీనారాయణ స్పష్టంచేశారు. 'ఎంపవరింగ్ ఎడ్యుకేషన్ త్రూ టెక్నాలజీ: ట్రెండ్స్ అండ్ ఇన్నోవేషన్స్' అంశంపై తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో మూడు రోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, అవసరానికి మించి టెక్నాలజీని వాడుకోవడం మంచిది కాదని హితవు పలికారు.

నాకేం తెలియదు.. అంతా కిందివాళ్లే చూసుకున్నారు

» మూడు రోజులుగా ఇదే మాట
» ఏసీబీకి సహకరించని సంజయ్
» రూల్స్‌పై ప్రశ్నించిన అధికారులపై చిరాకు మరోమారు సంజయ్ కస్టడీకి పిటిషన్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏం అడిగినా... 'నాకేం తెలియదు' అని సమాధానం! సభలు, సమావేశాల పేరిట చేసిన 'ఖర్చులు', యాప్ తయారీకి కాంట్రాక్టు సంస్థకు చెల్లింపుల వ్యవహారంలో బయటపడిన అవినీతి భాగోతాలపై ప్రశ్నిస్తే.. "అంతా కిందివాళ్లే చూసుకున్నారు.' అంటూ దాటవేత! వెరసి.. మూడు రోజుల కస్టడీలో ఏసీబీ విచారణకు సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ సహకరించలేదని తెలిసింది. రోజుకు యాభై ప్రశ్నల చొప్పున సుమారు 150ప్రశ్నలు సంధించినా, ఆయన ధోరణిలో మార్పు లేదు. దీంతో విసుగెత్తిపోయిన 'ఇక్కడ నిబంధనలు ఇలా ఉన్నాయి.. ఈ మార్గదర్శకాలను పాటించలేదు.. దీనిపై మీ సమాధానం ఏంటి' అని అడిగితే 'అవన్నీ సెక్షన్‌లో వాళ్లు చూసుకోవాలి.. హెచ్‌వోడీగా నాకు చాలా పనులుంటాయి' అని విచారణ అధికారులపై చిరాకు పడినట్లు తెలిసింది. మంగళవారం నుంచి గురువారం వరకూ ప్రశ్నించిన ఏసీబీ అధికారులు మరో మారు కోర్టులో కస్టడీ పిటిషన్ వేసింది. వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యంగా అవినీతి, అక్రమాలకు పాల్పడిన బ్యూరోక్రాట్లలో సంజయ్ ఒకరు. ఓ వైపు దళితులకు ఖర్చు చేయాల్సిన నిధులు.. మరో వైపు అగ్నిమాపక శాఖలో ఒక ప్రైవేటు సంస్థతో కలిసి స్వాహా చేసిన సొమ్ములపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జరిపిన విచారించింది. సంజయ్ అవినీతి భాగోతం బయట పడింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన దళితులకు ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించేందుకు పలు కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో రూ.1.19కోట్లు ఖర్చు చేసినట్లు, క్రిత్వాప్ టెక్నాలజీస్ అనే సంస్థకు బిల్లులు చెల్లించినట్లు చూపారు.



విజయవాడ జైలు వద్ద ఐపీఎస్ సంజయ్

అయితే రాష్ట్రంలో ఎక్కడా కల్యాణ మండపాల్లో సమావేశాలు నిర్వహించలేదని విచారణలో తేలింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో సంజయ్‌పై ఏసీబీలో కేసు నమోదైంది. మరో వైపు అగ్నిమాపక శాఖలో కూడా సౌత్రిక టెక్నాలజీస్‌కు యాప్ అభివృద్ధి పేరుతో బిల్లులు చెల్లించి 59.93లక్షలు దుర్వినియోగం చేసినట్లు విజిలెన్స్ గుర్తించింది. 'అగ్ని-ఎన్‌వోసీ' వెబ్‌సైట్ రూపకల్పన, యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150ట్యాబ్‌ల సరఫరా కోసం ముందే ఎంపిక చేసుకున్న మూడు సంస్థలతో బిడ్లు వేయించి ఎల్-1గా సౌత్రికా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ బిడ్‌ను ఎంపిక చేసి, బిల్లులు చెల్లించడం వెనుక సంజయ్ అవినీతి ఉన్నట్లు విజిలెన్స్ నివేదికలో స్పష్టం చేసింది. ఈ రెండు అవినీతి భాగోతాలపైనా ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకుని ప్రశ్నించారు.

హృద్రోగ చికిత్సకు అనుమతివ్వండి: సంజయ్ అభ్యర్థన

విచారణ పూర్తయిన అనంతరం సంజయ్‌ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు చేయించిన తర్వాత పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. పోలీసులు కస్టడీలో ఏమైనా ఇబ్బంది పెట్టారా అని న్యాయాధికారి పి.భాస్కరరావు ఆయనను ప్రశ్నించారు. తనను పోలీసులు ఎలాంటి ఇబ్బందులు పెట్టలేదని చెప్పారు. తనకు హృద్రోగం ఉందని గుంటూరులో గానీ, విజయవాడ రమేశ్ ఆసుపత్రిలో గానీ చూపించుకోవడానికి అనుమతి ఇవ్వాలని అభ్యర్థించారు. అనంతరం సంజయ్‌ను జిల్లా జైలుకు తరలించారు. సంజయ్ బెయిల్ పిటిషన్‌పై తదుపరి విచారణను కోర్టు 9వ తేదీకి వాయిదా వేసింది.

హౌసింగ్‌లో ప్రక్షాళన జరగాలి

» గత ప్రభుత్వంలో ఐదు వేల కోట్ల అవినీతి
» చర్యలు లేకపోగా... అవినీతిపరులకే పట్టం కట్టారు
» సీఎంకు వివరంగా లేఖ రాశా: సోమిరెడ్డి

నెల్లూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ హయాంలో పేదల ఇళ్ల మాటున భారీ అవినీతి జరిగింది. కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై రూ.వందల కోట్లు పక్కదారి పట్టించారు. విజిలెన్స్ నివేదికిచ్చినా వారిపై చర్యలు లేవు. ఇప్పటికీ వాళ్లదే రాజ్యం' అని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం టీడీపీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'హౌసింగ్ అక్రమాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి విజిలెన్స్ విచారణ వేయించా. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఇళ్లు కట్టకుండా కట్టినట్లు చూపించి రూ.110 కోట్లు ప్రజా సొమ్ము పక్కదారి పట్టినట్లు విజిలెన్స్ నిగ్గు తేల్చింది. ఇక క్వాలిటీ చెక్ చేస్తే మరో రూ.100 కోట్ల వరకూ అవినీతి తేలుతుంది. ఇలా రాష్ట్రం మొత్తం చూసుకుంటే రూ.5 వేల కోట్లకు పైగానే కుంభకోణం జరిగింది. విజిలెన్స్ నివేదిక ఇచ్చినా బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? గత ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడ్డ కాంట్రాక్టర్లు, అధికారులను ఇప్పుడు కూడా అందలం ఎక్కిస్తున్నారు. వివరాలన్నింటితో సీఎంకు లేఖ రాశా' అని తెలిపారు.

యూరియా సమస్యలకు తక్షణ పరిష్కారం

» గతం కంటే అదనంగా 48,478 టన్నుల సరఫరా: అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు నేరుగా యూరియా చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. అక్రమాలకు తావు లేకుండా, ఎక్కడ సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించే వ్యవస్థను ఏర్పాటు చేశామని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి జిల్లాలో యూరియా సరఫరా, పంపిణీని పర్యవేక్షిస్తూ, తగిన నిల్వలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో కన్నా 31% అధికంగా 48,478 టన్నుల యూరియాను మార్క్‌ఫెడ్ ద్వారా అదనంగా సరఫరా చేసినట్లు తెలిపారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

» రైతులకు వాస్తవాలు చెప్పండి.. కలెక్టర్లతో సీఎస్

'రాష్ట్రంలో ఎక్కడా యూరియా కొరత లేదు. అన్ని జిల్లాల్లో సరిపడా నిల్వలు ఉన్నాయి. రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని సీఎస్ విజయానంద్ స్పష్టం చేశారు. రైతులు ఇబ్బందులు పడుతున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండించాలన్నారు. రైతులకు, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని కోరారు. జిల్లా కలెక్టర్లతో సీఎస్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల్లో ఎరువుల రోజువారీ ఓపెనింగ్, క్లోజింగ్ బ్యాలెన్స్‌ను డిస్‌ప్లే చేయాలన్నారు.

కాఫీ తోటల రైతులకు అండగా ప్రభుత్వం

పాడేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా అరకులోయ మండలంలో బెర్రీ బోరర్ తెగులు సోకి నష్టపోతున్న కాఫీ తోటల రైతులను ఆదుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. చినలబుడు పంచాయతీ పరిధిలోని పకనకుడి, తురాయిగూడ, మాలిసింగారం, తుడిము, చినలబుడు, మాలివలస గ్రామాల్లో కాఫీ పంటకు బెర్రీ బోరర్ సోకింది. వ్యాధి కారణంగా పంట నష్టపోయిన గిరిజన రైతులకు (దిగుబడిని అంచనా వేసి) కిలోకు రూ.50 చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, అధిక మొత్తంలో నష్టపోయిన రైతులకు ఆ పంటను భూమిలో పూడ్చేందుకు (తెగులు వ్యాప్తి చెందకుండా) ఎకరానికి రూ.5 వేలు చొప్పున సాయం అందించనుంది. ఈ సమస్య పరిష్కారానికి కలెక్టర్ చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసింది.

రవాణాకు లాభం మెండు

» ఏపీ లారీ యజమానుల సంఘం

విజయవాడ సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో చేసిన మార్పులు రవాణా రంగానికి కొన్ని అంశాల్లో లాభదాయకంగా, మరికొన్ని అంశాల్లో అదనపు భారం వేసేలా ఉన్నాయని ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యాదర్శి వైవీ ఈశ్వరరావు అభిప్రాయం వ్యక్తం చేశారు. వాహనాలపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గించడంతో లారీ చాసిస్‌లు, టైర్లు, 1,500 సీసీలోపు ఉన్న కార్లు, 1,200 సీసీలోపు ఉన్న పెట్రోల్, ఎలక్ట్రిక్ కార్ల ధరలు తగ్గుతాయని, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌పై 12 నుంచి 5 శాతం జీఎస్టీ తగ్గింపు వాహన యజమానులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. అయితే, ఐటీసీపై 12 నుంచి 18 శాతం పెంపు పెద్ద లాజిస్టిక్ కంపెనీలపై అదనపు భారం మోపుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

సామాన్యులు, వ్యాపారులకు మేలు: ఏపీ చాంబర్స్

జీఎస్టీలో సంస్కరణలను రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఏపీ చాంబర్స్) స్వాగతించింది. జీఎస్టీ శ్లాబుల తగ్గింపుతో సామాన్యులు, వ్యాపారులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందని, సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఎంఎస్ఎంఈలకు ఉపశమనం కల్పించడంతోపాటు కొత్త అవకాశాలను అందిస్తుందని చాంబర్స్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి భాస్కరరావు, బి.రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి ఇంట్లో జీఎస్టీ పండగ: బీజేపీ నేతలు వల్లూరు, దినకర్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మనకు ఆహారాన్నిచ్చే వ్యవసాయం, జీవితాన్ని తీర్చిదిద్దే విద్య, ఆరోగ్యాన్ని అందించే వైద్యం, ప్రతి ఇంటికీ అవసరమైన కిరాణాపై జీఎస్టీ తగ్గించి నెల రోజుల ముందే ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి భారతీయుడి ఇంట్లో దసరా, దీపావళి పండగ తీసుకొచ్చారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ నారాయణ అభివర్ణించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పాన్ మసాలా, పొగాకు వంటి వస్తువులపై పన్ను పెంచడం దేశానికి ఆరోగ్యకరమని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ వ్యాఖ్యానించారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో 'విజ్ఞాన్స్'కి 70వ ర్యాంకు

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్ఆర్‌డీ) గురువారం విడుదల చేసిన 2025వ సంవత్సరం ఉన్నతస్థాయి విద్యాసంస్థల ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకుల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి జాతీయస్థాయిలో 70వ ర్యాంకు లభించిందని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీకి 70వ ర్యాంకు లభించిందన్నారు. అదే విధంగా ఇంజనీరింగ్ విభాగంలో కూడా 80వ ర్యాంకు సాధించినట్టు చెప్పారు. టీచింగ్ లెర్నింగ్ రిసోర్సెస్, రీసెర్చ్ అండ్ ప్రొఫెషనల్ ప్రాక్టీస్, గ్రాడ్యుయేషన్ ఔట్‌కమ్స్, ఔట్‌రీచ్ అండ్ ఇంక్లూజివిటీ, పీఆర్ పర్సెప్షన్ కేటగిరీల్లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ పనితీరును కేంద్రం పరిశీలించి 100 పాయింట్ల స్కోర్ ప్రామాణికంగా ఈ ర్యాంకులను కేటాయించిందన్నారు. ఎన్ఐఆర్ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధించడానికి కృషి చేసిన ఐక్యూఏసీ టీంను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వైస్ చాన్స్‌లర్, కల్నల్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు ప్రత్యేకంగా అభినందించారు.



ఆచార్య పి.నాగభూషణ్

ఫిబ్రవరి 15 నుంచి ఇంటర్నేషనల్ నేవీ ఫ్లీట్ రివ్యూ

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 20 వరకు విశాఖపట్నంలో నేవీ ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్)-2026 నిర్వహించనున్నారు. దీనికి రాష్ట్రపతి, ప్రధానిలతో పాటు 135 దేశాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారు. కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తోంది. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ గురువారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి ఆయా శాఖలు చేపట్టాల్సిన పనులపై మార్గదర్శనం చేశారు. సమావేశంలో సీపీ శంఖబ్రత బాగ్చి, నేవీ కమాండర్ వై.కె.కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సహజయోగ

నిమజ్జనం ఎందుకంటే..



భాద్రపద శుద్ధ చవితిని 'అనంత చతుర్దశి' అంటారు. దీనికి ఒక విశేషం ఉంది. ఆ రోజే వినాయకుణ్ణి నీటిలో నిమజ్జనం చేస్తాం. వినాయక చవితి నాడు మట్టి ప్రతిమను ప్రతిష్ఠించి, పదిరోజుల పాటు పూజలు నిర్వహించిన తరువాత... దాన్ని నదిలో కానీ, సముద్రంలో కానీ కలపడానికి కారణం ఏమిటంటే... పూజలు అందుకున్న వినాయకుడి శక్తులు ఆ నీటి ప్రవాహం ద్వారా సర్వత్రా వ్యాప్తి చెందుతాయి. ఆ విధంగా శ్రీగణేశుని శక్తులు, తత్త్వం అయిన పవిత్రత, వివేకం, అబోధితత్వం, విచక్షణ, తల్లిపట్ల సమర్పణ భావం ఆ అనంతమైన నీటిలో స్థిరపడి ప్రవహిస్తూ సముద్రాన్ని చేరుకుంటాయి. 'అనంత' అంటే వినాయకుడు, నాశనం లేనివాడు. గణేశుని శక్తి అనంతంగా వ్యాపించి ఉంటుంది. అంతటి మహిమాన్వితుణ్ణి నిమజ్జనం చేయడానికి తీసుకువెళుతున్నప్పుడు ఎంతో భక్తి శ్రద్ధలతో మెలగాలి. కీర్తనలు పాడుతూ మేళ తాళాలతో, మంగళప్రదంగా ఆయనను సాగనంపాలి.

భూమాతను గణేశుని తల్లిగా, హిమాలయాలను ఆయన తండ్రి అయిన శివునిగా, సముద్రుణ్ణి ఆయన తాతగారిగా భావించే సంప్రదాయం ఉంది. 'అనంతుడు' అనే పేరు ఉన్న ఆయనను అనంత చతుర్దశి రోజున సముద్రంలో లేదా నదులు, చెరువుల్లో నిమజ్జనం చేయడానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. మట్టినుంచి ఉద్భవించిన గణేశుడు నీటిలోకి చేరి, దాని ద్వారా మానవాళికి, జంతువులకు, ప్రకృతికి తన శక్తులను, తత్త్వాన్ని ప్రసాదిస్తాడు. కాబట్టి నిమజ్జనం కార్యక్రమాన్ని గౌరవప్రదంగా, ఒక పుణ్యకార్యంగా నిర్వహించుకోవాలి.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

పదాలు వేరు... అర్థాలూ వేరు

విశేషం



ఉపాధ్యాయుడు, గురువు, ఆచార్యుడు అనే మూడు విశిష్టమైన పదాలను ఇప్పుడు పర్యాయ పదాలుగా (ఒకే స్థాయి బరువు ఉండే మాటలుగా) వాడేస్తున్నారు. క్రమక్రమంగా లోకంలో ఆ పదాలు సమానార్థకాలు అయిపోయాయి. అది సరి కాదు.

శిష్యుణ్ణి ఎంచుకొనేవాడు ఉపాధ్యాయుడు

'ఉప'... తన సమీపానికి రప్పించుకొని, 'అధ్యాయః' చదువు చెప్పేవాడు (ఉప సమీపమేత్య అధ్యాపయతి) ఉపాధ్యాయుడు. క్రమశిక్షణతో కనిపిస్తున్న పిల్లవాణ్ణి ఇతను నాకు 'విద్యా+అర్థి'గా కనిపిస్తున్నాడు కాబట్టి చదువు చెబుతానని ఎంచుకొనేవాడు ఉపాధ్యాయుడు. ఆ 'విద్యా+అర్థి'ని (కేవలం చదువు కోసమే తనను ఆశ్రయించినవాణ్ణి) తన ఇంటనే ఉంచుకొని బోధిస్తూ ఉండేవాడు. కాబట్టే విద్యార్థికి 'అంతేవాసి' (తన దగ్గరే ఉండేవాడు), 'ఛాత్రుడు' (గురువు ఏదో పొరుగు ఊరు నుంచి ఆలస్యంగా వచ్చి, ఆ రోజు అనుష్ఠానాన్ని పూర్తిగా చేయ(లే)ని పక్షంలో... ఆ దోషాన్ని పదిమందికీ చాటింపు వేయకుండా... (ఛత్రం తచ్ఛీలమస్యేతి ఛాత్రః) 'ఛత్రం' అంటే గొడుగులా దాచిపెట్టేవాడు) అనే పేర్లు వచ్చాయి. ద్వాపర యుగంలో ఎవరు విద్యా బోధకులో వారికి 'ఆచార్యుడు' అనే వృత్తిపరమైన పేరు ఉండేది. ఇప్పటికీ ఆ పద్ధతి అక్కడక్కడా కనిపిస్తుంది. దాంతో కురు, పాండు పుత్రులకు ధనుర్విద్య నేర్పే ఉపాధ్యాయుడు 'కృప-ఆచార్యుడు' అయ్యాడు.

శిష్యుడు ఎంపిక చేసుకొనేవాడు గురువు

కురు, పాండు పుత్రులు బంతి ఆట ఆడుకుంటూ ఉంటే... ఆ బంతి కాస్తా ఒక పాడుపడిన నూతిలో పడింది. వారందరూ ఏమీ తోచక తెల్లముఖాలతో ఆ నూతి చుట్టూ తిరుగుతున్నారు. అప్పటికి ఇంకా ఉపాధ్యాయుడు కాని, ఆచార్య పదవీ లేని ద్రోణుడు ఆ మార్గంలో వెళుతూ వారి పరిస్థితిని గమనించాడు. వారి ప్రార్థన విని... తన భుజాన ఉన్న వింటిని తీసి, నూతిలో ఉన్న బంతిని ఒక బాణంతో కొట్టాడు. సాధారణంగా బాణం తగలగానే బంతి గుండ్రంగా తిరగడమే కాకుండా పక్కకు పడిపోతుంది. అయితే ద్రోణుడు ఒక ప్రత్యేకమైన బాణాన్ని (ఇషువు) తీసుకొని, ఆ బంతిని కొట్టి, ఆ బాణానికి చివర ఉన్న చిన్న రంధ్రంలోకి మరొక బాణాన్ని కొట్టాడు. అలా ఆ రెండు పక్కకు ఒరిగిపోకుండా మరో బాణం చొప్పున కొడుతూ... ఆ బాణాల వరుసను ఒక తాడులా చేసి సునాయాసంగా బంతిని పైకి తీశాడు. దాన్ని కురు, పాండు పుత్రులకు ఇచ్చాడు. చిత్రమేమిటంటే... అద్భుతమైన ఈ ధనుర్విద్యా కౌశలాన్ని అందరూ గమనించలేకపోయారు. బంతి వచ్చిందనే ఆనందంతో వెళ్ళిపోయారు. అర్జునుడు మాత్రం ద్రోణుడి నైపుణ్యాన్ని గమనించి, ఆయననే గురువుగా ఎంచుకున్నాడు. అర్జునుడి అదృష్టం ఎంత గొప్పదంటే... ఈ సంఘటనను సౌధం పై నుంచి చూస్తున్న భీష్ముడికి చెప్పలేనంత ఆనందం కలిగింది. మరుక్షణంలోనే ద్రోణుణ్ణి తన క్షత్రియ విద్యా పాఠశాలలో ధనురాచార్యుడిగా నియమించాడు. దీనితో అయస్కాంతానికి ఇనుప ముక్కలా ద్రోణుడికి అర్జునుడు మరింతగా అతుక్కుపోయాడు.

గురువు లేని నేనెందుకు?

ద్రోణుడి విషయంలో దుర్యోధనుడు నిరంతరం ద్వేషభావంతో ఉండేవాడు. తమ కౌరవులకన్నా పాండు పుత్రులకు మరింత శ్రద్ధగా ఆయన చదువు చెబుతున్నాడేమో? అనే సందేహమే దీనికి కారణం. అర్జునుడు తనకు బాగా దగ్గరయ్యాడనే సంగతి ద్రోణుడికి అర్థమయినా... అతణ్ణి పరీక్షించాలనుకున్నాడు. తన శిష్యులందరితో తాను నిత్యం స్నానం చేసే తటాకం దగ్గరకు వెళ్ళాడు. స్నానం చేస్తూ "మొసలి! మొసలి!" అంటూ గట్టిగా అరిచాడు. ఆ మొసలి మనల్ని కూడా తినేస్తుందనో, వేరే సంశయాలతోనో గురువును రక్షించే ప్రయత్నం ఎవరూ చేయలేదు. కానీ గురువు అరుపు విన్న వెంటనే అర్జునుడు ఆ చెరువులోకి దూకాడు. తరువాత అదంతా గురువు ఆడిన నాటకం అని గ్రహించి పరమానందపడ్డాడు. ఒడ్డుకు చేరిన తరువాత "అర్జునా! అక్కడ మొసలే గనుక ఉండి, నాతో పాటు నిన్నుకూడా తినేసినట్టయితే?" అన్నాడు ద్రోణుడు. అర్జునుడు దానికి బదులిస్తూ "అయ్యా! మీరంటూ లేకపోయిన తరువాత ఈ ధనస్సు, బాణాలు, వాటిని ధరించిన నేను ఉండడం ఎందుకు?" అని బదులిచ్చాడు. దాంతో ఆ గురుశిష్యానుబంధం పాలు-నీరులా కలిసిపోయింది. ఇదీ గురు విధానం అంటే. ఏవో సిఫార్సులతోనో, బెదిరింపులతోనో ఉపాధ్యాయులను నియమించే విధానం ఉంటే విద్యా వ్యవస్థ దెబ్బతిని తీరుతుంది. ఆ మర్మాన్ని ఎరిగినవాడు కాబట్టే ద్రోణుణ్ణి భీష్ముడు ఆచార్యునిగా నియమించడం ఒక విశేషం కాగా, చక్కని పాండిత్యం ఉన్నా తగిన ఉద్యోగావకాశం లేకపోవడం అనేది ద్వాపర యుగం నుంచీ ఉన్నదనేది మరో విశేషం. అలాగే ఒక సంస్థకు అధిపతిగా ఎవరుంటారో వారి సంతానానికి (ఇక్కడ కౌరవులకు) అహంకారం కారణంగా సరైన చదువు అబ్బదనేది, మాయోపాయాలతో గెలుపు సాధించే పద్ధతే అలవడుతుందనేది, వారు గురునిందకు వెనుకాడరనేది గమనించాల్సిన ఇంకో విశేషం. అందుకే సుయోధనుడు చక్కని యుద్ధ విద్య తెలిసినవాడే అయినా చివరకు దుర్-యోధనుడే అయ్యాడు.

అనేక గురు సమూహం... ఆచార్యుడు


'కృష్ణం వందే జగద్గురుమ్' అని పరమాత్మను స్తుతిస్తారు. అంటే ద్రోణుడిలా పాఠ ప్రవచనాన్ని చేసేవాడని కాదు. కృష్ణుడు యుద్ధ విద్యలో నిపుణుడు. అందుకే నరకాసుర వధను స్వయంగా చేయగలిగాడు. సత్యభామకు కూడా యుద్ధ విద్య తెలుసుననే విషయాన్ని లోకానికి తెలియజెప్పడం కోసం ఓడినట్టు తాత్కాలికంగా నటించాడు తప్ప... నరకాసుర వధ చేసినది ఆయనే. అంతేకాదు.. ప్రతిక్షణమూ పాండవులకు అండగా ఉంటూ, ఎన్నెన్నో ఉపద్రవాల నుంచి వారిని బయటపడేశాడు. యుద్ధ, రాజనీతి, ధర్మ, వేదాంతశాస్త్రాది అనేక విషయాల్లో శిఖరాగ్ర పాండిత్యం ఉన్న ఆయన... గీతను ఉపదేశించి 'గీతాచార్యుడు' అయ్యాడు. అలాగే భీష్ముడు కూడా కేవలం ధనుర్విద్యనే కాకుండా రాజపరిపాలన, పూర్వ రాజుల చరిత్ర అధ్యయనం చేశాడు. తన వంశం నిర్వంశం అవుతున్న దశలో వ్యాసుణ్ణి ప్రార్థించి, వంశాన్ని నిలబెట్టేలా చేయగలిగాడు. యౌవన గర్వంతో తాను చేసిన మూడు తప్పులకు తనకుతానే అంపశయ్య శిక్ష విధించుకున్నాడు. ధర్మశాస్త్ర పాండిత్యం కూడా కలిగి 'భీష్మాచార్యుడు' అనిపించుకోగలిగాడు. ద్రోణుడు కూడా భీష్ముడికి దగ్గరై, ఆయన దగ్గర రాజ్య తంత్రాలన్నీ తెలుసుకొని, సర్వశాస్త్ర పాండిత్యాన్ని సంపాదించిన కారణంగా 'ద్రోణాచార్యుడు' అనే పిలుపును అందుకున్నాడు. ఇలా ఉపాధ్యాయుడు, గురువు, ఆచార్యుడు అనే పదాలకు విస్తృతమైన వేర్వేరు అర్థాలు, ప్రత్యేకతలు ఉన్నాయి.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
(నేడు ఉపాధ్యాయ దినోత్సవం)

దైవమార్గం

క్రీస్తు శిష్యులు

గురుశిష్య బంధం ఎంతో ప్రాచీనమైనది. ఏసు క్రీస్తు ప్రధాన శిష్యులు పన్నెండు మంది. వారందరూ ఆయనను విచిత్రంగా కలిసినవారే. ఈ శిష్యులలో శాస్త్రజ్ఞానం కలిగినవారు ఎవరూ లేరు. చేపలు పట్టుకొనేవారు, చెక్క పని చేసుకొనేవారు, పశువుల కాపరులు... ఇలా వివిధ వృత్తులు చేస్తూ జీవించే నిరక్షరాస్యులు వారు. ఇలాంటి శిష్యులను ఏసు ఎంపిక చేసుకోవడం ఆయన అభ్యుదయ భావాలకు సంకేతం. ఈ శిష్యులందరూ ఏసు పట్ల వినయవిధేయతలు ప్రదర్శించినవారే. ఆయన వెంట నడిచినవారే. ఆ పన్నెండుమందిలో చివరివాడు యోహాను. నలుగురు సువార్తికుల్లో (మత్తయి, మార్కు, లూకా, యోహాను) అతనొకరు. ఏసు జీవన రేఖలను, దైవికమైన వ్యక్తిత్వాన్ని తన సువార్తలో పూసగుచ్చినట్టు యోహాను చిత్రీకరించాడు. ఏసు పన్నెండు మంది శిష్యుల్లో పెద్దవాడు పేతురు. అతణ్ణి తన సందేశ ప్రచారయాత్రకు సారథిగా ఏసు నియమించాడు. "నీవు రాయిలాంటి గట్టివాడివి. నీ మీద ఈ నా సంఘాన్ని నిర్మిస్తాను. దాన్ని నడిపించు" అంటూ బాధ్యతను అప్పగించాడు. ఇక యూదా ఇస్కరియోతు అనే శిష్యుడు ఏసును రోమన్ సైనికులకు పట్టి ఇచ్చాడు. ఏసు మరణానికి హేతువయ్యాడు. తోమాస్ అనే శిష్యుడు మన భారతదేశానికి వచ్చి, క్రీస్తు గురించి బోధించాడు.



ఏసును ఆయన శిష్యులు 'బోధకుడా' అని పిలిచేవారు. గురువుగా సంబోధించేవారు. గురు శిష్య బంధం అంటే గ్రంథాల్లోని పాఠాలు వల్లించడం మాత్రమే కాదని, పరిస్థితులు, మనస్తత్వాల పట్ల అవగాహన ముఖ్యమనీ వారు చాటారు. క్రీస్తు పట్ల ఆరాధనా భావం, భక్తిభావం వారికి ఉండేది. ఎందుకంటే... వారి కళ్ళముందే ఆయన అద్భుతాలు చేశాడు. దివ్య రూపం ధరించాడు. ఎన్నో హితవులు బోధించాడు. ఆ శిష్యుల వ్యక్తిత్వాలను మలిచాడు. వారు కూడా అద్భుతాలు చేసేలా తీర్చిదిద్దాడు. ఏసు ఆదేశం ప్రకారం ఆ శిష్యులు గ్రామాలు గ్రామాలు నడిచారు. ఆకలిని, దప్పికను ఓర్చుకున్నారు. ప్రజలతో బంధాన్ని పెంచుకున్నారు. ఆయన సందేశాన్ని లోకమంతటా వినిపించారు. అశేష ప్రజలు ఆయన మార్గాన్ని అనుసరించేలా చేశారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్ 9866755024

సీసాలో భూతం!

(మొదటి పేజీ తరువాయి)

'సిట్' జరిపిన సోదాల్లో తేలిన సరికొత్త సంగతి ఇది! విశ్వసనీయ సమాచారం ప్రకారం...

జగన్‌కు సన్నిహితుడైన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన కుమారుడు మోహిత్ రెడ్డి నివాసాలు, కార్యాలయాల్లో 'సిట్' సోదాలు జరిపిన సంగతి తెలిసిందే. మోహిత్ రెడ్డి ఏకంగా రూ.600 కోట్ల విలువైన భూ లావాదేవీలు జరిపినట్లు ప్రాథమిక ఆధారాలు గుర్తించింది. ఇది... 'అధికారికంగా' రూ.6 కోట్లతో మొదలైనట్లు తెలుస్తోంది. కల్యాణ వెంకటేశ్వర స్వామి (కేవీఎస్) ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో గూడూరు చుట్టుపక్కల ఏకంగా 260 ఎకరాలు కొనుగోలు చేశారు. రికార్డుల్లో ఎకరం రూ.2.10 లక్షలకు కొన్నట్టు చూపించారు. ఇది రిజిస్ట్రేషన్ విలువ మాత్రమే! బహిరంగ మార్కెట్ విలువ అంతకు అనేక రెట్లు ఉంటుంది. 2022 అక్టోబరులో ఈ డీల్ జరిగింది. ఆ తర్వాత రెండు నెలలకే... డిసెంబరులో ఇవే భూములను రూ.26 కోట్లకు, అంటే ఎకరం రూ.10 లక్షలకు అరబిందోకు విక్రయించారు. ఇది కూడా రిజిస్ట్రేషన్ ధరే! భారీగా ల్యాండ్‌బ్యాంక్‌ను సమకూర్చుకుంటున్న అరబిందో సంస్థ ఈ భూములను సొంతం చేసుకుంది. కేవీఎస్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ రికార్డుల్లో ఈ లావాదేవీల వివరాలు నమోదయ్యాయి.

'తుడా' పదవితో చక్రం...

బ్లాక్‌ను 'వైట్' చేసుకోగా వచ్చిన డబ్బులతో మోహిత్ రెడ్డికి చెందిన కేవీఎస్ ఇన్‌ఫ్రా ద్వారా తిరుపతి చుట్టు పక్కల భారీగా భూముల కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్నారు. వందలకోట్ల రూపాయల విలువైన భూములు సొంతం చేసుకున్నారు. అప్పట్లో 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) చైర్మన్‌గా ఉన్న మోహిత్ రెడ్డి... సంస్థ నిధులతో తన భూముల్లో రోడ్లు వేయించుకున్నారు. ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి... వాటి ధరలు భారీగా పెరిగేలా చూసుకున్నారు. కేవీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు క్యాంప్ మ్యాన్ పవర్ సర్వీసెస్, సీఎంఆర్ అగ్రిక్రాఫ్ట్ ప్రైవేట్ లిమిటెడ్, చెవిరెడ్డి మునిరెడ్డి గార్డెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, గ్రైన్ ప్రైవేట్ లిమిటెడ్... ఇలా మొత్తం ఎనిమిది కంపెనీలతో చెవిరెడ్డి కుటుంబం లావాదేవీలు నడిపింది. ఎన్నికల తర్వాత వాటిలో కొన్నింటిని మూసేశారు. వాటి రికార్డుల పరిశీలనలో భారీగా అక్రమ లావాదేవీలు బయట పడుతున్నట్లు సమాచారం. అలాగే, చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానంద రెడ్డి, సజ్జల భార్గవ రెడ్డి తదితరుల బినామీ కంపెనీల ద్వారా 200కోట్ల వరకూ వ్యవహారాలు జరిగినట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చిన సిట్... వాటికి సంబంధించిన ఆధారాలను ఒక్కొక్కటిగా సేకరిస్తోంది.



చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో తనిఖీలు

మోహిత్‌పై ప్రశ్నల వర్షం!



- కేవీఎస్ ఇన్‌ఫ్రాపై లోతుగా ఆరా
- ఇతర కంపెనీల లావాదేవీలపైనా...
- హార్డ్ డిస్కులు, రికార్డులు స్వాధీనం

తిరుపతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం స్కామ్‌లో నిందితుడు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో 'సిట్' అధికారులు విస్తృతంగా సోదాలు జరిపారు. అధికారులు రెండు బృందాలుగా విడిపోయారు. ఒక బృందం ఇంట్లో తనిఖీలు చేపట్టగా... మరో బృందం చెవిరెడ్డి తనయుడు మోహిత్ రెడ్డిని విచారించింది. కేవీఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కార్యకలాపాలపై లోతుగా ప్రశ్నించినట్లు సమాచారం. అధికారులు రెండు కంప్యూటర్ హార్డ్ డిస్కులు, సీసీ కెమెరాల హార్డ్ డిస్కులు, పలు రికార్డులు, డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి బుధవారం మధ్యాహ్నమే 'సిట్' చేరుకోగా ఇంటికి తాళం వేసి ఉంది. చెవిరెడ్డి సతీమణి లక్ష్మి, తనయుడు మోహిత్‌రెడ్డి గురువారం హైదరాబాద్ నుంచి వచ్చారు. తిరుపతి రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో 15 మందితో కూడిన సిట్, విజిలెన్స్ అధికారులు చెవిరెడ్డి ఇంటికి చేరుకున్నారు. గురువారం రాత్రి కూడా ఈ విచారణ కొనసాగింది.

సుదీర్ఘ విచారణ

బుధవారం చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్‌లలో చేపట్టిన తనిఖీల ఆధారంగా అధికారులు ప్రశ్నావళి సిద్ధం చేసుకున్నారు. మోహిత్ రెడ్డిని సుదీర్ఘంగా ప్రశ్నించారు. లిక్కర్ స్కామ్ కేసులో ఆయన 39వ నిందితుడు. ఆయన రూ.600 కోట్లకుపైగా విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు సాగించినట్టు గుర్తించిన సిట్ అధికారులు... ఆ వివరాలు అడిగారు. మోహిత్‌రెడ్డి, విజయానంద రెడ్డి ఉమ్మడిగా చేస్తున్న వ్యాపారాలపై ఆరా తీశారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి (కేవీఎస్) ఇన్‌ఫ్రా, సీఎంఆర్ ప్రాజెక్ట్స్, మ్యాచ్ కార్న్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్, క్యాంప్ మ్యాన్ పవర్ సర్వీసెస్, చెవిరెడ్డి, మునిరెడ్డి, రోశమ్మ గార్డెన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బీమ్ స్పేసెస్ ఎల్‌ఎల్‌పీ తదితర సంస్థల్లో ఎవరెవరికి భాగస్వామ్యం ఉందని అడిగినట్టు తెలిసింది. పెట్టుబడులు ఎలా వచ్చాయి? వాటికి ఆధారాలేమిటి? జీఎస్టీ చెల్లిస్తున్నారా? ఆడిట్ రిపోర్టులు ఉన్నాయా? ఆయా కంపెనీల టర్నోవర్ తదితర ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. రిపోర్టుల కోసం ఆడిటర్‌ను పిలిపించాలని కోరగా... ఆడిటర్ సెలవులో ఉన్నట్లు మోహిత్ సమాధానమిచ్చినట్లు సమాచారం. ఇక... మోహిత్, విజయానంద్‌రెడ్డి పేరిట తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్‌లలో ఉన్న పలు కంపెనీలకు రిజిస్ట్రేషన్లే లేవని గుర్తించినట్టు తెలిసింది. చెవిరెడ్డి కుటుంబానికి సంబంధించిన సంస్థలు, వ్యక్తిగత డ్రైవర్లు, మేనేజర్లు, పీఆర్వోలు, గన్‌మెన్ సహా సిబ్బంది అందరి వివరాలను సిట్ సేకరించినట్టు తెలిసింది.

ఆ పంపిణీకి సొమ్ములెలా?

చంద్రగిరిలో పండగలూ పబ్బాలకు చెవిరెడ్డి కుటుంబం పలుమార్లు స్వీట్లు, దుస్తులు, కోడి గుడ్లు, గోడ గడియారాలు, కూరగాయలు, కుక్కర్లు వంటివి పంపిణీ చేసింది. దానికి నిధులు ఎక్కడి నుంచీ వచ్చాయని కూడా అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. 'నా వైపు ఏ తప్పూ లేదు. దేవుడే చూసుకుంటాడు' అని మోహిత్ రెడ్డి అన్నట్టు తెలిసింది.

వివరాలు, రికార్డులు సిట్‌కు అందజేస్తాం

సేకరించిన వివరాలు, రికార్డులు సిట్‌కు అందజేస్తామని ఎస్పీ కరీముల్లా షరీఫ్ గురువారం రాత్రి చెవిరెడ్డి ఇంటి ఎదుట మీడియాకు తెలిపారు. ఆరు కంపెనీల చిరునామాలు సిట్ ఇచ్చిందని, వాటిని పరిశీలించామని చెప్పారు.

అధికారులకు సహకరించా...

దర్యాప్తు కోసం వచ్చిన అధికారులకు సహకరించానని, ఇకముందూ సహకరిస్తానని మోహిత్‌రెడ్డి మీడియాకు చెప్పారు.

చెవిరెడ్డి బెయిలుపై 10న తీర్పు

విజయవాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం కేసులో విజయవాడ జిల్లా జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై తీర్పు పదో తేదీన వెలువడుతుంది. తనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని చెవిరెడ్డి పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై కోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. తీర్పును 10న వెలువరిస్తామని న్యాయాధికారి పి.భాస్కరరావు వెల్లడించారు.

నాకు మంచి గుర్తింపు తెచ్చే సినిమా

- మనోజ్ మంచు



"మిరాయ్' నాకు కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది. ట్రైలర్ విడుదలయ్యాక నా నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఇంత అద్భుతమైన పాత్రను ఇచ్చిన దర్శకుడు కార్తీక్ ఘట్టమనేనికి రుణపడి ఉంటాను' అని మంచు మనోజ్ అన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'మిరాయ్' ఈ నెల 12న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రతినాయక పాత్ర పోషించిన మనోజ్ మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- ఈ చిత్రం కథానేపథ్యం కొత్తగా ఉంటుంది. శ్రీరాముని జీవితం, తొమ్మిది పుస్తకాలు, ఇతిహాసాలను మిళితం చేస్తూ సినిమాను అద్భుతంగా రూపొందించారు. ఇందులో నా పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. బద్ధకస్తుడు బతికి ఉండకూడదు అనే తాత్త్వికతతో ప్రవర్తించే పాత్ర నాది.
- ఈ సినిమా కోసం ముందుస్తుగా సన్నద్ధమయ్యాను. దాదాపు మూడేళ్ల షూట్ చేశాం. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నాను. తేజ పడిన కష్టం తెరపైన మీకు కనిపిస్తుంది. కార్తీక్ సాంకేతికతను ఉపయోగించుకోవడంలో దిట్ట. మరో దర్శకుడు ఈ చిత్రాన్ని తీయాలంటే ఈ బడ్జెట్‌లో అసాధ్యం. తన అనుభవంతో కార్తీక్ హాలీవుడ్ స్థాయిలో ఈ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. దాదాపు సినిమా అంతా రియల్ లొకేషన్లలోనే షూట్ చేశాం. కార్తీక్ గారు ప్రత్యేక శ్రద్ధతో నా పాత్రను తీర్చిదిద్దారు. విశ్వప్రసాద్ గారి విజన్ చాలా గొప్పగా ఉంటుంది. 'మిరాయ్'ను గ్రాండ్ స్కేల్లో నిర్మించారు. ప్రస్తుతం డేవిడ్ రెడ్డి, రక్షక్ చిత్రాల్లో నటిస్తున్నాను.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో
మెరుగ్గా ఆంధ్రా యూనివర్సిటీ

- రాష్ట్ర ప్రభుత్వ వర్సిటీల విభాగంలో 4వ స్థానం
- యూనివర్సిటీల విభాగంలో ఏయూకు 23, ఏఎన్‌యూకు 84వ ర్యాంకు
- అభినందనలు తెలిపిన లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఆంధ్రా యూనివర్సిటీ మెరుగైన ప్రదర్శన చేసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్‌ఐఆర్‌ఎఫ్) ర్యాంకుల్లో పలు విభాగాల్లో 100 లోపు ర్యాంకులు సాధించింది. ఓవరాల్ విభాగంలో గతేడాది సాధించిన 41 ర్యాంకులోనే ఈ ఏడాది కూడా నిలిచింది. ఇదే విభాగంలో కేఎల్ యూనివర్సిటీ 46 ర్యాంకు సాధించింది. యూనివర్సిటీల విభాగంలో ఆంధ్రా వర్సిటీ రెండు ర్యాంకులు మెరుగుపరుచుకుని 23వ స్థానంలో నిలిచింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 84 ర్యాంకు సాధించింది. కేఎల్ యూనివర్సిటీ 26, విజ్ఞాన్ 70, గీతం 88 ర్యాంకులు సాధించి టాప్-100లో నిలిచాయి. ఓవరాల్ ర్యాంకింగ్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ 101- 150 కేటగిరీలో నిలిచింది. ఎస్వీయూ 151-200 కేటగిరీలో ఉంది. ఇక ఫార్మా విభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ 31వ ర్యాంకు, ఇంజనీరింగ్ కాలేజీల విభాగంలో 88వ ర్యాంకు సాధించింది. లా కాలేజీల విభాగంలో విశాఖలోని అంబేడ్కర్ న్యాయ కళాశాలకు 16వ ర్యాంకు దక్కింది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకుల్లో మెరుగైన ర్యాంకులు సాధించిన ఏయూ, ఇతర వర్సిటీలకు రాష్ట్ర మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. రాష్ట్ర విద్యా సంస్థలు మెరుగైన ర్యాంకులు సాధించాయని ఉన్నత విద్యామండలి ఓ ప్రకటనలో తెలిపింది.

ఎయిరిండియా విమానానికి
తప్పిన ప్రమాదం

గన్నవరం, మడకశిర టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి గురువారం గన్నవరంలో పెను ప్రమాదం తప్పింది. ఉదయం ఎయిర్‌పోర్టు నుంచి 97 మంది ప్రయాణికులతో విమానం బెంగళూరుకు బయలుదేరింది. టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. పైలెట్ అప్రమత్తమై సడెన్ బ్రేక్ వేశారు. విమానాన్ని తిరిగి ఆప్రాన్‌కు మళ్లించారు. ఏం జరిగిందో తెలియని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఇదే విమానంలో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ఉన్నారు.

గంజాయి, డ్రగ్స్‌పై
ఉక్కుపాదం మోపండి

- మంత్రివర్గ ఉపసంఘం

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి, మత్తు పదార్థాల సరఫరా నెట్‌వర్క్ ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టి నియంత్రించాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణకు పలు కీలక సూచనలు చేసింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం హోం మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో మంత్రులు లోకేశ్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్, గుమ్మిడి సంధ్యారాణితో కూడిన కమిటీ సమావేశమైంది.

లోకేశ్ తలకుమాసినోడు..
పనికిమాలినోడు..

- బాబు రాజకీయ అరాచకవాది
- సజ్జల భార్గవరెడ్డి అమాయకుడు
- సిట్...పత్రికల బ్యూరోగా పనిచేస్తోంది
- లిక్కర్ స్కామ్ జరగనే జరగలేదు
- కేసులు పెట్టే అధికారులు, నేతలకు మూడేళ్ల తర్వాత మ్యాజిక్ మొదలవుతుంది
- వైసీపీ నేత సజ్జల హెచ్చరికలు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో వైసీపీ నేతలు అసహనంతో రగిలిపోతున్నారు. సర్కారు, సీఎం చంద్రబాబుపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. గురువారం మీడియా సమావేశం పెట్టి మరీ వైసీపీ ముఖ్యనేత సజ్జల రామకృష్ణారెడ్డి నోరు పారేసుకున్నారు. 'తలకుమాసినోడు..పనికిమాలినోడు..' అంటూ మంత్రి లోకేశ్‌పై తిట్ల దండకం అందుకున్నారు. కేసులు పెడుతున్న అధికారులకు మూడేళ్ల తర్వాత మ్యాజిక్ మొదలవుతుందంటూ ఏకంగా బెదిరింపులకు దిగారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ నేతలను బుధవారం మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు హెచ్చరించిన విషయం తెలిసిందే. అలాగే, లిక్కర్ స్కామ్ కేసులో సజ్జల కుమారుడు భార్గవరెడ్డి పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఈ నేపథ్యంలో తాడేపల్లి ప్యాలెస్ ప్రాంగణంలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో 'ఎంపిక' చేసిన మీడియా సమక్షంలో చంద్రబాబుపై సజ్జల రెచ్చిపోయారు. "చంద్రబాబు అరాచకవాది. బెదిరింపులకు దిగుతున్నారు. యూరియా కొరతపై మాట్లాడిన రైతులందరినీ వైసీపీ నేతలుగా చిత్రీకరిస్తున్నారు. జైలుకు పంపుతానంటూ పబ్లిక్‌గా బెదిరిస్తున్నారు. చంద్రబాబే కృత్రిమ కొరత సృష్టించారు. బ్లాక్‌మార్కెట్‌కు తరలించి వందల కోట్లు దోచుకుంటున్నారు." అంటూ విమర్శించారు. డీఫాక్టో సీఎంగా వ్యవహరిస్తూ.. కమీషన్లపై లోకేశ్ దృష్టిపెట్టారని విమర్శించారు. లిక్కర్ స్కామ్ జరగనేలేదని సజ్జల క్లీన్‌చిట్ ఇచ్చేశారు. తన కుమారుడు సజ్జల భార్గవరెడ్డి కంపెనీ పెట్టినా .. లావాదేవీలు జరపలేదన్నారు. ఆ కంపెనీకి అసలు బ్యాంకు అకౌంటే లేదన్నారు. లిక్కర్ సిట్ .. ప్రభుత్వ సానుకూల మీడియా సంస్థల బ్యూరోలా పనిచేస్తూ ...రోజూ ప్రధాన శీర్షికలకు వార్తలు అందిస్తోందని విమర్శించారు.


THE CASE THAT ENDED IT ALL
నేడే
విడుదల
ది
కంజురింగ్
లాస్ట్ రైట్స్
THE CONJURING
LAST RITES
IN ENGLISH, HINDI & TELUGU
EXPERIENCE IT IN IMAX


BOLDEST FILM EVER
FROM THE MAKERS OF
THE KASHMIR FILES & THE TASHKENT FILES
TEJ NARAYAN & SNEHLATA AGARWAL
AND I AM BUDDHA PRESENT
ది
బెంగాల్
ఫైల్స్
In Telugu | Hindi
A FILM BY VIVEK RANJAN AGNIHOTRI
PRODUCED BY ABHISHEK AGARWAL, PALLAVI JOSHI
& VIVEK RANJAN AGNIHOTRI
IN CINEMAS
TODAY
For Bulk Booking Contact
+91 97696 27921
THE
BENGAL
FILES
SCAN THIS CODE &
BOOK YOUR TICKETS ON


A ORIGINAL PRODUCTION
లిటిల్
హార్ట్స్
NO TOUCHING,
ONLY HEART-TOUCHING.
నేడే
విడుదల
SAINIKPURI
VAYUPURI
SAI MARTHAND
ADITYA HASAN


SHINE SCREENS
SMT. ARCHANA PRESENTS
RELEASING WORLDWIDE
SEP 12
2025
కిష్కింధపురి
SAHU GARAPATI
KOUSHIK PEGALLAPATI


నేడే
విడుదల
SRI LAKSHMI MOVIES
N.SRILAKSHMI PRASAD
SIVAKARTHIKEYAN IN
మదరాసి
MADHARAASI
AN A.R. MURUGADOSS FILM
AN ANIRUDH MUSICAL
SUDEEP ELAMON SREEKAR PRASAD
TAMIL TELUGU HINDI KANNADA MALAYALAM


UV creations
FIRST FRAME ENTERTAINMENTS
నేడే
విడుదల
VICTIM. CRIMINAL. LEGEND.
ఘాటి
A KRISH JAGARLAMUDI FILM
PRODUCED BY RAJEEV REDDY, SAI BABU JAGARLAMUDI
amazon prime
U/A

చక్కెర కలిపితే 'ధర' చేదు!



సహజ, కృత్రిమ చక్కెరలు కలిపిన శీతల పానీయాలు, కృత్రిమ పళ్ల రసాలు, ఇతర పానీయాలను 'హానికర' పదార్థాల కేటగిరీతోపాటు 40శాతం ప్రత్యేక పన్ను రేటులో చేర్చడం గమనార్హం. దీనితో శీతల పానీయాలు, ఐస్ టీలు, కెఫీన్ కలిపిన పానీయాలు, ఎనర్జీ డ్రింకులు వంటివాటి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇదే కారణంతో కారమెల్ తీపి పదార్థం కలిపిన పాప్‌కార్న్‌ను కూడా 18శాతం పన్ను రేటులో కొనసాగించారు. సాధారణ పాప్‌కార్న్‌పై 5శాతమే పన్ను వేశారు. మరోవైపు చక్కెర కలిపేవే అయినా.. పళ్ల రసాలు, పాల ఆధారిత పానీయాలు, ఐస్ క్రీమ్, పేస్ట్రీలు, సంప్రదాయ మిఠాయిలపై పన్ను రేటును 5శాతానికే పరిమితం చేశారు.

ఐస్‌క్రీమ్‌లు మరింత తీపి..



పాలు, పాల ఉత్పత్తులపై వసూలు చేస్తోన్న జీఎస్టీ అంశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఐస్‌క్రీమ్‌ల ధరలు బాగా తగ్గనున్నాయి. ఉత్పత్తిదారు లేదా ఐస్‌క్రీమ్ పార్లర్లు, రిటైల్ దుకాణాల్లో విక్రయించే ఐస్‌క్రీములపై జీఎస్టీని 18% నుంచి 5 శాతానికి తగ్గించారు. ఉదాహరణకు ఓ ఐస్‌క్రీమ్ ధర రూ.100 అయితే 18 శాతం జీఎస్టీ కలిపి రూ.118 అయ్యేది. ఇప్పుడు రూ.105కు తగ్గుతుంది. ఇక నెయ్యి, వెన్న, చీజ్ వంటి వాటిపై ప్రస్తుతం 12% ఉన్న పన్నును ఐదు శాతానికి తగ్గించారు. ఈ నిర్ణయాలు వినియోగదారులతోపాటు పాడి రైతులకు, డెయిరీ పరిశ్రమకు లబ్ధి చేకూరుస్తాయని కేంద్రం ప్రకటించింది. వెన్న, నెయ్యి, పాలు విక్రయానికి వాడే ఇనుము, స్టీల్, అల్యూమినియం డబ్బాలపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడం కూడా డెయిరీ రంగానికి ఊరటనిచ్చే అంశమని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

తగ్గనున్న హోటల్ గదుల అద్దెల భారం.. పర్యాటకానికి ఊతం



రోజుకు రూ.7,500లోపు అద్దె ఉండే హోటల్ గదులపై జీఎస్టీని ప్రభుత్వం 5 శాతానికి తగ్గించింది. ఈ నిర్ణయం పర్యాటక రంగానికి ఊతమిస్తుందనే హర్షం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం రూ.వెయ్యి- 7,500 లోపు అద్దె గదులపై 12% జీఎస్టీ ఉంది. తాజా తగ్గింపుతో పర్యాటకులపై అద్దె భారం తగ్గనుంది. ప్రస్తుతం రూ.6వేలు అద్దె అయితే 12% జీఎస్టీ కలిపి రూ.6,720 చెల్లించాలి. అదే సెప్టెంబరు 22 నుంచి రూ.6,300 చెల్లిస్తే చాలు. కాగా, సెప్టెంబరు 22నుంచి రూ.7500 పైబడిన అద్దె ఉండే గదులను 18 శాతం జీఎస్టీ పరిధిలోకి వస్తాయి.

బిజినెస్ క్లాస్ ఫ్లైట్ టికెట్లు మరింత ప్రియం



సెప్టెంబరు 22 నుంచి విమానాల్లో ఎకానమీ మినహా బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్ల ధరలు పెరగనున్నాయి. ఎకానమీ టికెట్లపై జీఎస్టీ 5% మార్చలేదు. బిజినెస్, ఫస్ట్ క్లాస్ టికెట్లపై జీఎస్టీని 12 శాతం నుంచి 18 శాతానికి పెంచారు. ఫలితంగా విమానాల్లో సౌకర్యవంతంగా, విలాసవంతంగా ప్రయాణించాలంటే మరింత డబ్బు చెల్లించాల్సిందే. అయితే, ధరలు పెరిగితే ఎకానమీ క్లాస్ టికెట్లకు డిమాండ్ పెరుగుతుందని విమానయాన రంగానికి చెందిన నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

షికారు కోసం కాస్త ఆగండి!



ఈ నెల 22 నుంచి కొత్త పన్ను రేట్లతో గణనీయంగా తగ్గనున్న కార్ల ధరలు

- రూ.80 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు ఆదా
- జీవితకాల పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీల ఉపశమనం కూడా
- రూ. 10లక్షల్లోపు కార్ల విక్రయాలు పెరుగుతాయని అంచనా
- ద్విచక్ర వాహనాలపై రూ.10-25 వేల వరకు మిగిలే చాన్స్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొత్త కారు కొనుక్కుని షికారు చేయాలను కుంటున్నారా? షోరూమ్‌కు వెళ్లడానికి సిద్ధమవుతున్నారా?.. కాస్త ఆగండి. జీఎస్టీ పన్ను రేట్ల మార్పు ప్రయోజనాన్ని పొందేందుకు కాస్త ఓపిక పట్టండి. ఈనెల 22 తర్వాత కార్ల ధరలు తగ్గనున్నాయి. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా ఆదరించే చిన్న, మధ్యతరహా కార్లపై రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు మిగలనున్నాయి. అయితే జీఎస్టీ మార్పుతో కొన్నికార్ల ధరలు పెరుగుతాయని, ఇప్పుడే కొనుక్కోండి అని కొందరు డీలర్లు గందరగోళానికి గురిచేస్తున్నారని, దీనిపై జాగ్రత్తగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

కొన్ని నెలలుగా మందకొడిగా విక్రయాలు..

రాష్ట్రంలో గత ఏడాదితో పోలిస్తే ఈసారి కార్ల కొనుగోళ్లు తగ్గాయి. తాజాగా కార్లపై జీఎస్టీ 28శాతం నుంచి 18శాతానికి తగ్గుతుండటంతో కొనుగోళ్లు తిరిగి పుంజుకుంటాయనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి కుటుంబాలు కొనుగోలు చేసే చిన్న కార్లకు మార్కెట్‌లో గిరాకీ పెరగనుంది. మారుతి స్విఫ్ట్, వ్యాగన్ ఆర్, బాలెనో, టాటా పంచ్, టియాగో, ఆల్ట్రోజ్, రెనో క్విడ్, హ్యుందాయ్ ఐ10 తదితర వాహనాలపై సుమారు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు తగ్గుతాయని డీలర్లు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం జీఎస్టీ, అదనపు సెస్‌లు కలిపి 42-50% వరకు పన్ను విధించిన విలాసవంతమైన కార్ల 40% జీఎస్టీ వేయడం, సెస్‌లు ఎత్తివేస్తుండటంతో భారీ ప్రయోజనం ఉంటుందని డీలర్లు చెబుతున్నారు. హ్యుందాయ్ క్రెటా, మారుతీ గ్రాండ్ విటారా, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, టయోటా ఇన్నోవా, టాటా హారియర్ వంటి కార్ల కొనుగోలు దారులకు ప్రయోజనం ఉంటుందని పేర్కొంటున్నారు. వీరికి రూ.2 లక్షల నుంచి 4 లక్షల వరకు ప్రయోజనం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

జీఎస్టీతోపాటు ఇతర పన్నుల ఉపశమం

వాహనం మూల ధరపై జీఎస్టీని కలిపి ఎక్స్‌షోరూం ధరను నిర్ణయిస్తారు. ఈ ఎక్స్‌షోరూం ధరపైనే రవాణా శాఖ జీవితకాల పన్ను, రిజిస్ట్రేషన్, ఇతర చార్జీలను వసూలు చేస్తుంది. ప్రస్తుతం జీఎస్టీ తగ్గుతుండటంతో రవాణాశాఖ పన్నులు, చార్జీలు కూడా తగ్గుతాయి. బీమా సంస్థలు కూడా వాహనం ధర ఆధారంగా ప్రీమియం నిర్ణయిస్తాయి. ఈ లెక్కన బీమా ప్రీమియం కూడా తగ్గుతుంది. దీనితో మొత్తంగా వాహనం కోసం వినియోగదారులు చేసే ఖర్చు తగ్గనుంది.

మధ్య స్థాయి కార్ల ధరలు పెరగొచ్చు!

1200 సీసీ సామర్థ్యం, 4 మీటర్ల పొడవు లోపున్న కార్లపై జీఎస్టీని 18శాతానికి తగ్గించిన ప్రభుత్వం.. ఆపై సామర్థ్యం, పొడవు ఉన్న కార్లను 40శాతం పన్నురేటుకు మార్చింది. అయితే విలాసవంతమైన కార్లపై ఉన్న అదనపు సెస్‌ల కారణంగా వాటిపై ఇప్పటికే 42-50శాతం వరకు పన్నులు ఉన్నాయి. ఇప్పుడు సెస్‌లు తగ్గించడంతో ఈ కార్లపై భారం తగ్గుతుంది. అయితే నిర్ధారిత సీసీ సామర్థ్యం, పొడవు కన్నా ఎక్కువగా ఉండి.. సుమారు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల మధ్య ధర ఉన్న పలు కార్లపై ప్రస్తుతం 28శాతం జీఎస్టీ మాత్రమే ఉందని, సెస్‌లు లేవని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడవి 40శాతం పన్ను రేటులోకి మారడం వల్ల వాటి ధరలు పెరిగే అవకాశం ఉందని అంటున్నాయి. అయితే అవి ఏయే మోడళ్ల అన్నదానిపై పూర్తి స్పష్టత లేదు.

ఆఫర్లు చూపుతూ అమ్ముకునే యత్నంలో డీలర్లు

జీఎస్టీ తగ్గింపుతో ఇప్పటికే కార్లను బుక్ చేసుకున్న వారు కూడా డెలివరీ తీసుకోవడానికి ముందుకు రావడం లేదని డీలర్లు చెబుతున్నారు. ఈ నెల 22 తర్వాత పూర్తి సొమ్ము చెల్లించి, కొత్త జీఎస్టీ ప్రకారం తక్కువ ధరకు తీసుకోవాలని భావిస్తున్నారని అంటున్నారు. కొత్తగా కొనుగోలు చేసేందుకు ఎవరూ రావడం లేదని చెబుతున్నారు. ఈ క్రమంలో కొందరు డీలర్లు మధ్యస్థాయి, పెద్ద కార్లపై సెస్‌లు కొనసాగుతాయని, ధరలు పెరుగుతాయని.. ఇప్పుడే కారు కొనడం మంచిదని చెబుతున్నట్టు తెలిసింది. కానీ ప్రభుత్వం సెస్‌లను తొలగించనుందని రవాణాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు ద్విచక్ర వాహన కొనుగోలుదారులు కూడా వేచి చూసే ధోరణిలోనే ఉన్నారని.. రూ.10-25వేల వరకు కలిసి వస్తున్నప్పుడు హడావుడిగా కొనడం ఎందుకనే భావనలో ఉన్నారని చెబుతున్నారు.



బీమాపై భారం తగ్గేది కొంతే..!

అన్ని రకాల జీవిత, ఆరోగ్య బీమా పాలసీల ప్రీమియంపై పన్నును జీఎస్టీ పాలకమండలి పూర్తిగా ఎత్తేసింది. దీంతో పాలసీ ధరలు దిగిరానున్నాయి. పాలసీ కొనుగోలుదారులకు ఇది శుభవార్త అని, పాలసీ కొనుగోళ్ల దిశగా ప్రజలను ప్రోత్సహించినట్టు అవుతుందని బీమా సంస్థల వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, జీఎస్టీని రద్దు చేయడం వల్ల పాలసీ కొనుగోలుదారులకు పూర్తి ప్రయోజనం దక్కుతుందా? అంటే ప్రస్తుతానికి కాదు అనే సమాధానమే వస్తుంది. బీమా కంపెనీలు చేసే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) క్లెయిమ్‌లే ఇందుకు కారణమని బీమా పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. బీమా పాలసీ కొనుగోలుపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. అంటే ఏదైనా ఓ బీమా ప్రీమియం ధర రూ.10వేలు అయితే పాలసీ కొనుగోలుదారు 18 శాతం జీఎస్టీ కలుపుకొని రూ.11,800 చెల్లించాలి. పాలసీ కొనుగోలుదారు నుంచి జీఎస్టీ కింద వసూలు చేసిన సొమ్మును బీమా సంస్థలు ప్రభుత్వానికి చెల్లిస్తాయి. దానికంటే ముందు బీమా సంస్థ తాను అప్పటికే ప్రభుత్వానికి చెల్లించిన జీఎస్టీని లెక్కించి మిగిలిన మొత్తాన్ని మాత్రమే చెల్లిస్తుంది. దీనినే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) క్లెయిమ్ అంటారు. బీమా సంస్థలు సేవా రంగంలోకి వస్తాయి. కార్యాలయాల అద్దె, సాఫ్ట్‌వేర్ లైసెన్సులు, ప్రచారం, మార్కెటింగ్, ఆడిటింగ్ వంటి వాటికి జీఎస్టీని చెల్లిస్తాయి. ఈ మొత్తాన్ని ఐటీసీ కింద క్లెయిమ్ చేసుకుంటాయి. ఇప్పుడు పాలసీ కొనుగోళ్లపై జీఎస్టీని ఎత్తేయడంతో ఐటీసీ భారాన్ని బీమా సంస్థలు పాలసీ కొనుగోలుదారులపై వేసే అవకాశం ఉందనే అభిప్రాయాలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం, బీమా సంస్థల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

జీఎస్టీ భేటీలో హైడ్రామా!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమల్లోకి వచ్చిన ఎనిమిదేళ్ల తర్వాత భారీ సంస్కరణలు తీసుకొచ్చారు. అయితే, బుధవారం ఢిల్లీలో జరిగిన జీఎస్టీ మండలి సమావేశంలో హైడ్రామా చోటుచేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జీఎస్టీ మండలి భేటీ తర్వాత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల మీడియాతో మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని ఏకగ్రీవంగా తీసుకున్నట్లు చెప్పారు. కానీ, జీఎస్టీ తగ్గింపు వల్ల తమకు భారీగా నష్టం వాటిల్లుతుందని ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై బెంగాల్ కాస్త గట్టిగానే నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది. వాస్తవానికి బుధవారం రాత్రి 7 గంటలకే జీఎస్టీ మండలి భేటీ ముగియాల్సి ఉంది. కానీ, బెంగాల్, కేరళ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో.. రాత్రి 9.30 గంటల వరకు సమావేశం కొనసాగినట్లు తెలిసింది. వారి అభ్యంతరాలపై కేంద్ర మంత్రి నిర్మల స్పందిస్తూ.. జీఎస్టీ తగ్గింపు వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్ర ప్రభుత్వానికీ నష్టం వస్తుందని చెప్పినట్లు సమాచారం. సామాన్యులకు ఊరట కల్పించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని స్పష్టం చేసినట్లు తెలిసింది.

డబుల్ డోస్ అభివృద్ధి: మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ 2.ఓగా పేర్కొంటున్న సంస్కరణలు దేశాభివృద్ధికి డబుల్ డోస్‌గా నిలుస్తాయని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. భారత్‌లో నూతన శకానికి దోహదపడేలా ఈ సంస్కరణలు చేపట్టినట్లు తెలిపారు. గురువారం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలతో సమావేశంలో మాట్లాడిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీలో సంస్కరణల ద్వారా భారత ఆర్థికరంగానికి పంచరత్నాలను జమ చేశామన్నారు. జీఎస్టీలో పలు శ్లాబ్‌లను హేతుబద్ధీకరిస్తూ నిర్ణయించిన 5శాతం, 18 శాతం శ్లాబ్‌లు ఈ నెల 22న మహా నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

లబ్ధి వినియోగదారుడికి అందేనా?

- వ్యాపారులు కొర్రీలు పెడతారంటూ ప్రజల్లో అనుమానాలు
- సెప్టెంబరు 22 తర్వాత కొత్త జీఎస్టీ శ్లాబుల మేరకే బిల్లులు



హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రముఖ కంపెనీకి చెందిన సిమెంట్ బస్తా ధర రూ.250 ఉండగా 28 శాతం జీఎస్టీ కలుపుకొని రూ.320కు లభిస్తుంది. సిమెంట్‌పై జీఎస్టీని 18 శాతానికి తగ్గించడంతో సెప్టెంబరు 22న ఆ బస్తా రూ.295కే లభ్యం కావాలి. కానీ ఆ ధరకు అమ్ముతారా? దుకాణదారులు జీఎస్టీ మార్పులను కచ్చితంగా అమలు చేస్తారా? లేదా కంపెనీ ధర పెంచిందని, పాత సరుకని ఏదో ఓ కారణం చెప్పి మాయ చేస్తారా?.. ఒక్క సిమెంట్ విషయంలోనే కాదు జీఎస్టీ తగ్గిన అన్ని ఉత్పత్తుల విషయంలో సామాన్య ప్రజలకు ప్రస్తుతం ఈ సందేహాలు ఉన్నాయి. ఉత్పత్తి సంస్థలు జీఎస్టీ తగ్గింపు ఫలాలను కొనుగోలుదారులకు అందిస్తాయా? అనే చర్చ జరుగుతోంది. అయితే, జీఎస్టీ నిబంధనల ప్రకారం ఈనెల 22వ తేదీ తర్వాత వస్తువులను తగ్గిన పన్నుల ప్రకారమే విక్రయించాలని జీఎస్టీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. అయితే, జీఎస్టీ తగ్గింపు అమలు అనేది వినియోగదారులకు వస్తువులను విక్రయించే సంస్థల నైతికతపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. లాభాలే ధ్యేయంగా పనిచేసే సంస్థలు కొనుగోలుదారులకు ఫలాలు అందించవని, తాము కోల్పోయే ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను ఏదో విధంగా ఆర్జించేందుకు ఎత్తుగడలు వేస్తాయని అంటున్నారు. వ్యాపారులు ఎవరైనా తగ్గించిన పన్ను ప్రకారం అమ్మకాలు చేయకపోతే కొనుగోలుదారులు నేషనల్ యాంటీ ప్రాఫెటీరింగ్ అథారిటీకి ఫిర్యాదు చేయవచ్చని జీఎస్టీ అధికారులు వెల్లడించారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన కొత్తల్లోనే ఈ అథారిటీని అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసే సదుపాయం ఉందని, ఈ విధానాన్ని దేశమంతా అమలు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు.

ప్రజలకు ప్రయోజనాలు అందాల్సిందే

తగ్గిన పన్నుల మేర ఆ లాభాలను కొనుగోలుదారులకు అందించాల్సిందే. సామాన్య ప్రజలు నిత్యం ఉపయోగించే టూత్‌పేస్టు, బ్రష్, పౌడర్, సైకిళ్లు, వ్యవసాయ పరికరాలు, ఔషధాలను 5 శాతం పన్ను పరిధిలోకి తీసుకొచ్చారు. ప్రజారోగ్యం దృష్ట్యా కొన్ని రకాల ఔషధాలకు, ఆరోగ్య బీమా పాలసీలకు జీఎస్టీ లేకుండా చేశారు. ఈ ప్రయోజనాలు వినియోగదారులకు అందాలంటే ఉత్పత్తి సంస్థలు, విక్రయదారులు సహకరించాలి. జీఎస్టీ ప్రయోజనాలు అందించని విక్రయదారులపై ప్రజలు ఫిర్యాదులు చెయ్యాలి.

- జీఎస్టీ కమిషనర్, అప్పీల్స్, హైదరాబాద్

మోదీ బ్రహ్మాస్త్రం జీఎస్టీ !

- ప్రతిపక్షాలను ఆత్మరక్షణలోకి నెట్టిన నిర్ణయం
- బిహార్ సహా త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి
- రాజకీయ విశ్లేషకుల అంచనా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు ఊరటనిచ్చేలా జీఎస్టీ రేట్లను సవరిస్తూ జీఎస్టీ కౌన్సిల్ చేసిన ప్రకటన ప్రధాని మోదీ వేసిన బ్రహ్మాస్త్రమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. జీఎస్టీ తగ్గింపు వల్ల కేంద్రంతోపాటు రాష్ట్రాలపై అదనపు భారం పడుతున్నా.. కేంద్రం, ప్రధాని మోదీ రాజకీయంగా లబ్ధి పొందనున్నారని చెబుతున్నారు. దీపావళికి ముందే బిహార్ ఎన్నికల షెడ్యూల్ వెలువడనుండడంతో జీఎస్టీ రేట్ల తగ్గింపు నిర్ణయాన్ని ముందుగానే ప్రకటించారని, దీంతో ప్రతిపక్షాలన్నీ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడ్డాయంటున్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు వల్ల రాష్ట్రాల ఆదాయం తగ్గుతుందని, తమకు నష్టపరిహారం చెల్లించాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు తొలుత నిర్ణయించాయి. కానీ, జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రకటన తర్వాత వెనక్కు తగ్గాయి. తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సహా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నేతలు తొలుత విడుదల చేసిన పత్రికా ప్రకటనలను వెనక్కి తీసుకుని సవరించిన ప్రకటనలను విడుదల చేయడమే ఇందుకు నిదర్శనం. తెలంగాణ మంత్రి భట్టి విక్రమార్కతోపాటు తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నెరసు జీఎస్టీ తగ్గింపును స్వాగతించారు. ఇక, గత బడ్జెట్‌లో ఆదాయ పన్నును తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న తర్వాత జీఎస్టీ రేట్లపై కోత విధించడం కేంద్ర ప్రభుత్వం ప్రజలకిచ్చిన రెండో అతి పెద్ద బహుమతి అని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. రానున్న బిహార్, పశ్చిమ బెంగాల్, అస్సోం, కేరళ, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో జీఎస్టీ అంశం బీజేపీకి బాగా కలిసొస్తుందని అంచనా వేస్తున్నారు.

ఏసీలు, ఫ్రిజ్‌లు మరింత కూల్..

- 1.5 టన్ ఏసీపై రూ.4 వేల వరకు తగ్గింపు
- 43 అంగుళాల టీవీలపైఐ 2,500 వరకు..
- వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలు 1,500 నుంచి 5000 వరకు తగ్గే చాన్స్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పండుగ సమయంలో కొత్తగా గృహోపకరణాలు కొనుగోలు చేయాలనుకునేవారికి జీఎస్టీ పన్నుల మార్పు బంపర్ ఆఫర్‌గా మారింది. టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషీన్లు, డిష్ వాషర్లపై పన్ను 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గుతుండటం లాభం చేకూర్చనుంది. ఉదాహరణకు 43 అంగుళాల ఎల్ఈడీ టీవీలపై సుమారు రూ.2,500 నుంచి రూ.4 వరకు, అంతకన్నా పెద్ద టీవీలపై రూ.8 వేల వరకు ప్రయోజనం కలగనుంది. 1.5 టన్నుల సామర్థ్యమున్న ఏసీల ధర సుమారు రూ.5 వేల వరకు తగ్గే వీలుంది. వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల ధరలూ రూ.1,500 నుంచి రూ.7 వేల వరకు దిగిరానున్నాయి. ఐదు దశాబ్దాలకు పైనే తాము ఈ వ్యాపారంలో ఉన్నామని, ఎప్పుడూ పన్ను తగ్గింపు రూపంలో ఇంత ప్రయోజనం కలగలేదని హైదరాబాద్‌లో ప్రముఖ ఏసీ కంపెనీలకు డీలర్‌గా వ్యవహరించే సాయిరాం ఎయిర్ కండీషనింగ్ కంపెనీ అధినేత ప్రతీక్ పేర్కొన్నారు.

ఇప్పటికే కొనుగోళ్లు బంద్..

జీఎస్టీ తగ్గింపు ఉంటుందన్న వార్తల నేపథ్యంలో కొన్నిరోజులుగా ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు బాగా తగ్గిపోయాయని డీలర్లు, షోరూమ్‌ల మేనేజర్లు చెబుతున్నారు. ముఖ్యంగా జీఎస్టీ తగ్గింపు ప్రకటన తర్వాత ఒక్కసారిగా నిలిచిపోయాయని అంటున్నారు. ఇటీవల ఆర్డర్లు ఇచ్చిన వారు కూడా డెలివరీ తీసుకోకుండా రద్దు చేసుకుంటున్నారని చెబుతున్నారు. పండుగ విక్రయాల కోసం తాము పెద్ద ఎత్తున స్టాక్ సిద్ధం చేసుకున్నామని.. మరి వాటిపై చెల్లించిన పన్ను విషయంలో ప్రభుత్వం నుంచి ఊరట కలిగించే నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నామని అంటున్నారు. "సెప్టెంబరు 22 తర్వాత కొనుగోలు చేసే ప్రతి ఎలక్ట్రానిక్ వస్తువుకు తగ్గిన శ్లాబుల మేరకు బిల్ చేయాల్సి ఉంటుంది. వినియోగదారులకు ప్రయోజనం అందుతుంది. వ్యాపారుల విషయంలో ప్రభుత్వం, కంపెనీలు తగిన నిర్ణయం తీసుకుంటాయని ఆశిస్తున్నాం" అని ప్రముఖ బ్రాండ్ షోరూం మేనేజర్ పేర్కొన్నారు.





పాప్‌కార్న్ ఓకే.. 'కారమెల్'కు ఎఫెక్ట్

పాప్‌కార్న్‌పై ఇటీవలి వరకు ఉన్న విమర్శలకు తాజాగా చెక్ పడింది. ఇంతకుముందు పాప్‌కార్న్ విడిగా అమ్మితే 5%, ప్యాక్ చేస్తే 12%, కారమెల్ (తీపి) ఫ్లేవర్ కలిపితే 18% పన్ను ఉండేది. ఇకపై విడిగా, ప్యాక్ చేసినా 5శాతమే పన్ను ఉంటుంది. కారమెల్‌పై మాత్రం 18% పన్ను కొనసాగుతుంది.



ఫిట్‌నెస్‌కు, అందానికి ఖర్చు తగ్గినట్టే!

జిమ్‌లు, యోగా కేంద్రాలు, హెల్త్ క్లబ్‌లు, ఫిట్‌నెస్ సెంటర్లు, సెలూన్లు, బార్బర్ల తదితర సేవలపై ఇప్పటివరకు 18శాతం పన్ను ఉండగా.. ఇప్పుడు 5శాతానికి తగ్గించారు. దీనితో ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం, అందం కోసం చేసే ఖర్చు కాస్త తగ్గనుంది.



ఫుడ్ డెలివరీ మరికొంత భారం!

స్విగ్గీ, జొమాటో వంటి ఫుడ్ డెలివరీతోపాటు బ్లింక్ ఇట్, స్విగ్గీ ఇన్‌స్టా వంటి గ్రోసరీ డెలివరీ సేవలపై కొత్తగా 18% జీఎస్టీ విధించారు. డెలివరీ చార్జీలపై ఈ పన్ను వర్తిస్తుంది. ప్రస్తుతం ఒక్కో జొమాటో ఆర్డర్‌పై రూ.2, స్విగ్గీ ఆర్డర్‌పై రూ.2.6, ఇన్‌స్టామార్ట్ ఆర్డర్‌పై రూ.1 వరకు భారం పడుతుంది.



రూ.100లోపు సినిమా టికెట్లపై తగ్గిన పన్ను

సినిమా థియేటర్లలో రూ.100 లోపు ధర ఉండే టికెట్లపై పన్నును 12% నుంచి 5%కు తగ్గించారు. అంటే సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా చిన్న నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లోని థియేటర్లలో టికెట్ రేట్లకు ఉపశమనం ఎక్కువగా ఉండనుంది.



ఐపీఎల్ టికెట్లపై పన్ను మోత

ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు, ఇతర గుర్తింపు లేని క్రీడా కార్యక్రమాల టికెట్లపై జీఎస్టీని 28% నుంచి 40 శాతం ప్రత్యేక పన్నురేటులోకి మార్చారు. దీనితో వాటి టికెట్ల ధరలు బాగా పెరుగుతాయి. ఉదాహరణకు రూ.1000 ఐపీఎల్ టికెట్‌పై పన్ను కలిపి రూ.1,400 అవుతుంది. ప్రత్యేకంగా గుర్తించిన క్రీడా కార్యక్రమాలకు 18% జీఎస్టీ కొనసాగనుంది.



రాష్ట్రపతి బీఎండబ్ల్యూ కారుకు జీఎస్టీ మినహాయింపు

కేంద్రం రాష్ట్రపతి కోసం కొనుగోలు చేస్తున్న బీఎండబ్ల్యూ 7 సిరీస్ కారుకు జీఎస్టీ మినహాయింపు ఇచ్చారు. దీని విలువ సుమారు రూ.3.66 కోట్లు. అత్యాధునిక భద్రత సదుపాయాలు ఉన్న ఈ కారును రాష్ట్రపతి భద్రత కోసం కొనుగోలు చేస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు జీఎస్టీ కౌన్సిల్ పేర్కొంది. రాష్ట్రపతి ప్రస్తుతం మెర్సిడెస్ బెంజ్ ఎస్600 పుల్‌మన్ లిమోజిన్ వాడుతున్నారు.



బీడీలు చవక.. సిగరెట్లపై మోత!

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులను 40 శాతం ప్రత్యేక పన్ను రేటులోకి చేర్చిన జీఎస్టీ కౌన్సిల్.. బీడీలను మాత్రం 28శాతం నుంచి 18శాతం పన్నురేటుకు మార్చింది. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల ధరలు పెరగనున్నాయి. బీడీల ధరలు మాత్రం తగ్గే అవకాశం ఉంది. మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో లక్షలాది మంది బీడీల తయారీపై ఆధారపడి ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఒక ఐఏఎస్ దుర్మార్గం!

(మొదటి పేజీ తరువాయి)

అధిపతిగా వ్యవహరించారు. అప్పట్లో జగన్ చెప్పినట్టల్లా చేశారు. దీంతో ఆ అధికారికీ తేరగా, భారీగా డబ్బులు వచ్చి పడ్డాయి. డబ్బుతోపాటు కొన్ని అవలక్షణాలూ వంటబట్టాయి. దీంతో... ఐదు పదుల వయసు దాటిన ఆ ఐఏఎస్ అధికారి పక్కదారి పట్టారు. సొంత కుటుంబాన్ని నిర్లక్ష్యం చేస్తూ... హైదరాబాద్‌లో మరో మహిళతో సన్నిహితంగా మెలగడం మొదలుపెట్టారు. వీలైనంత ఎక్కువగా హైదరాబాద్‌లోనే మకాం! కొద్దికాలం ఇదంతా బాగానే నడిచింది. అయితే... ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారు. అది కొంత తీవ్రమైన సమస్యే అయినప్పటికీ... ఖరీదైన చికిత్స చేయించుకోవడంతో కోలుకున్నారు. అయితే... తనకు ఆరోగ్యం బాగలేని సమయంలో ఆ మహిళ తనను కాదని, మరొకరితో సన్నిహితంగా ఉంటోందని ఆయనకు అనుమానం వచ్చింది. ఒక్కసారి అనుమానం వచ్చిన తర్వాత ఆగదు కదా! అది గొడవలకు దారి తీసింది. గత శుక్రవారం ఈ సీనియర్ ఐఏఎస్‌కు, ఆ మహిళకు మధ్య మాటామాటా పెరిగింది. ఘర్షణ స్థాయికి చేరింది. కోపం ఆపుకోలేని ఆ అధికారి... శక్తినంతా కూడగట్టుకుని ఆ మహిళను బలంగా కొట్టారు. తల గోడకు తగలడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. దీంతో సదరు ఐఏఎస్‌లో వణుకు మొదలైంది. సమీపంలోనే ఉన్న ఓ పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే...ఆమె మరణించింది.ఆమె మృతికి అసలు కారణం చెప్పకుండా... 'ప్రమాదవశాత్తూ కిందపడటం వల్ల తగిలిన గాయం' (ఫాలెన్ డౌన్) అని ఆస్పత్రి రికార్డుల్లో రాయించారు. తన పలుకుబడి మొత్తంగా ఉపయోగించి... అసలు విషయం బయటికి రాకుండా, పోలీసుల దాకా వెళ్లకుండా చూసుకున్నారు. అక్కడేమీ జరగనట్లుగా విజయవాడ వచ్చేసి... తన పని తాను చేసుకుంటున్నారు. కానీ... ఆయన వ్యవహారాలు కొందరు ఐఏఎస్‌లకు ఇప్పటికే తెలుసు. నిజం దాచినంత మాత్రాన దాగదు కదా! హైదరాబాద్‌లో జరిగిన దారుణం గురించి ఆయన సన్నిహితులు కొందరికి తెలిసిపోయిందని సమాచారం!

ఢిల్లీలో మంత్రి లోకేశ్.. నేడు ప్రధాని మోదీతో భేటీ

అమరావతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమవుతారు. ఈ ఏడాది 'అంతర్జాతీయ యోగా దినోత్సవం' ప్రధాన కార్యక్రమం విశాఖపట్నంలో జరిగిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమ నిర్వహణ ప్రణాళికతోపాటు, యోగాకు అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాచుర్యం కల్పించడంపై సిద్ధం చేసిన నివేదిక (టేబుల్ బుక్)ను ప్రధానికి లోకేశ్ అందిస్తారు. కాగా, పుస్తకాలు, మ్యాప్‌లు, చార్టులు, పెన్సిళ్లు తదితరాలపై జీఎస్టీ తగ్గింపును స్వాగతిస్తున్నానని లోకేశ్ తెలిపారు.

175 మందికి ఉత్తమ టీచర్ అవార్డులు

ప్రభుత్వం 175 మందిని రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా గుర్తించింది. పాఠశాల విద్యాశాఖలో 78 మంది ఉపాధ్యాయులు, ఇంటర్మీడియట్‌లో 26 మంది జూనియర్ లెక్చరర్లు, ఉన్నత విద్యలో 56 మంది ప్రొఫెసర్లు, డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ కాలేజీల్లో 15 మంది లెక్చరర్లను ఉత్తమ టీచర్లుగా గుర్తించినట్లు వెల్లడిస్తూ గురువారం వేర్వేరు ఉత్తర్వులు జారీచేసింది. వారందరికీ శుక్రవారం సీఎం చంద్రబాబు అవార్డులు ప్రదానం చేస్తారు.

వెయ్యి మందికి అప్రెంటీస్ అవకాశాలు

నైపుణ్యాభివృద్ధి సంస్థ, విజన్ ఇండియా సర్వీసెస్, టాటా ఎలక్ట్రానిక్స్ భాగస్వామ్యంతో వెయ్యి మంది యువతకు అప్రెంటీస్, మరో 300 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ జి.గణేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఏపీ నైపుణ్యం వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9988853335 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్ రాజీనామా

ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్-2 ప్రొఫెసర్ పి.ఉమామహేశ్వరి దేవి తన పదవికి రాజీనామా చేశారు. కొద్దిరోజుల కిందట ఆమె రాజీనామా లేఖను ప్రభుత్వానికి పంపగా.. దాన్ని ఆమోదిస్తూ ఉన్నత విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. దాదాపు తొమ్మిది నెలల పదవీకాలం ఉండగానే ఆమె రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఆగిపోయిన పింఛన్లు రేపు పంపిణీ

సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన దాదాపు 9,000 మంది పింఛన్లు శనివారం పంపిణీ అవుతాయని ఆర్థిక శాఖ తెలిపింది. కాకినాడ, విశాఖలోని సీతమ్మధార, విజయవాడ, సీఆర్‌డీఏ ప్రాంతంలో దాదాపు 9,000 మందికి పెన్షన్లు అందలేదు.

8న కరేడులో రైతుల సమావేశానికి గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఉలవపాడు/కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ ప్రాజెక్ట్ భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న రైతులు.. తమ సమస్యలపై చర్చిందుకునేందుకు సమావేశం జరుపుకోవచ్చని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 8న మధ్యాహ్నం 2 నుంచి 7 గంటల్లోగా ఈ సమావేశం జరుపుకునేందుకు హైకోర్టు అనుమతించింది. ప్రశాంత వాతావరణంలో సభ జరిగేలా చర్యలు చేపట్టాలని, అవసరమైతే సభా కార్యక్రమాన్ని వీడియో తీసుకోవచ్చని పోలీసులకు సూచించింది. అదేవిధంగా 14న బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ పర్యటనకు కూడా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

18 ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

కూటమి ప్రభుత్వం మరో విడత నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. 18 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్లను నియమించింది. వీరిలో బీసీలు 8 మంది, ఎస్సీలు ఇద్దరు, ఓసీలు ఎనిమిది మంది ఉన్నారు. పార్టీల వారీగా... టీడీపీకి 15, రెండు జనసేన, ఒకటి బీజేపీకి కేటాయించారు.

పిన్నెల్లి సోదరులకు సుప్రీంలో తాత్కాలిక ఊరట

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట రామిరెడ్డిలకు సుప్రీంకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఇద్దరు టీడీపీ నేతల హత్య కేసులో అన్నదమ్ములకు సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర రక్షణ కల్పించింది. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావు ఈ ఏడాది మే నెలలో దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఇద్దరూ హైకోర్టును ఆశ్రయించగా నిరాశే ఎదురైంది. హైకోర్టు తీర్పును ఆగస్టు 31న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై గురువారం జస్టిస్ విక్రమ్‌నాథ్, సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, తదుపరి విచారణను సెప్టెంబరు 28కి వాయిదా వేసింది.

సీడాప్ స్టేట్ మేనేజర్‌పై వేటు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీసీడాప్ స్టేట్ మిషన్ మేనేజర్ డీ లక్ష్మీదేవిపై ఆ సంస్థ వేటు వేసింది. ఆమెను ఉద్యోగం నుంచి తొలగిస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ఆమెను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఈ ఏడాది జూలైలోనే నిర్ణయం తీసుకున్నారు. అయితే ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించి, కొనసాగుతున్నారు. అక్టోబరుతో ఆమె కాంట్రాక్టు ముగుస్తున్నందున.. తొలగింపుపై మరోసారి ఆదేశాలు ఇచ్చారు.

దృష్టిలోపం ఉన్నా ఇంటర్‌లో సైన్స్ చదవొచ్చు

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దృష్టిలోపం ఉన్న విద్యార్థులు ఇకపై ఇంటర్మీడియట్‌లో సైన్స్ గ్రూపులు తీసుకుని చదవొచ్చు. సైన్స్ గ్రూపుల్లో ప్రాక్టికల్స్ చేయలేరు కాబట్టి వారికి ఇంతవరకూ ఆ అవకాశం ఇవ్వలేదు. జాతీయ విద్యాసంస్థలు, సీబీఎస్ఈలో దృష్టిలోపం ఉన్న వారినీ సైన్స్ గ్రూపుల్లో చేర్చుకుంటున్నారని, తమకూ అవకాశం కల్పించాలని అనేక మంది రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సమీక్ష నిర్వహించిన మంత్రి లోకేశ్ వారికీ అవకాశం కల్పించాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఇంటర్ విద్యాశాఖ ఈ విద్యా సంవత్సరం నుంచే వారిని సైన్స్ గ్రూపుల్లోకి అనుమతించింది.

వర్షాలు తగ్గుముఖం.. కోస్తాలో పెరిగిన ఎండ

విశాఖపట్నం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తీవ్ర అల్పపీడనం బుధవారం రాత్రి ఉత్తర ఒడిశాలో తీరం దాటింది. తర్వాత పశ్చిమ వాయవ్యంగా పయనించే క్రమంలో గురువారం బలహీనపడి ఉత్తర ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ పరిసరాల్లో కొనసాగుతోంది. అల్పపీడనం రాష్ట్రానికి దూరంగా ఉండడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయని పేర్కొంది. దక్షిణ కోస్తాలో పలుచోట్ల ఎండతీవ్రత కొనసాగింది. నెల్లూరులో 37.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

కర్నూలులో సందడిగా గణేశుడి శోభాయాత్ర

రూ. 6 లక్షలకు లడ్డూ వేలం పాడిన ఎంపీ శబరి



కర్నూలు నగరంలో గణనాథుడి విగ్రహాల శోభాయాత్ర గురువారం కనుల పండువగా సాగింది. ఈనగరంలో 2వేలకు పైగా విగ్రహాలు ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా స్వామివారి లడ్డూను రూ.6,01,000కు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వేలంపాటలో దక్కించుకున్నారు.

\- కర్నూలు కల్చరల్, ఆంధ్రజ్యోతి



ఫేక్‌లపై ఉక్కుపాదం

(మొదటి పేజీ తరువాయి)

సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత ఉపసంఘంలో సభ్యులుగా ఉంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రభుత్వంపైన, కూటమి నేతలపైన సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలపై లోతైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, కొత్త చట్టం రూపకల్పనపై ఉపసంఘం దృష్టి సారిస్తుందని సీఎం పేర్కొన్నారు. భావప్రకటన స్వేచ్ఛ ఉండొచ్చు కానీ అది శ్రుతి మించకూడదన్నారు. సామాజిక మాధ్యమాల్లో ఖాతాలు తెరిచేవారికి ఆధార్ అకౌంటబిలిటీ లాంటిది ఉండేలా చట్టం తీసుకురావాలని పలువురు మంత్రులు సూచించారు. దీనిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. సామాజికమాధ్యమాల కట్టడికి న్యూజిలాండ్‌లో బలమైన చట్టాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు కూడా ఇచ్చిందని, వీటన్నింటినీ సమగ్రంగా అధ్యయనం చేయాలని మనోహర్ సూచించారు.


తిప్పికొట్టకపోతే ప్రభుత్వానికి దెబ్బ: కుప్పానికి కృష్ణా జలాలు అందిస్తుంటే ఓర్వలేని వైసీపీ నాయకులు నీళ్లే రావడం లేదంటూ ఫేక్ పోస్టులతో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, యూరియాపైనా అలాంటి తప్పుడు ప్రచారాలే చేసి, రైతులను తప్పుదారి పట్టిస్తూ వారిని ఆందోళనకు గురి చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టలేకపోయారని సీఎం అభిప్రాయపడ్డారు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వానికి డ్యామేజి జరగకముందే మంత్రులు, ఎమ్మెల్యేలు స్పందించాల్సిన అవసరం ఉందని, వారే చొరవ తీసుకుని ఎక్కడైనా సమస్య ఉంటే పరిష్కరించాలని సూచించారు. సుగాలి ప్రీతి తల్లి ఆరోపణలపై సీఎం స్పందిస్తూ... సుగాలి ప్రీతి కుటుంబం విషయంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ స్పందిస్తూ.. సుగాలి ప్రీతి కుటుంబానికి అండగా నిలిచినందుకు చివరికి రాజకీయంగా తననే లక్ష్యంగా చేసుకుంటున్నారని, స్వార్థరాజకీయాల కోసం చేసే విషప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ ఈ రోజే లేఖ పంపాలని సీఎస్‌ను సీఎం ఆదేశించారు.

● డీఆర్సీ సమావేశాల నిర్వహణపై ఇన్‌చార్జి మంత్రులకు, కలెక్టర్లకు మధ్య సమన్వయం ఉండాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రం లో ఎక్కడైనా పరిశ్రమల ఏర్పాటుకు భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకొస్తే, వారిని ప్రోత్సహించాలని, భూసమీకరణ కింద భూములు తీసుకుని, రైతులను పరిశ్రమల్లో భాగస్వాములను చేసే విషయాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఇకపై అనధికార కట్టడాలపై కఠినంగా వ్యవహరించాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి శాటిలైట్ ఇమేజ్‌లను తీసుకుని ఎక్కడ అనధికార కట్టడాలు ఉన్నాయో గుర్తించి వెంటనే తొలగించాలని.. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణపై చర్చ సందర్భంగా సీఎం కోరారు.

కేంద్ర ప్రభుత్వానికి అభినందనలు

జీఎస్టీ సంస్కరణలు తీసుకొచ్చిన కేంద్రానికి అభినందలు తెలుపుతూ కేబినెట్ తీర్మానం చేసింది. ఈ సంస్కరణలు దేశ ఆర్థికవ్యవస్థను వేగంగా ముందుకు వెళ్లేలా చేస్తాయని, భారత్ త్వరలోనే ప్రపంచంలో తొలి 3 స్థానాల్లో ఉంటుందని సీఎం వ్యాఖ్యానించారు.

> 'ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం ఉండాలి. ప్రభుత్వంపై కానీ.. పాలకులపై కానీ విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండాలి. అలాకాకుండా ప్రభుత్వంపై ద్వేషంతో విమర్శలు చేస్తే వాటిని ఎట్టి పరిసితుల్లోను ఉపేక్షించకూడదు. అలా తప్పుడు ప్రచారాలు.. తప్పుడు పోస్టులు పెట్టే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలి."
>
> \- ముఖ్యమంత్రి చంద్రబాబు



కలిసి గట్టిగా తిప్పికొట్టాలి..

కూటమిపై ఎలాంటి విమర్శలు వచ్చినా అందరు కలిసి గట్టిగా తిప్పికొట్టాలని సీఎం సూచించారు. ప్రధాని మోదీ తల్లిపై కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ విమర్శలను సకాలంలో తిప్పికొట్టాల్సి ఉందని, కానీ అలా చేయలేకపోయామని సీఎం అభిప్రాయపడ్డారు. సుగాలి ప్రీతి తల్లి పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేసినప్పుడు కూడా అందరం స్పందిస్తే బాగుండేదని అన్నారు. 'అందరం కలిసి మళ్లీ ఎన్నికలకు వెళ్లాలి అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. మనందరం ఎన్డీయే భాగస్వాములమనే విషయాన్ని విస్మరించొద్దు.' అని మంత్రివర్గ సహచరులకు చంద్రబాబు సూచించారు.

కార్యకర్తల కోసం ప్రత్యేక గ్రీవెన్స్

» మంత్రులతో లోకేశ్ అల్పాహార భేటీ

మంత్రివర్గ సమావేశానికి ముందు మంత్రులతో నారా లోకేశ్ అల్పాహార భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా డీఎస్సీ అంశం చర్చకు వచ్చింది. ఎన్ని ఇబ్బందులు సృష్టించినా రికార్డు స్థాయిలో 16వేల పైచిలుకు పోస్టులు విజయవంతంగా భర్తీ చేశామని, జగన్ ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని మంత్రులు వ్యాఖ్యానించారు. డీఎస్సీ అభ్యర్థులందరితో ఒక అభినందన సభ నిర్వహిస్తే బాగుంటుందని పలువురు మంత్రులు సూచించారు. ఇన్‌చార్జి మంత్రులు తమ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లో కార్యకర్తలను కలవాలని లోకేశ్ సూచించారు. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ సమావేశాలు నిర్వహించాలని, కార్యకర్తల నుంచి నియోజకవర్గ పరిస్థితులపై ఇన్‌చార్జి మంత్రులు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సూచించారు. యూరియా విషయంలో రైతుల ముసుగులో వైసీపీ చేసే కుతంత్రాలను దీటుగా తిప్పికొట్టాలన్నారు. కాగా, మంత్రివర్గ సమావేశానికి ముందు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా పలకరించారు. కూటమి తరఫున ఈనెల 10న అనంతపురంలో నిర్వహిస్తున్న సూపర్ సిక్స్.. సూపర్ హిట్ బహిరంగ సభ నిర్వహణపై ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. శుక్రవారం ఢిల్లీలో ప్రధానిని కలుస్తున్న నేపథ్యంలో ఆ వివరాలను పవన్‌తో లోకేశ్ పంచుకున్నారు. మంత్రివర్గ సమావేశం అనంతరం చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు.

ఇకపై గిరిజనులకూ పెద్ద సిలిండర్లు.. దీపం-2 కింద అదనపు లబ్ధి

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజనులకు లబ్ధి చేకూర్చేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రస్తుతం 5 కిలోల గ్యాస్ కనెక్షన్లు (చిన్న సిలిండర్లు) ఉన్న కుటుంబాలకు ఇక నుంచి 14.2 కిలోల ఎల్పీజీ కనెక్షన్లు అందించనుంది. 'దీపం-2' పథకం కింద అర్హులైన గిరిజనులందరికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేసేందుకు పౌరసరఫరాలశాఖ చేసిన ప్రతిపాదనకు గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో 16 జిల్లాల్లోని 23,912 గిరిజన కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, ప్రభుత్వంపై ఏడాదికి రూ.5.5 కోట్ల అదనపు భారం పడుతుందని మంత్రి మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలో 10 కొత్త వైద్య కళాశాలలు

» పీపీపీ పద్ధతిలో ఏర్పాటు

» అపోలో టైర్స్ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం

» మడకశిరలో 1,197 కోట్లతో హెచ్ఎఫ్‌సీఎల్

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించేలా మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయుష్మాన్ భారత్-ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద తీసుకొచ్చిన యూనివర్సల్ హెల్త్ పాలసీకి క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. హైబ్రిడ్ విధానంలో అమలు చేసే యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25 లక్షల వరకూ ఉచిత చికిత్సలు అందనున్నాయి. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు దీనిద్వారా ప్రయోజనం పొందనున్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 1.63 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించేలా నూతన విధానాన్ని తీసుకొచ్చారు. క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి సచివాలయంలో మీడియాకు వివరించారు.

10 కొత్త వైద్య కళాశాలలకు ఆమోదం

పీపీపీ విధానంలో ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురంలో కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటుచేయనున్నారు.

క్యాబినెట్‌లో ఇతర నిర్ణయాలు



- 2025 జనవరి 1 నుంచి రాజధానిలో భూమి కేటాయించిన విద్య, ఆరోగ్య సంరక్షణ సంస్థలకు అమ్మకం,లీజు ఒప్పందాలు అమలు చేసేటప్పుడు రీయింబర్స్‌మెంట్ ప్రాతిపదికన స్టాంప్ డ్యూటీ చెల్లింపు నుంచి మినహాయింపు.
- రాష్ట్రంలో క్యాపిటల్ సిటీ ప్రాంతం మినహా అర్బన్ లోకల్ బాడీ సంస్థలు, ఉడాలు, సీఆర్‌డీఏ పరిధిలో అనధికారికంగా నిర్మించే భవనాలు, మంజూరైన ప్లాన్లను ఉల్లంఘించి, నిర్మించిన భవనాల నియంత్రణ, జరిమానాల విధింపు.
- మదర్ డెయిరీ ఫ్రూట్, వెజిటబుల్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌ల పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ సిఫారసులకు సమ్మతి.
- ప్రాజెక్టుల ప్రారంభంలో వేగం కోసం ఎస్ఐపీబీ సిఫారులకు ఆమోదం.
- అనంతపురంలోనిమడకశిరలో 1,197కోట్లతో హెచ్ఎఫ్‌సీఎల్ పెట్టే పెట్టుబడి ప్రతిపాదనకు సమ్మతి
- భోగాపురం ఎయిర్‌పోర్టులో ఫోర్‌స్టార్ అభివృద్ధికి ప్రోత్సాహకాలు.
- క్లీన్ రెన్యూవబుల్ ఎనర్జీ సంస్థ సోలార్ ప్రాజెక్టును నంద్యాలజిల్లా కోటపాడు నుంచి అవుకు గ్రామానికి మార్పు.
- కడపజిల్లా జమ్ములమడుగు, ముద్దనూరు మండలాల్లోని గ్రామాల్లో 100 మెగావాట్ల విండ్ కెపాసిటీ, కడప జిల్లా మైలవరం మండల గ్రామాల్లో 60 మెగావాట్ల సోలార్ విండ్ హైబ్రీడ్ పవర్ ప్రాజెక్టులకు సంబంధించి హెక్సా ఎనర్జీ బీహెచ్ ఫైవ్ చేసిన అభ్యర్థనలకు ఆమోదం.
- బ్రైట్ ఫ్యూచర్ పవర్‌కు అనంతపురం జిల్లా రాయదుర్గం, బ్రహ్మసముద్రం, గుమ్మగట్ట, కానేకల్ మండల గ్రామాల్లో 349.80 మెగావాట్ల విండ్ పవర్ కెపాసిటీ కేటాయింపు సంబంధించి, అనంతపురం జిల్లాలో కుడైర్, ఉరవకొండ, వజ్రకరూర్ మండల గ్రామాల్లో సెరెంటికా రెన్యూవబుల్స్ ఇండియా24 ప్రైవేట్‌లిమిటెడ్‌కు 250 మెగావాట్ల విండ్ ప్రాజెక్ట్ కేటాయింపులకు, కర్నూలు జిల్లా తుగ్గిలి, పత్తికొండ, దేవనకొండ, పండికోన, ఆస్పరీ మండలాల్లో సెరెంటికా రెన్యూవబుల్ ఇండియా 25 ప్రైవేట్ లిమిటెడ్‌కు 300 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్ట్ కేటాయింపుల ప్రతిపాదనకు ఆమోదం.
- కడప జిల్లా కొప్పోలులోని పంప్ స్టోరేజీ పవర్ ప్రాజెక్ట్ సామర్థ్యాన్ని 360 మెగావాట్ల నుంచి 2,400 మెగావాట్లకు పెంపు.
- మంగళగిరి గోల్డ్ క్లస్టర్ ల్యాండ్ పూలింగ్ స్కీమ్ రూల్స్ 2025కు ఆమోదం.
- థర్డ్ పార్టీ ఆక్రమణలో ఉన్న వ్యక్తులకు (347 మందికి) అదనపు భూముల క్రమబద్ధీకరణ/కేటాయింపుల కోసం రెవెన్యూశాఖ ప్రతిపాదనకు ఆమోదం.

'అంబటీ'... ఇదేంటి?!

» మాజీ మంత్రిపై భారీ అవినీతి ఆరోపణలు

(గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో అంబటి రాంబాబు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా సాగింది. అందివచ్చిన ఏ ఒక్క అవకాశాన్ని కూడా వదిలిపెట్టకుండా భారీ ఎత్తున అక్రమార్జనకు తెగబడ్డారు. రియల్ ఎస్టేట్ నుంచి ఉద్యోగుల బదిలీల వరకూ... కోడి పందేల నుంచి పేకాట శిబిరాల వరకూ ప్రతిదాంట్లోనూ వసూళ్ల పర్వం నడిపించారు. చివరకు సొంత పార్టీ నేతలు కూడా తనకు కప్పం కట్టాలన్న నిబంధన విధించారు. ముగ్గురాయి వ్యాపారుల ముక్కుపిండి మరీ రూ.కోట్లు వసూలు చేశారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు వేయాలన్నా, చెరువులో మట్టి తవ్వ కోవాలన్నా ముందు ఆయన దర్శనం చేసుకొని, ముడుపులు సమర్పించుకోవాల్సిందే. ఇక జగనన్న కాలనీల కోసం ఎకరం రూ.10 లక్షలకు కొనుగోలు చేసి.. అదే భూమిని ప్రభుత్వానికి ఎకరం రూ.30 లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. ఆయన వేధింపులు, బెదిరింపులకు తాళలేక సొంత పార్టీ నాయకుడొకరు హైకోర్టును ఆశ్రయించారు. వైసీపీ ప్రభుత్వం ఉండగానే అంబటి అవినీతి బాగోతంపై అనేక ఫిర్యాదులొచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి ఇబ్బడిముబ్బడిగా ఫిర్యాదులు రావడంతో కదలిక ప్రారంభమైంది. మాజీ మంత్రి అవినీతి వ్యవహారం తేల్చాలని ప్రభుత్వం ఆదేశించడంతో విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగినట్లు సమాచారం.

ఇవీ ఆరోపణలు...

- సత్తెనపల్లి నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో భారీ అవినీతి జరిగింది. తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి విక్రయించారు. ఈ వ్యవహారం అంతా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చక్కబెట్టారు. రియల్ ఎస్టేట్ వెంచర్లలో ల్యాండ్ కన్వర్షన్‌కు ఎకరానికి రూ.5 లక్షలు, అనుమతి లేకుండా ప్లాట్లు అమ్ముకోవడానికి ఎకరాకు రూ.10 లక్షలు వసూలు చేశారు.
- మంగళగిరికి చెందిన రియల్ వ్యాపారి స్థానిక వైసీపీ నేతతో కలిసి ఐదు ఎకరాల్లో ప్లాట్లు వేశారు. అయితే ముందుగా మంత్రిని కలవకపోవడంతో ప్లాట్లకు వేసిన సరిహద్దు రాళ్లు తొలగించాలని మునిసిపల్ అధికారులకు పురమాయించారు. దీంతో సొంతపార్టీ నేత కూడా ఎకరాకు రూ.7లక్షల లెక్కన కప్పం కట్టారు.
- అంబటి ప్రధాన అనుచరుడు వందల కోట్లు విలువ చేసే రేషన్ బియ్యాన్ని కాకినాడ పోర్టుకు తరలించారు. ఈ వ్యవహారంలో ఆయనకు ఏటా రూ.కోట్లల్లో ముడుపులు అందాయి. కోడి పందేలు,పేకాట శిబిరాలు కూడా ఆయన కనుసన్నల్లోనే నడిచాయి. జగనన్న కాలనీల్లో మట్టి తోలకంలో మంత్రి వాటా 10 శాతం పైమాటే.
- సత్తెనపల్లిలో ఏర్పాటుచేసిన నాలుగు బార్,రెస్టారెంట్లలో వ్యాపారులు సిండికేట్‌గా మారి వ్యాపారం చేసినందుకు లాభాల్లో మంత్రికి 33శాతం వాటా అందింది. ముగ్గురాయి అక్రమ తవ్వకాల ద్వారా ఐదేళ్లలో సుమారు రూ.10 కోట్ల వరకూ స్వాహా చేశారు.
- పోలీసుల బదిలీ కోసం గుంటూరులో ప్రత్యేకంగా ఒక వ్యక్తిని ఏర్పాటు చేసి భారీగా వసూళ్లకు పాల్పడ్డారు.
- అంబటి అల్లుడి కనుసన్నల్లో జరిగిన మట్టి తవ్వకాల్లో రూ.కోట్లు చేతులు మారాయి. నియోజకవర్గంలోని రెండు మండలాల్లో భారీగా గ్రావెల్ తవ్వి సొమ్ము చేసుకున్నారు.

ఆరోగ్యమస్తు!

(మొదటి పేజీ తరువాయి)

ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌లో రిజిస్టర్ అయిన 2,493 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ఉచిత వైద్యసేవలు పొందే అవకాశం ఉంటుంది. దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్), దారిద్ర్య రేఖకు ఎగువన (ఏపీఎల్) ఉన్నవారు, ఉద్యోగులు, జర్నలిస్టులతో పాటు అన్ని వర్గాల ప్రజలకూ 3,257 రకాల చికిత్సలు ఉచితంగా అందుతాయి. ప్రస్తుతం రాష్ట్రంలో 1.63 కోట్ల కుటుంబాలు వారు ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ ద్వారా వైద్యం పొందుతున్నారు. వీరు కాకుండా ఉద్యోగులు, పెన్షనర్లు, ఏపీఎల్ ప్రజలు కలిసి 8.60 లక్షల కుటుంబాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఆరోగ్యబీమా లేకుండా ఉండకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రజలందరికీ ప్రభుత్వమే బీమా సదుపాయం కల్పించనుంది.

ఆర్థిక భారమే అయినా..

రాష్ట్రంలో ఉన్న 1.63 కోట్ల కుటుంబాలకు రూ.25 లక్షల బీమాను కచ్చితంగా అమలు చేయాలన్న నిర్ణయంతో ప్రభుత్వంపై చాలా ఆర్థిక భారం పడుతుంది. దీనికోసం దాదాపు రూ.10 వేల కోట్ల నుంచి రూ.12వేల కోట్ల వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే ఎలాంటి భారం లేకుండా ప్రజలందరికీ రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించడమే హైబ్రిడ్ విధానం లక్ష్యం. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా వైద్యం పొందేవారిలో 95 శాతం మందికి రూ.2.50 లక్షలలోపే ఖర్చవుతోంది. మిగిలిన 5 శాతంలో 3 శాతం మందికి రూ.5 లక్షల లోపు, 2 శాతం మందికి రూ.15 లక్షల లోపు మాత్రమే ఖర్చవుతోంది. ఈ గణాంకాల ఆధారంగా ఆరోగ్యశాఖ అధికారులు కొన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రాష్ట్రంలో 95 శాతం మందికి వైద్య ఖర్చు రూ.2.50 లక్షల్లోపే అవుతోంది కాబట్టి 1.63 కోట్ల కుటుంబాలకయ్యే రూ.2.50 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు ప్రీమియం చెల్లిస్తుంది. రూ.2.50 లక్షలు దాటిన తర్వాత నుంచి రూ.25 లక్షల వరకూ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా ఉచిత వైద్యం అందిస్తుంది. దీనికోసం ప్రతి కుటుంబానికీ ఇన్సూరెన్స్ కార్డు ఇవ్వాలని నిర్ణయించింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ఎన్టీఆర్ వైద్య కార్డును కూడా అందిస్తుంది. మరోవైపు 5.14 లక్షల మంది ఉద్యోగులు, 2.99 లక్షల మంది పెన్షనర్లు కూడా హెల్త్ పాలసీ పరిధిలోకి వచ్చేస్తారు. ప్రభుత్వం వీరికి కూడా బీమా కార్డులందిస్తుంది. అలాగే ఏపీఎల్ కుటుంబాల ప్రజలు కూడా దీని పరిధిలోకి వచ్చేస్తారు. వారికి కూడా 2.50 లక్షల వరకే బీమా సంస్థ భరిస్తుంది. మిగిలిన రూ.22.50 లక్షలకు ఎవరు భరోసా కల్పిస్తారన్న దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ఆస్పత్రులకు కష్టమే...

యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ప్రజలకు మంచి జరుగుతుంది. కానీ దీనివల్ల రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. రాష్ట్రంలోని ప్రజలంతా ఇన్సూరెన్స్ కిందకి వచ్చేస్తే ఆస్పత్రులకు నేరుగా బిల్లులు చెల్లించే వారే ఉండరు. ఇటు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్, ఇన్సూరెన్స్ కంపెనీలు వెంటవెంటనే నిధులు విడుదల చేయకపోతే నష్టపోయేది ఆస్పత్రుల యాజమాన్యమే. దీన్ని దృష్టిలో ఉంచుకుని మార్గదర్శకాలు సిద్ధం చేయాలన్న సూచనలు వినిపిస్తున్నాయి.



విద్యార్థుల కోసం కాలిబాట వంతెన

భారీ వర్షం పడినా, కాలువకు నీరు ఎక్కువగా వచ్చినా ఆ పాఠశాలకు వెళ్లడానికి దారి ఉండేది కాదు. రామాలయంలో తరగతులు నిర్వహించేవారు. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కాలేదు. కొంతకాలం క్రితం కాలువ దాటుతూ ప్రధానోపాధ్యాయుడు, విద్యా వలంటీర్ నీటి ఉధృతికి కొట్టుకుపోయి మరణించారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ పాఠశాలకు పంపడమే మానేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారు సూరంపేటలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దుస్థితి ఇది. గత మే నెలలో ఆ పాఠశాలకు బదిలీపై ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు వచ్చారు. అక్కడి పరిస్థితి చూసి చలించిపోయారు. సొంత నిధులు లక్ష రూపాయలకు పైగా వెచ్చించి కాలువపై విద్యార్థుల రాకపోకలకు వీలుగా కాలిబాట వంతెన నిర్మించారు. పాఠశాలను బాగు చేయించి రంగులు వేయించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సీతారామరాజును కలెక్టరేట్‌కు ఆహ్వానించి సత్కరించారు. ప్రోత్సాహకంగా లక్ష రూపాయల చెక్కును అందజేశారు. ఆ నిధులను కూడా టీచర్ పాఠశాలకే వెచ్చించారు. తరగతి గదుల్లో టైల్స్ వేయించడంతో పాటు టాయిలెట్స్‌ను బాగు చేయించారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేయించడంతో పాటు గ్రీనరీ, ఇతర కార్యక్రమాల నిర్వహణ చేపట్టారు. ఒకప్పుడు ఇద్దరికి పడిపోయిన విద్యార్థుల సంఖ్య ఇప్పుడు పెరుగుతోంది. అనిశెట్టి సీతారామరాజు కృషిని మంత్రి లోకేశ్ అభినందించారు.


ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు


కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని సూరంపేట ఎంపీపీ పాఠశాలకు వెళ్లేందుకు కాలువపై నిర్మించిన కాలిబాట వంతెనపై విద్యార్థులు

అనంతపురం జిల్లా గుత్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ ల్యాబ్






మై మ్యాథ్స్ రాధిక

గణితం పట్ల విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు సి.రాధిక అనే టీచర్ పాఠశాలలో తన సొంత ఖర్చుతో మాథ్స్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆమె.. విద్యార్థులకు సులభమైన పద్ధతిలో గణితాన్ని బోధిస్తున్నారు. 2003లో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించారు. 2012లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2021లో బదిలీపై గుత్తిలోని బాలికల ఉన్నత పాఠశాలకు వచ్చారు. ఇక్కడి విద్యార్థినులు అన్ని సబ్జెక్టులలో చురుకుగా ఉన్నా, గణితం అంటే భయపడేవారు. వారిలో భయాన్ని తొలగించేందుకు టీచింగ్, లర్నింగ్ మెటీరియల్‌ను (టీఎల్ఎం) ఆమె సొంత డబ్బుతో తయారు చేశారు. పాఠశాలలో 400కు పైగా నమూనాలను రూపొందించి ల్యాబ్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని పెంపొందించారు. సాంకేతిక బోధన కోసం టీఎల్ఎం వీడియోను రూపొందించారు. 'మై మ్యాథ్స్ రాధిక' పేరుతో యూట్యూబ్ చానల్ ప్రారంభించి 800కు పైగా వీడియోలను పొందుపరిచారు. ఆమె ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం 2019లో జిల్లా, 2023లో రాష్ట్ర ఉత్తమ టీచర్‌గా ఎంపిక చేసి గౌరవించింది. హైదరాబాద్‌లోని ఐఐటీ రామయ్య ద్వారా 2019లో టీచర్ ఎక్సలెన్స్ అవార్డును ఆమె అందుకున్నారు.

మా మంచి మాస్టార్లు

విద్యార్థులే రచయితలుగా మాసపత్రిక

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం మంగళపల్లి హైస్కూల్‌లో మ్యాథ్స్ టీచర్ అరుణ శివప్రసాద్ మాసపత్రికను (మ్యాగజైన్) నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులే రచయితలుగా మారి ఇందులో కథనాలు రాస్తున్నారు. ఎంతో మంది వీఐపీలు మ్యాగజైన్ గురించి తెలుసుకుని పాఠశాలను సందర్శిస్తున్నారు. ప్రచురణకు సాయపడుతున్నారు. 2018 సెప్టెంబరులో 'మంగళ విద్యావాణి' పేరుతో మాసపత్రికను అరుణ శివప్రసాద్ సొంత ఖర్చుతో ప్రారంభించారు. తోటి ఉపాధ్యాయులు, దాతలు ముందుకొచ్చి ఆర్థిక సహకారం అందిస్తున్నారు. టీచర్స్ డే, ఉమెన్స్ డే, సైన్స్ డే, మ్యాథ్స్ డే, ఇంజనీర్స్ డే వంటి ప్రత్యేక రోజుల గురించి ఇతర మాధ్యమాల ద్వారా అవగాహన చేసుకుని విద్యార్థులు కథనాలు రాస్తున్నారు. చిత్రలేఖనం కోసం ప్రత్యేక పేజీని కేటాయించి ప్రోత్సహిస్తున్నారు. అరుణ శివప్రసాద్ 2012 నుంచే గణిత అవధానిగా ఉంటూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించారు. 2018 జూన్‌లో మ్యాథ్స్ మారథాన్ కార్యక్రమాన్ని నిర్వహించి వేద గణితంలో మెళకువల్ని విద్యార్థులకు నేర్పించారు. 2019లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డును అందుకున్నారు. ఇటీవల చిత్తూరు రూరల్ మండలం తమ్మిందపాళెం హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. దీంతో మంగళపల్లిలో హెడ్మాస్టర్ రాజ్యలక్ష్మి మ్యాగజైన్ బాధ్యతను తీసుకున్నారు.


మంగళ విద్యావాణి మ్యాగజైన్‌తో వ్యవస్థాపకుడు అరుణ శివప్రసాద్


దేవరపల్లిలో రవీంద్రనాథ్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన జిమ్

సొంత డబ్బుతో ఇండోర్ స్టేడియం

తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం రామన్నపాలెం ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పేరం రవీంద్రనాథ్ పనిచేస్తున్నారు. ఆయన గతంలో ఇతర ప్రాంతాల్లో పీఈటీగా పనిచేశారు. దేవరపల్లిలో తన సొంత నిధులతో పాటు దాతల సహకారంతో పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా చేశారు. క్రీడలకు కావాల్సిన అన్ని క్రీడా కోర్టుల నిర్మాణం చేపట్టారు. 2015లో పోలవరం కుడి కాలువ పనుల పరిశీలనకు వచ్చిన అప్పటి సీఎం చంద్రబాబు కోసం దేవరపల్లి జడ్పీ హైస్కూల్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. అక్కడ విద్యార్థుల క్రీడావిన్యాసాలు చూసి ముగ్ధుడైన చంద్రబాబు రవీంద్రనాథ్‌ను అభినందించారు. ఆయనను రాష్ట్ర యోగా కోర్సు కో-ఆర్డినేటర్‌గా, శాప్ డైరెక్టర్‌గా నియమించారు. 2015లో ఆయన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ప్రస్తుతం రెండోసారి శాప్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దేవరపల్లిలో సొంత డబ్బు రూ.10 లక్షల వ్యయంతో ఇండోర్ స్టేడియం నిర్మించారు. ఇదే ప్రాంగణంలో రూ.2 లక్షలతో స్టేజ్ ఏర్పాటు చేశారు. రామన్నపాలెంలో సొంత నిధులు రూ.3.5 లక్షలతో బాస్కెట్‌బాల్ కోర్టు, రూ.లక్షా 50 వేలతో స్టేజ్ నిర్మాణం చేశారు. పేద విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు సాయం చేస్తున్నారు. ఆయన శిష్యులు వివిధ కేటగిరీల్లో 650 మంది ఉద్యోగాలు సాధించారు. తమ క్రీడాకారులు పలు పతకాలు సాధించారని తెలిపారు. తన ఇంటిని జిమ్, యోగశాల, కంప్యూటర్ రూమ్‌గా మార్చి ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.


బోడపాడు స్కూల్ తరగతి గోడపై రాసిన పదాలను విద్యార్థులతో పలికిస్తున్న టీచర్ శ్రీనివాసులు

నాడు జవాన్.. నేడు మాస్టారు

సైనికుడిగా 17 ఏళ్ల పాటు దేశసేవలో ఉన్న పోలిశెట్టి శ్రీనివాసులు.. తర్వాత బీఈడీ పూర్తి చేసి 2012 డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించారు. ఉపాధ్యాయుడిగా ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం బోడిరెడ్డి (ఓబులక్కపల్లి)పాఠశాలలో చేరినప్పటి నుంచి సుమారు రూ.15 లక్షలతో బడి రూపురేఖలు మార్చేశారు. ప్రస్తుతం మార్కాపురం మండలం బోడపాడు ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్నారు. పాఠశాలలో వంటగది, రేకుల షెడ్ నిర్మాణానికి, టాయిలెట్ల కోసం దాతలతో పాటు తన సొంత నిధులు రూ.4 లక్షల వరకు ఖర్చుచేశారు. విద్యార్థులకు సులువైన పద్ధతిలో తెలుగు, ఇంగ్లిష్ పదాలను నేర్పించేందుకు బడి గోడపై ప్రత్యేకంగా పెయింట్‌తో రాయించారు. శ్రీనివాసులు ఉచితంగా నవోదయ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికి 17 మంది విద్యార్థులు నవోదయలో సీట్లు సాధించారు. మరో నలుగురు విద్యార్థులు ట్రిపుల్‌ఐటీలో సీట్లు పొందారు. పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పొరేట్ స్కూళ్లలో మాన్పించి ప్రభుత్వ బడిలో చేర్పిస్తున్నారు. గతంలో 60 మంది విద్యార్థులున్న ఈ బడిలో శ్రీనివాసులు వచ్చాక ఆ సంఖ్య 140కి చేరింది. పాఠశాలకు రెండు గదులే ఉండటం, అవి నిండిపోవడంతో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో దీనిపై కథనం రావడంతో మంత్రి లోకేశ్ హెచ్ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా 2024 డిసెంబరులో ఈ పాఠశాలను సందర్శించారు. చక్కని చేతిరాత, ప్రతిభను గుర్తించి ఆశ్చర్యపోయారు.


ప్రసన్న కుమారి


ఎస్టీ విద్యార్థులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రాజేంద్రప్రసాద్

ఉపాధ్యాయ దంపతుల ఉదారత

పాఠశాలలో బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల బాగోగులు చూడటం ఆ ఉపాధ్యాయ దంపతులకు ప్రవృత్తిగా మారింది. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతపై దృష్టి పెట్టడమే గాక వారి కుటుంబాలను ఆదుకోవడం దినచర్యగా మారింది. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెయ్యేరు ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్రప్రసాద్, చినపాలపర్రు ఎలిమెంటరీ పాఠశాల హెచ్ఎం ప్రసన్నకుమారి నిరుపేద విద్యార్థులకు ఎంతో సాయం చేస్తున్నారు. 2011లోనే చేయూత ఫౌండేషన్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఇద్దరూ తమ జీతాల నుంచి కొంత సొమ్మును ఫౌండేషన్‌కు కేటాయిస్తున్నారు. ఏటా 15 ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకుని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, ఇతర స్టడీ మెటీరియల్, హైస్కూల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్నారు. ఎస్టీ విద్యార్థులకు కాస్మోటిక్స్ అందించారు. పాఠశాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించారు. ఈ ఉపాధ్యాయ దంపతుల సేవలను గుర్తించి పలు గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగాయి. చేయూత ఫౌండేషన్ ద్వారా 14 ఏళ్లుగా తమ జీతాల నుంచి సుమారు రూ.11 లక్షలు నిరుపేద విద్యార్థులకు ఖర్చు చేయడం విశేషం.

వినూత్న తరహాలో ఇంగ్లిష్ బోధన

శ్రీకాకుళం జిల్లా బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిష్) ఆసుపాన మధుబాబు వినూత్న తరహాలో బోధిస్తున్నారు. ఇంగ్లిష్ పట్ల విద్యార్థులలో భయాన్ని తొలగించి సులభంగా అర్థమయ్యేలా నేర్పిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోల్‌ప్లే, స్టోరీ టెల్లింగ్ ద్వారా పదాల కూర్పు, కొత్త పదాలను వినియోగం, చిన్నచిన్న పదాలతో ఆంగ్లభాషలో నైపుణ్యం పెంపొందించడం చేస్తున్నారు. ముఖ్యంగా టాయ్‌బేస్డ్ పెడగాజీ విధానంలో ఇంగ్లిష్‌ను ఇద్దరు విద్యార్థులతో మాట్లాడిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ పట్ల భయాన్ని తొలగించి ఆత్మస్థైర్యం పెంపొందిస్తున్నారు. డిజిటల్ విద్యావిధానం ద్వారా విద్యార్థులు ఇంగ్లిష్‌పై పట్టు సాధించేలా చేస్తున్నారు.




విద్యార్థుల కోసం ఆటో



సులభ పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించడమే కాదు విద్యార్థుల సౌకర్యాల కోసం ప్రతినెలా జీతంలో కొంత డబ్బు ఖర్చు చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం భరణికం పంచాయతీ బాపడుపాలెం మండల పరిషత్ పాఠశాల ఉపాధ్యాయుడు కొరుపోలు గంగాధరరావు.. విద్యార్థులను రోజూ తీసుకువచ్చేందుకు ప్రతి నెలా రూ.4 వేలు చెల్లిస్తూ అద్దె ఆటో ఏర్పాటు చేశారు. మధ్యాహ్న భోజన పథకం కోసం విద్యార్థులకు స్టీల్ కంచాలు, గ్లాసులు సొంత నిధులతో సమకూర్చారు. నాలుగేళ్ల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేశారు. పాఠశాలకు అవసరమైన సీలింగ్ ఫ్యాన్‌లు ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరాధ్య బెహరా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో స్థానం దక్కించుకోవడానికి కృషిచేశారు.

'జబర్దస్త్' మాస్టారు



బుల్లితెరపై తన నటనతో అందరినీ నవ్వించే జబర్దస్త్ సత్తిపండు (పీవీఎస్ సత్యనారాయణ) ఉపాధ్యాయుడిగా వినూత్నంగా విద్యా బోధన చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు చెందిన ఆయన బీఎస్సీ, బీఈడీ చేసి 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా చేరారు. ప్రస్తుతం పాయకరావుపేట మండలం గోపాలపట్నం ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)గా పని చేస్తున్నారు. పేరడీ సాంగ్స్, స్కిట్స్ ద్వారా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన చేస్తున్నారు. అలాగే తోలుబొమ్మల ప్రదర్శన ద్వారా విద్యార్థులు సింబల్స్ గుర్తించేలా పాఠాలు చెబుతున్నారు. నాటక రంగంలో ఆసక్తి గల ఆయన 2013లో జబర్దస్త్ టీమ్‌లో చేరారు.


పరమసముద్రం, గుడ్లనాయనిపల్లె గ్రామాల మధ్య గుట్టల మధ్య నుంచి కిందికి దూకుతున్న కృష్ణమ్మ

కుప్పంలో జల సిరుల సవ్వడి

కుప్పం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కుప్పం మండలం పరమసముద్రం మొరవ పారింది. నీటి విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు చెప్పినట్లు కుప్పం నియోజకవర్గానికి రెండేళ్ల ముందుగానే కృష్ణా పుష్కరాలు వచ్చేశాయి. హంద్రీనీవా కాలువలో ఉరకలెత్తి వస్తున్న కృష్ణా జలాలు, పరమసముద్రం చెరువు నిండి మొరవ పారి, వీరప్పనాయుని చెరువు వైపు వడివడిగా సాగుతున్నాయి. హంద్రీనీవా కాలువ చుక్క నీరు లేకుండా ఎండిపోయిందంటూ వైసీపీ వర్గాలు చేసిన ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తేలిపోయింది. శ్రీశైలం నుంచి 733 కిలోమీటర్లు ప్రయాణించిన కృష్ణమ్మ పరమసముద్రం చెరువును నింపి, మొరవల గుండా పారింది. పరిసర గ్రామాల ప్రజలు పిల్లాపాపలతో తరలివచ్చారు. కోళ్లను గావు ఇచ్చి గంగమ్మకు మొక్కులు తీర్చుకున్నారు.

2040లో చంద్రుడిపై జాతీయ జెండా ఎగరేస్తాం: ఇస్రో

పుట్టపర్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): 2040 నాటికి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రాకెట్‌ను చంద్ర మండలంలోకి విజయవంతంగా ప్రయోగిస్తామని, చంద్రుడిపై జాతీయ జెండాను పాతుతామని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో జరుగుతున్న కేరళ సంప్రదాయ ఓనం వేడుకల్లో గురువారం ఆయన పాల్గొన్నారు. అంతకుముందు ఆయన సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

స్థానికానికి చిక్కులు!

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించి కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అదే మాట మీద చంద్రబాబు ప్రభుత్వం నిలబడింది. అయితే, ఈదిశగా చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలు ఇంకా ప్రారంభం కాలేదు. మరోవైపు వచ్చే మార్చిలోగా పదవీకాలం ముగిసే మున్సిపాలిటీ స్థానిక సంస్థలకు 3నెలల ముందే ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి బుధవారం లేఖరాసింది. దీనికి సంబంధించిన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కోరింది. ఇదే లేఖలో బీసీ కులగణన ప్రస్తావన తెచ్చింది. ఈ పరిస్థితుల్లో.. గడువులోగా బీసీ కులగణన పూర్తి చేసి, షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జరపడం ఎంతవరకు సాధ్యమనే ప్రశ్న ప్రభుత్వ వర్గాల్లోనే వ్యక్తం అవుతోంది. బీసీ కులగణన ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాలు కమిషన్‌ను ఏర్పాటు చేసి ట్రిపుల్ టెస్ట్ ఫార్మాలిటీ నోటిపై చేయాలని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. తెలంగాణలో కులగణన చేసి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక ఎన్నికలకు సన్నద్ధమవడం గమనార్హం.

ట్రిపుల్ టెస్ట్ ఫార్మాలిటీ ప్రకారం...

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి.. బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో అమలు చేయాలంటే ముందుగా కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఈ కమిషన్ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో బీసీ కులగణన చేసి బీసీలకు ఏయే నియోజకవర్గంలో, ఏ మండలంలో, ఏ పంచాయతీలో ఏ మేరకు రిజర్వేషన్లు కేటాయించాలన్న విషయంపై నివేదిక రూపొందించాలి. మొత్తం ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు 50శాతం మించకూడదు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయడంలో భాగంగా గత ప్రభుత్వం హయాంలోని బీసీ కమిషన్ చైర్‌పర్సన్ జస్టిస్ శంకరనారాయణకు ట్రిపుల్ టెస్ట్ ఫార్మాలిటీ అమలు బాధ్యత అప్పగించారు. దీనికోసం ఆయన పదవీకాలం మరో మూడేళ్లు పెంచుతూ 2022 సెప్టెంబరు 20న ఆదేశాలిచ్చారు. ఆయనకు సహాయంగా మరో ముగ్గురు సభ్యులను నియమించారు. అప్పట్లో కొంతకాలం బీసీ కులగణనకు సంబంధించి కసరత్తు జరిగింది. అయితే, అప్పటి వైసీపీ ప్రభుత్వం బీసీ కమిషన్‌కు సహకరించలేదు. అవసరమైన డేటాను కమిషన్‌కు ఇవ్వకపోవడంతో ఈ ప్రక్రియ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. కాగా, 34శాతం బీసీ రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో కల్పించి తీరుతామని కూటమి ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. దానిప్రకారం మొత్తం రిజర్వేషన్లు 60శాతానికి చేరుకుంటాయి. ఇది ట్రిపుల్ టెస్ట్ ఫార్మాలిటీని అతిక్రమించినట్లవుతుంది. అప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికలు నిర్వహణకు సానుకూలత వ్యక్తం చేస్తుందా...అనే ప్రశ్న తలెత్తుతోంది. గత వైసీపీ ప్రభుత్వం 24 శాతం బీసీలకు అమలు చేసి చేతులు దులుపుతుంది. పైగా అప్పట్లో ట్రిపుల్ టెస్ట్ ఫార్మాలిటీ నిబంధనలపై ఎవ్వరూ కోర్టుకెళ్లకపోవడంతో ఎన్నికలు అడ్డంకులు లేకుండా జరిగాయి. ఇప్పుడు బీసీలకు రిజర్వేషన్లు ఎంత శాతం అమలు చేసినా...ట్రిపుల్ టెస్ట్ ఫార్మాలిటీ నిబంధనలు పాటించాలి. బీసీ కులగణన చేపట్టాలంటే కచ్చితంగా రెండున్నర నెలల సమయం పడుతుంది. అంటే ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కచ్చితంగా మూడు నెలలు పడుతుంది. ఇప్పుడు వెంటనే ప్రారంభించినా... డిసెంబర్ నెలాఖరుకు గానీ బీసీ కులగణన పూర్తి కాదు. ఆ తర్వాత ఎన్నికలకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

ఒకే గ్రామంలో 23 మంది చనిపోతే ఏం చేస్తున్నారు?

▸▸ వైద్య వ్యవస్థ ఏం చేస్తోంది?.. తురకపాలెం మరణాలపై మంత్రి సత్యకుమార్ ఆగ్రహం


తురకపాలెం ఘటనపై మంత్రి సత్యకుమార్ యాదవ్ సమీక్ష

అమరావతి, గుంటూరు మెడికల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఒక గ్రామంలో 3నెలల వ్యవధిలో 23 మంది చనిపోతే క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య వ్యవస్థ ఏం చేస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు రూరల్ మండలం, తురకపాలెంలో చోటుచేసుకున్న వరుస మరణాలపై గురువారం ఆయన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, డీఎంఈ డాక్టర్ జి. రఘునందన్‌తో సమీక్ష జరిపారు. కేవలం వ్యవస్థాగత లోపాల కారణంగా ఇంత నష్టం జరిగిందని, స్థానిక ఏఎన్ఎంలు, మిగతా సిబ్బంది ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తురకపాలెం ఘటన నేపథ్యంలో సర్వైలెన్స్ (నిఘా) వ్యవస్థలో తగిన మార్పులు చేయాలన్నారు. కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, ప్రత్తిపాడు శాసన సభ్యుడు బూర్ల రామాంజనేయులు, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీతో కలసి గురువారం కమిషనర్ వీర పాండియన్ ఆ గ్రామంలో పర్యటించారు. ఉచిత వైద్యశిబిరాన్ని పరిశీలించి బాధితులకు అందిస్తున్న వైద్యసేవలను, పరీక్షల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గవిడి రాయి ఒరగడం వల్లే అనర్థం!.. గ్రామస్థుల అనుమానం

గ్రామ తాగునీటి అవసరాల నిమిత్తం తమకు కేటాయించిన ట్యాంకు, సంపు కలుషితమయ్యాయని అధికారులకు స్థానికులు తెలిపారు. తమ గ్రామానికి వచ్చే రహదారుల్లో దుష్టశక్తులు ప్రవేశించకుండా గవిడి రాళ్లను ఏర్పాటు చేసుకున్నామని, వీటిలో దక్షిణ దిశలో ఉన్న గవిడి రాయి పక్కకు ఒరిగి పోయిందని, అందుకే చావులు కొనసాగుతున్నాయని చెప్పారు. దీంతో కలెక్టరు, అధికారులు ఆశ్చర్యపోయారు. గడివి రాయిని సరిగ్గా నిలబెడితే వరుస మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చని గ్రామస్థులు చెప్పడంతో, సరిచేయాల్సిందిగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో ఒరిగిపోయిన గవిడి రాయిని సరిచేసి యథాస్థానంలో ఉంచారు. కాగా, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం తురకపాలెంలో పర్యటించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.